

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సంక్రాంతి శుభాకాంక్షలు



సోమవారం | 15-1-2018 | పేజీలు: 18 + 24 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 271 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి తె. 5.12 తదుపరి అమావాస్య; నక్షత్రం: మూల సా. 4.19 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: మ. 2.31-4.19, తె. 3.08-4.56; దుర్ముహూర్తం: మ. 12.47-1.32, మ. 3.00-3.44; అమృతఘడియలు: ఉ. 9.06-10.55; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.57 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

కైట్ స్వీట్



సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్‌లో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వీట్, కైట్ ఫెస్టివల్ సందర్శకులతో కిటకిటలాడింది. ఆదివారం మూడు లక్షల మంది దీనిని వీక్షించారు.

కోళ్ల ఫైట్



కొత్త రూట్



కృష్ణా జిల్లా ఈడుపుగల్లులో కోడి పందేల దృశ్యమిది. ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఆదివారం రూ.50 కోట్లకు పైగా పందేలు సాగాయి. కోళ్లకు కత్తులు కట్టి మరీ నిర్వహించిన ఈ పందేలను పలువురు ఎమ్మెల్యేలు దగ్గరుండి జరిపించారు. హైదరాబాద్ నుంచి వేలాది మంది ఈ కోడి పందేలను చూసేందుకు తరలివెళ్లారు; మరోవైపు కోళ్లకు పోటీగా పందులు కూడా సంక్రాంతి బరిలోకి దిగాయి. అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన ఈ పోటీలకు కూడా తెలంగాణ నుంచి అనేక మంది హాజరయ్యారు. పోటీల్లో ఒక పంది లక్షరూపాయల బహుమతి గెలుచుకుంది.

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' సంక్రాంతి శుభాకాంక్షలు.

సెలవు

సంక్రాంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయాలకు సోమవారం సెలవు. మంగళవారం (16-1-2018) సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

-మేనేజింగ్ డైరెక్టర్

మెరుపు 'పంచ్'

ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు?

విపక్షాలకు సమయం ఇవ్వొద్దనుకుంటున్న టీఆర్ఎస్

ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగిసేవరకూ కొత్తవారికి శిక్షణ

సహకార సంఘాల పదవీ కాలం ఆరు నెలలు పొడిగింపు

సర్కారు యోచన.. రేపు కలెక్టర్లతో సీఎం కేసీఆర్ సమావేశం

22న కేబినెట్ భేటీ, 23, 24 తేదీల్లో అసెంబ్లీ, మండలి సమావేశాలు





హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు గడువుకు ముందే ఎన్నికలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అన్నీ అనుకున్న ప్రకారం జరిగితే ఫిబ్రవరి రెండో వారంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జూలై 31వ తేదీతో ముగియనుంది. అయితే అంతకంటే మూడు నెలల ముందే ఎన్నికలను నిర్వహించుకునే వెసలుబాటు చట్టంలో ఉంది. ఈ మేరకు ముందస్తు పంచాయతీ ఎన్నికలకు సమరశంఖం పూరించాలని సర్కారు భావిస్తోంది. కొత్త పంచాయతీరాజ్ చట్టం రూపకల్పన కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తన నివేదికను శనివారం రాత్రి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను చేపట్టేందుకు అవసరమైన కసరత్తును వీలైనంత త్వరగా పూర్తిచేసి.. వెంటనే ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పెద్దలు ఉన్నారు. తొలుత షెడ్యూల్ ప్రకారం 2019లో జరగాల్సిన సాధారణ ఎన్నికలకు ముందు పంచాయతీ ఎన్నికలకు వెళ్లడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ, సీఎం కేసీఆర్ మాత్రం నిర్ణీత గడువులోగా పంచాయతీ ఎన్నికలకు వెళ్లేందుకే మొగ్గు చూపుతూ వస్తున్నారు. అదే సమయంలో ఈ ఎన్నికలకు విపక్షాలు తగిన విధంగా

మిగతా 16వ పేజీలో...

సంధానానికి ససేమిరా

గోదావరి-కావేరి ప్రతిపాదనతో నష్టం

మహానది నుంచి నీళ్లు తెస్తే మాత్రం ఓకే

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

కేంద్రానికి స్పష్టం చేయాలని భావన

గోదారిలో నీళ్లే లేవు.. తరలింపు ఎలా అని ప్రశ్న

17న ఢిల్లీలో సమావేశం

హాజరుకానున్న హరీశ్

16



కార్పొరేట్ ఆస్పత్రులు

విదేశీ గుప్పిట్లో

టాప్ టెన్ ఆస్పత్రుల్లో అధిక వాటా విదేశీ కంపెనీలదే

కల్పతరువుగా 'ఆరోగ్యశ్రీ', ఉద్యోగుల హెల్త్ స్కీం

ఆరోగ్య శ్రీ కింద ఏటా సర్కారు 700 కోట్ల ఖర్చు

ఇందులో 70% ప్రైవేటుకే

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్.. హెల్త్ రాజధాని! అందుకే, విదేశీయులూ ఇక్కడికి చికిత్స కోసం వస్తారు. ఇప్పుడు చికిత్స కోసం మాత్రమే కాదు.. పెట్టుబడులు పెట్టడానికి ఎగబడుతున్నారు. ఇక్కడి మన ఆరోగ్య రంగం పెట్టుబడులు పెట్టడానికి వారికి ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇక్కడి ఆస్పత్రుల్లో పెట్టుబడి పెడితే.. స్వల్ప కాలంలోనే భారీగా లాభాలు సంపాదించవచ్చనే ఉద్దేశంతో పలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెద్ద మొత్తంలో వాటా తీసుకుంటున్నాయి. వెనుకా ముందు ఆలోచించకుండా అడిగినంత పెట్టుబడి పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకొస్తున్నాయి. తద్వారా భాగ్యనగరంలో వేళ్లానుకుపోయిన

మిగతా 16వ పేజీలో...

భారత్-ఇజ్రాయెల్ స్మరణలో

హైదరాబాద్ సాహసం!

వందేళ్ల నాటి వీరోచిత పోరాటం

టర్క్‌లను ఓడించిన హైదరాబాద్ అశ్వదళం

నాటి విజయస్మారకమే తీన్‌మూర్తి

సందర్శించిన నెతన్యాహు-మోదీ

18

రాజీ చర్చలు!

నేడు ఫుల్ కోర్టు భేటీకి అవకాశం



సీజేఐని కలిసిన బార్ కౌన్సిల్

జస్టిస్ చలమేశ్వర్ సహా పలువురు జడ్జీలతోనూ సమావేశం

నలుగురి వాదనలో నిజముంది

పారదర్శకంగా కేసులు కేటాయించండి

సీజేఐకి మాజీ జడ్జీల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ, జనవరి 14(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సంక్షోభాన్ని నివారించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మనన్ కుమార్ మిశ్రా నేతృత్వంలో ఏడుగురు సభ్యుల న్యాయవాదుల బృందం ప్రధాన న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసింది. సుదీర్ఘంగా మంతనాలు జరిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాతో కలిసి 50 నిమిషాల పాటు సమావేశమైన బృందం బయటకు వచ్చి సమస్య సామరస్యంగా పరిష్కారం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. సంక్షోభాన్ని త్వరలోనే పరిష్కరిస్తానని ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. విలేకరుల సమావేశం పెట్టి ప్రధాన న్యాయమూర్తిపై తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తుల్లో

మిగతా 18వ పేజీలో...



ఇంటర్నెట్ దుష్ప్రభావాలపై

బోధన!

స్కూలు పాఠ్యాంశాల్లో చేర్చనున్న కేంద్రం?

18

'శత్రు' ఆస్తుల వేలం!

కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ

లక్ష కోట్ల ఆదాయం?

పే కమిషన్లు ఇక ఉండవు?

కేంద్ర ఉద్యోగుల జీతాల సవరణకు వేరే మార్గాలు

న్యూఢిల్లీ, జనవరి 14: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల పెంపునకు సంబంధించి ఇకపై పే రివిజన్ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండా వేరే మార్గాల్లో జీతాలను సవరించాలని ప్రభుత్వం భావిస్తోందా? విశ్వసనీయవర్గాలు ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. ఆంగ్ల పత్రిక ఒకటి దీనిపై ఒక కథనాన్ని ప్రచురించింది. ఉద్యోగుల వేతనాల సవరణకు మోదీ సర్కారు కొత్తగా పే కమిషన్‌ను నియమించదని, ఈ మేరకు గట్టి నిర్ణయం తీసుకుందని ఆర్థిక శాఖ ఉన్నతాధికారిని ఉటంకిస్తూ అందులో పేర్కొంది. ధరల పెరుగుదల ఆధారంగా ఉద్యోగుల జీతాలను ఏటా సవరించాలని.. ఏడో వేతన సంఘం సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. కేంద్రం ఆ దిశగా ఆలోచిస్తోందని సమాచారం.





మూర్తిపూజలో అంతరార్థం..

పరంజ్యోతి

Paramjyothi

ఒకసారి అల్వార్ సంస్థానపు రాజు మంగళ్‌సింగ్.. స్వామి వివేకానందను కలుసుకొన్నారు. ఆయనకు పాశ్చాత్యవ్యామోహం ఎక్కువ. భారతీయుల విగ్రహారాధనకు కారణం అజ్ఞానమేనని భావించేవాడు. అందుకే వివేకానందుని కలిసినప్పుడు.. 'స్వామీ నాకు విగ్రహారాధన పట్ల నమ్మకం లేదు. నా గతి ఏమవుతుంది?' అని ప్రశ్నించాడు. వెంటనే వివేకానందుడు.. ఆ సంస్థానపు దివాన్ మేజర్ రామచంద్రను పిలిచి గోడపైనున్న రాజుగారి చిత్రరువుపై ఉమ్మి వేయాల్సిందిగా ఆదేశించారు. దానికాయన.. రాజుగారి చిత్తరువుపై తాను ఉమ్మి వేయలేనన్నాడు. చిత్తరువుపై ఉమ్మి వేస్తే రాజుగారిపై ఉమ్మి వేసినట్లు కాదు కదా అన్నారు స్వామి. అయినా ఎవరూ సాహసించలేదు. అప్పుడు వివేకానందుడు రాజును ఉద్దేశించి.. 'రాజా ఈ చిత్రం మీ ప్రతిబింబం మాత్రమే. కానీ దీన్ని చూసినప్పుడు వారి మదిలో మీరే మెదిలారు. అందువల్ల మీ పట్ల చూపే మర్యాద ఆ చిత్తరువు పట్ల కూడా చూపిస్తున్నారు. అలాగే రాయి, మట్టి, చెక్కలతో చేసిన దైవ విగ్రహాల పట్ల కూడా భక్తుల ఆరాధన అలాగే ఉంటుంది' అని చెప్పారు. నిరాకార తత్వాన్ని చేరాలంటే విగ్రహం ఒక కిటికీ లాంటిది. నిగ్రహం కోసం విగ్రహం కావాలి.



అది కలిగాక విగ్రహం అవసరం ఉండదు. సకారాత్మకత లేకుండా సత్యశోధన చాలా కష్టం. విగ్రహాన్ని ఆరాధించడం.. చిత్తానికి ఏకాగ్రతను, ఆత్మ తృప్తిని కలిగించి మనిషిని యోగ మార్గం వైపు తీసుకెళ్తుంది. విగ్రహంపై పరమాత్మ స్వరూపస్వభావం బ్రహ్మభావన కలిగిస్తుంది. మనచుట్టూ ఆవరించి ఉన్న విశ్వాకారుడైన పరమాత్మతో అనుసంధానం కలిగించే ప్రాథమిక విద్య విగ్రహారాధన. అస్పష్టంగా ఉన్న తత్వాన్ని స్పష్టంగా ఉన్న మాధ్యమం సాయంతో చేరేందుకు నిర్మించిన ఆధ్యాత్మిక వంతెన అది.

-డాక్టర్ పి.భాస్కర యోగి





ప్లేస్‌మెంట్ల కేంద్రం!

80% క్యాంపస్‌లోనే.. నూరు శాతానికీ ఉద్యోగాలు

సవాళ్లు, సమస్యలకు సమాధానం 'మద్రాస్ ఐఐటీ'

మూడో ఏడాదిలోనే ఎంపిక.. ఒక్కొక్కరికి 3 కంపెనీల ఆఫర్లు.. తెలుగు రాష్ట్రాల ఇంజనీరింగ్ కాలేజీలకు ఆదర్శం

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అది దేశంలోనే నంబర్ వన్ విద్యా సంస్థ! ప్రపంచంలోని 50 అత్యున్నత విద్యా సంస్థల్లో ఒకటి! స్టాన్‌ఫోర్డ్, ఎంఐటీ, హార్వర్డ్ విశ్వవిద్యాలయాలకు సమానంగా పరిశోధనలు జరుగుతాయక్కడ! అవి కూడా పరిశ్రమల ఆధారంగా! అందుకే అక్కడ 80%కు పైగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఉంటాయి. 100% ఉద్యోగాలు లభిస్తాయి! దేశమంతా క్యాంపస్ సెలక్షన్ల సంక్షోభం నెలకొన్నా అక్కడ మాత్రం ఒక్కో విద్యార్థి కోసం ఏకంగా మూడు కంపెనీల నుంచి ఆఫర్లు ఎదురు చూస్తూ ఉంటాయి. ఇక్కడి సరాసరి వార్షిక ప్యాకేజీ రూ.15 లక్షలు! అదే.. చెన్నైలోని 'మద్రాస్ ఐఐటీ'! అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యకు దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాది మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్న తరుణంలో మద్రాస్ ఐఐటీ మార్గం మన ఇంజనీరింగ్ కళాశాలలకు ఆదర్శం, అనుసరణీయం.

కంప్యూటర్ సైన్స్‌లో 93%

కంప్యూటర్ సైన్స్, ఐటీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయన్న ఆందోళన ఉన్నా.. ఐఐటీ మద్రాసులో అలాంటి ఛాయలే కనిపించవు. సమస్యల్లోంచి వీరు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నారు. ఉద్యోగాలను ఆటోమేషన్ హరిస్తోందంటూ ఆందోళనలు వ్యక్తమవుతుంటే.. ఇక్కడ ఆటోమేషన్‌పైనే పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెంట్ సిస్టమ్స్, హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్, డేటా అండ్ నాలెడ్జ్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ అండ్ హార్డ్‌వేర్ సిస్టం డిజైన్ వంటి 7 అంశాలపై ఇక్కడ ఏర్పాటు చేసిన పరిశ్రమలతో అనుసంధానమై విద్యార్థులు నిత్యం పరిశోధనల్లో తలమునకలై ఉంటారు. ఇక్కడి సీఎస్ఈ విద్యార్థులకు సరాసరి వార్షిక ప్యాకేజీ ఈ ఏడాది 15-20 లక్షలకు చేరింది. ఈ ఏడాది బీటెక్, ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ విద్యార్థులు మొత్తం 108 మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్ల కోసం పేర్లు నమోదు చేసుకోగా 96 మంది (93.20%)కి కంపెనీలు భారీప్యాకేజీలతో ఉద్యోగాలిచ్చాయి. ఇక్కడి 15 కోర్సుల్లో అత్యధికంగా ఎంపికైంది సీఎస్ఈ విద్యార్థులే!



రీసెర్చ్ పార్క్.. విద్యార్థులు, పరిశ్రమలకు అనుసంధానం

పరిశోధనలు, అభివృద్ధి(ఆర్&డీ)కి ఐఐటీ మద్రాసు పెద్దపీట వే స్తోంది. ఇది అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థగా రాణించడానికి ప్రధానకారణం పరిశోధనలే. పరిశ్రమలు, విద్యార్థులకు అనుసంధానంగా క్యాంపస్‌లోనే 12 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి రీసెర్చ్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. 100 లేబొరేటరీలు నెలకొల్పారు.ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్టాన్‌ఫోర్డ్, ఎంఐటీ, హార్వర్డ్‌లకు సమానంగా వసతులు, సౌకర్యాలు కల్పించారు. దీనిని 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 8 ఏళ్ల క్రితం ఏర్పాటుచేశారు. ఐఐటీ మద్రాసు డైరెక్టర్, ప్రొఫెసర్లు, తమిళనాడు ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ ల అధిపతులతో కూడిన 10 మంది దీని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు. ఇక్కడ 15 కోర్సులతో పాటు పీజీ స్థాయిలో మాస్టర్ ఆఫ్ సైన్స్-రీ సెర్చ్, మాస్టర్ ఆఫ్ సైన్స్-ఆంత్రప్రెన్యూర్‌షిప్ కోర్సులు నిర్వహిస్తోంది. పారిశ్రామిక అవసరాలు తెలుసుకుంటూ ఏడాది పొడవునా పరిశోధనలు సాగుతూనే ఉంటాయి. టాటా, కాగ్నిజెంట్, అశోక్ లేలాండ్ వంటి 24 జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు తమ ఆర్&డీ కేంద్రాలను ఇక్కడే నెలకొల్పాయి. అనేక అంకుర సంస్థ(స్టార్టప్స్)లకు ఇది కేంద్రంగా ఉంది. 16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో త్వరలో మరో టవర్ రానుంది. అనేక కంపెనీలు క్యాంపస్‌కు రావడానికి ముందే రీసెర్చ్ పార్క్‌లోని కంపెనీలు తమతో అనుసంధానమై ఉన్న విద్యార్థులకు అత్యధిక ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులను తృతీయ సంవత్సరంలోనే ఎంపిక చేసుకోవడం విశేషం.



ఎందుకు నంబర్-1..?

కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) గత ఏడాది దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యా సంస్థలకు ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో మద్రాస్ ఐఐటీ మొదటి స్థానం దక్కించుకుంది. ఇందుకు కారణం.. ఇక్కడ ఉన్న 554 మంది బోధనా సిబ్బంది ఎంటెక్, పీహెచ్‌డీ అర్హత కలిగినవారే. పరిశోధనల్లో అపార అనుభవం గడించినవారు. ఇక్కడ అత్యున్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనశాలలు, గ్రంథాలయాలు ఉన్నాయి.ఈ-పుస్తకాలు, వేలాది ప్రచురణలు వెలువడుతున్నాయి. విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీ య స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేటెంట్ల సాధన, తద్వారా ఆర్జించిన ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉంది.

ఎన్పీటెల్ వీడియోలతో ఐఐటీ స్థాయి నాణ్యత

'ఆంధ్రజ్యోతి'తో మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి



ఇంజనీరింగ్ కాలేజీల్లో నాణ్యమైన విద్య లభించకపోవడమే నిరుద్యోగానికి ప్రధాన కారణమని మద్రాసు ఐఐటీ బయోటెక్నాలజీ ఆచార్యులు ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. సాధారణ ఇంజనీరింగ్ కళాశాలలు, ఐఐటీలకు మధ్య తేడా నాణ్యత మాత్రమే అన్నారు. మద్రాసు ఐఐటీతోపాటు వివిధ దేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో విద్యా విధానాన్ని అధ్యయనం చేసిన ఆయన ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఐఐటీల్లో మాత్రమే నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య లభిస్తుందనడం అపోహ మాత్రమే. పరిశోధనల్లో అనుభవజ్ఞులైన ఆచార్యులు ఉంటే ఐఐటీ కంటే మెరుగైన నాణ్యతను పొందవచ్చు. సిలబస్‌తో సంబంధం లేకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరుగుతుండాలి. పరిశ్రమలతో కలిసి ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టాలి. వాటిలో విద్యార్థులను భాగస్వాములను చేస్తే నైపుణ్యం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. విశ్లేషణ(అనలిటికల్) సామర్థ్యాన్ని పెంచుకోవాలి. తరగతి గది శిక్షణ తగ్గించి ప్రయోగశాల శిక్షణను పెంచాలి. థియరీలతో పోలిస్తే ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా తొలి సెమిస్టర్ నుంచే ఇంటర్న్‌షిప్ అనుభవం సాధించాలి. ఉద్యోగ నియామకానికి ఇది అత్యంత కీలకం. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి దేశంలోని అన్ని ఐఐటీలు కలిసి 'ఎన్పీటెల్' ప్రాజెక్టును అమలు చేస్తున్నాయి. అన్ని విభాగాల ఐఐటీ ప్రొఫెసర్ల వీడియో పాఠాలు ఈ వెబ్‌సైట్‌లో ఉంటాయి. పరిశ్రమల ఏర్పాటుకు కళాశాలలు కూడా 'క్యాంపస్ ఆంత్రప్రెన్యూర్'లను ప్రోత్సహించాలి.



విద్యార్థులే నిర్ణేతలు

ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు(ఏఐ), అంతర్జాతీయ మార్పు ల వల్ల దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లోనూ క్యాంపస్ ప్లేస్‌మెంట్లు తగ్గుముఖం పట్టాయి. కానీ,మద్రాస్ ఐఐటీ పరిస్థితి వేరు. ఇక్కడి పట్టభద్రుల కోసం కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఈ ఏడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో 1125 మంది రిజిస్టర్ చేసుకోగా 80%కు పైగా ఎంపికయ్యారు. మిగిలిన 20% బయటి కం పెనీల్లో ఉద్యోగాలు పొందారు. క్యాంపస్ సెలక్షన్లలో 13 మంది విద్యార్థులను 3 కంపెనీలు భారీ ప్యాకేజీతో ఎంపిక చేసుకోగా 99 మంది 2 కంపెనీలకు ఎంపికయ్యారు. ఇతర కాలేజీల్లో ఏ విద్యార్థులను ఎంపిక చేసుకోవాలో కంపెనీలు నిర్ణయిస్తుంటే ఇక్కడ మాత్రం ఏ కంపెనీని ఎంపిక చేసుకోవాలో విద్యార్థి నిర్ణయిస్తున్నాడు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	9.9	32.5
రామగుండం	15.8	32.8
హైదరాబాద్	15.9	32.0
వరంగల్	17.5	30.0
ఖమ్మం	19.0	33.0

తగ్గిన చలి తీవ్రత!

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈసారి సంక్రాంతికి చలి తీవ్రత తగ్గినట్లు వాతావరణశాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో పలు చోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఆదివారం నిజామాబాద్, మహబూబ్‌నగర్, హకీంపేటల్లో 2 డిగ్రీలు, నల్లగొండలో ఒక డిగ్రీ మేరకు సాధారణం కంటే అధికంగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే హన్మకొండ, హైదరాబాద్, రామగుండంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాచలంలో 3, ఖమ్మం, మెదక్‌లలో ఒక డిగ్రీ మేర సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి.


హిందూ సంస్కృతిలో ఇమిడే ముస్లింలకే చోటు



దేశభక్తి ఉన్న ముస్లింలు కొందరే ఉన్నారు. భారత్ ఒక్కసారి హిందూదేశంగా మారిన తరువాత.. ఇక్కడి(హిందూ)సంస్కృతిలో ఇమిడిపోయే ముస్లింలు మాత్రమే దేశంలో ఉంటారు. మిగిలినవాళ్లు ఏ దేశంలోనైనా ఆశ్రయం పొందొచ్చు.

- సురేంద్రసింగ్, యూపీ బీజేపీ ఎమ్మెల్యే

మదర్సాల నుంచి ఐఏఎస్‌లే వస్తారు..



మదర్సాలు ఐఏఎస్‌లను తయారుచేస్తున్నాయి.. ఉగ్రవాదులను కాదు. అక్కడ విద్యనభ్యసించిన వారు పేరుప్రఖ్యాతులు సాధిస్తున్నారు. మదర్సా విద్యార్థులను ఉగ్రవాదులతో ముడిపెట్టడం హాస్యాస్పదం.

- సయ్యద్ ఘయూరల్ హాసన్ రిజ్వీ, జాతీయ మైనారిటీ కమిషన్ చైర్మన్ (షియాబోర్డు చీఫ్ వాసిం రిజ్వీ వ్యాఖ్యలపై..)

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.24	పాత ధర 66.88
కొత్త ధర రూ.75.37	కొత్త ధర 67.08
పెరిగింది : 13 పైసలు	పెరిగింది : 20 పైసలు



ముసేలితో కీళ్లవాతానికి చెక్

బెర్లిన్, జనవరి 14: ప్రతి రోజు ఉదయం ముసేలి, పండ్లు, కూరగాయలు తింటే ఎముకలు గట్టిపడి కీళ్లవాతం రాకుండా జాగ్రత్త పడవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీర్ఘకాలికంగా కీళ్లవాతం ఉన్నవారు ఫైబర్ ఎక్కువగా ఉండే ఈ ఆహారం తీసుకుంటే ఆ సమస్య నుంచి బయటపడవచ్చని జర్మనీలోని ఫ్రైడ్రిచ్ అలెగ్జాండర్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. మనం తినే ఆహారమే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వెల్లడించారు.



జంక్‌ఫుడ్‌తో రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం

బెర్లిన్, జనవరి 14: ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ తినడం వల్ల దీర్ఘకాలంలో రోగనిరోధక వ్యవస్థపై చెడు ప్రభావం పడే ప్రమాదం ఉందని జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ బోన్ శాస్త్రవేత్తలు తెలిపారు. కొవ్వు, చక్కెర ఎక్కువగా, ఫైబర్ తక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే వచ్చే బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లే జంక్ ఫుడ్ వల్ల కూడా ఏర్పడుతాయని వెల్లడించారు. దీని ప్రభావంతో ధమనులు గట్టిపడటం, మధుమేహం, తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

›› తెలుగు ధీరుడు..!



సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వివాదం నేపథ్యంలో గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేటలో జాస్తి చలమేశ్వర్‌కు అభినందనలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. చిలకలూరిపేటలోని నరసరావుపేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలో.. 'న్యాయవ్యవస్థ ప్రక్షాళన కోసం సమరశంఖం పూరించిన తెలుగు ధీరుడు జస్టిస్ చలమేశ్వర్' అని పేర్కొన్నారు. ఉమ్మడి హైకోర్టు న్యాయవాది, చిలకలూరిపేట నియోజకవర్గంలోని గణపవరం గ్రామానికి చెందిన వలేటి వీరలక్ష్మీనారాయణ దీనిని ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఈ ఫ్లెక్సీ ఉండటంతో అందరూ దీనిని ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- చిలకలూరిపేట



గాలి పటమా పద పద!

- ›› ఉత్సాహంగా కైట్, స్వీట్ ఫెస్టివల్..
- ›› పరేడ్ గ్రౌండ్స్‌లో జోష్.. ఒకేరోజు 3 లక్షలమంది
- ›› రెండు గంటల్లోనే మిఠాయిలు ఖాళీ

హైదరాబాద్, సిటీ, శంషాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మబ్బులను తాకుతున్నాయా అన్నట్టుగా ఎగురుతున్న రంగురంగుల పతంగులు.. దేశ విదేశాల నుంచి వచ్చిన కైట్ ప్లేయర్స్ సందడి.. స్టాళ్లలో నోరూరుంచే మిఠాయిలు!! సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కైట్, స్వీట్ ఫెస్టివల్‌లో అదే జోష్!! ప్రదర్శన రెండో రోజు సందర్శకుల తాకిడి మరింత పెరిగింది. ఆదివారం ఒకే రోజు 3 లక్షల మంది సందర్శకులు తరలిరావడంతో పరేడ్‌గ్రౌండ్స్ పరిసరాలు కిటకిటలాడాయి. విభిన్న ఆకృతులు, రంగులతో కూడిన వందలాది పతంగులను చూస్తూ.. స్వీట్లను ఆస్వాదిస్తూ సందర్శకులు పరవశించిపోయారు. పలు రాష్ట్రాలకు చెందిన విభిన్న రకాల స్వీట్లను కొనేందుకు ఉత్సాహం చూపడంతో రెండు గంటల్లోనే స్టాళ్లలోని స్వీట్లు ఖాళీ అయ్యాయి. ఆదివారం ఒక్కరోజే 3 వేలకేజీల స్వీట్లు అమ్మినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా కైట్, స్వీట్ ఫెస్టివల్‌కు అనూహ్యస్పందన వస్తోందని సాంస్కృతిక, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సోమవారం రాత్రితో స్వీట్, కైట్ ఫెస్టివల్ ముగుస్తాయి. మరోవైపు శంషాబాద్‌లో ఆదివారం కైట్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. స్థానిక ఎన్నారై, ఫస్ట్ డ్యూయల్ సిటిజన్ అవార్డు గ్రహీత ఇఫ్తికార్ హైమద్ షరీఫ్ ఈ వేడుకలను ప్రారంభించారు.

హైదరాబాదీ 'పందెం.. కోడి'!

బంజారాహిల్స్, జనవరి 14(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటే చాలు.. పందెంరాయుళ్లకు పండగే! ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేలు రెండు రాష్ట్రాలకు ప్రత్యేక ఆకర్షణ! రూ.కోట్లలో బెట్టింగ్‌లు జరుగుతుంటాయి. కోడి పందేలు నిర్వహించొద్దని కోర్టులు చెబుతున్నా.. పందేల జోరు మాత్రం తగ్గడం లేదు. గతంలో ఏపీకే పరిమితమైన కోడి పందేలపై ఇప్పుడు హైదరాబాద్ వాసులూ అమితాసక్తి చూపుతున్నారు. గోదావరి జిల్లాల్లో జరిగే పందేలకు నగరం నుంచి కోడి పుంజులను తీసుకొని మరీ వెళ్లడం విశేషం. కేవలం పందేల కోసమే 30% యువకులు, మధ్య వయస్కులు వెళుతున్నట్టు గతంలో ఓ సర్వే తేల్చి చెప్పింది. ఈ సంక్రాంతికి వారాంతంలో వరసగా సెలవులు రావడం కూడా కలిసొచ్చింది. మూడు రోజుల పాటు గోదావరి జిల్లాల్లోనే మకాం వేసేందుకు ఏర్పాట్లు చేసుకొని మరీ వెళ్లారు. శని, ఆదివారాల్లో విజయవాడ హైవే వాహనాలతో కిక్కిరిసిపోయింది. తొలిసారిగా బేగంబజార్, పాతబస్తీ నుంచి సుమారు 12 బృందాల మార్వాడీలు కోడి పందేలను ఆస్వాదించేందుకు వెళ్లారు. మరోవైపు పందెం కోళ్ల కోసం ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు పాతబస్తీలోని పహిల్వాన్‌ల వద్దకు వస్తారు. కొన్ని పుంజులకైతే రూ.లక్ష చెల్లించడానికి కూడా వెనుకాడరు. పహిల్వాన్‌లు కూడా పందెం కోళ్లను ప్రత్యేకంగా పెంచుతారు.



'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ట్రావెన్‌కోర్ బోర్డు ప్రశంస

- ›› 'ప్లాస్టిక్ ఫ్రీ శబరిమల' ప్రచారానికి అభినందనలు
- ›› మూణ్నెల్లుగా ప్లాస్టిక్ వినియోగం తగ్గిందని వెల్లడి

హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): 'ప్లాస్టిక్ ఫ్రీ శబరిమల' పేరుతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చేపట్టిన ప్రచారానికి ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు పాలకమండలి కితాబిచ్చింది. గడిచిన 3నెలలుగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రచారానికి.. తెలుగు రాష్ట్రాల భక్తులు బాసటగా నిలిచారు. ఇందులో భాగంగా.. వారు ప్లాస్టిక్ వినియోగించబోమని ప్రతిజ్ఞలు చేశారు. ఈ ప్రయత్నాన్ని ప్రశంసించిన ట్రావెన్‌కోర్ పాలకమండలి.. గత 3నెలలుగా సన్నిధానం, శబరిమల, పంపానది ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం తగ్గిందని తెలిపింది. మరోవైపు తమ సేవకు.. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి తోడవ్వడం సంతోషంగా ఉందని అఖిల భారత అయ్యప్ప సేవాసంఘం ప్రకటించింది. గతంలో కేరళ సర్కారు.. 'పుణ్యం పుంగావనం', 'క్లీన్ శబరిమల' కార్యక్రమాల ద్వారా ప్రత్యేకించి తెలుగు భక్తులను ప్లాస్టిక్ వినియోగించకూడదని కోరేది. దక్షిణాది రాష్ట్రాల దేవాదాయశాఖ మంత్రులతో గత ఏడాది ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో.. ప్లాస్టిక్ రహిత శబరిమల లక్ష్యాన్ని సాధించాలని కోరింది. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చేపట్టిన ప్రచారం ఒక ఉద్యమస్థాయిలో అయ్యప్ప భక్తుల్లోకి వెళ్లడంతో ఈ సారి 'క్లీన్ శబరిమల' లక్ష్యం చాలా వరకు నెరవేరిందని, ఈ కార్యక్రమానికి తమ సహకారం ఉంటుందని అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం ప్రకటించింది. సినీ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు సైతం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే.



పేదల తిరుగుబాటు

ఇళ్ల స్థలాలు కాపాడుకునేందుకు పోరాటం.. 'రియల్' వ్యాపారుల ఆక్రమణలపై కన్నెర్ర

- నెల రోజులుగా అక్కడే నివాసం
- మంచిర్యాలలో ముదిరిన వివాదం

మంచిర్యాల, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అదంతా అనాథ భూమి.. ఏళ్ల తరబడి ప్రభుత్వ రికార్డుల్లో అలాగే ఉంది. నాలుగేళ్ల కిందట దానిని పేదలకు పంపిణీ చేశారు. కానీ, స్వాధీనం చేయలేదు. దీంతో రియల్ గద్దలు దానిపై వాలాయి! అధికారుల సహకారంతో ఆ భూమి తమదేనని, తాము వారసులమని పేర్కొంటూ ఆక్రమణల పర్వానికి తెర లేపాయి. కబ్జా చేసి కొన్ని భవనాలు కూడా నిర్మించాయి. కానీ, ఇప్పుడు నిరుపేదలు తిరగబడ్డారు. తమ భూములను తమకు ఇవ్వాలంటూ పోరాటం ప్రారంభించారు. నెల రోజులుగా ఆ భూముల్లోనే తిష్ఠ వేశారు. పోలీసులు వచ్చి ఎక్కడ అడ్డుకుంటారోననే భయంతో రాత్రీపగలూ అక్కడే ఉండి నిరసన తెలుపుతున్నారు. మంచిర్యాలలోని కోట్ల విలువైన భూమి విషయంలో కొనసాగుతున్న వివాదం ఇది. 345 సర్వే నంబర్‌లో 208.9 ఎకరాల ప్రభుత్వ భూమి ఏళ్ల తరబడి అసైన్డ్, అనాథ భూమిగా రికార్డుల్లో ఉంది. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం.. దీనిని ప్రభుత్వ భూమిగా గుర్తించి 2,600 మంది పేదలకు పట్టాలు ఇచ్చింది. వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. అదే ఏడాది కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిని చదును చేయడంతో వివాదం మొదలైంది. ఈ విషయమై లబ్ధిదారులైన పేదలు ఐదేళ్లుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. పేదలు గుడిసెలు వేసుకోవడం, ఆ తర్వాత అధికారులు సర్దిచెప్పి వారిని పంపించడం పరిపాటిగా మారింది.


సర్వే నం.345లో ఇళ్లు నిర్మించుకుని ఆందోళన చేస్తున్న పేదలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మంచిర్యాల జిల్లాగా మారడంతో భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు విజృంభించారు. భూమిని ప్లాట్లుగా మార్చారు. వాటిలో దాదాపు 20 శాతం విక్రయించారు. వాటిలో సుమారు 300 మంది వరకూ ఇళ్లు కూడా కట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే, తమ భూములను తమకు ఇవ్వాలంటూ పేదలు పోరాటం ప్రారంభించారు. గత నెల 22 నుంచి గుడిసెలనే శాశ్వత నివాసాలుగా మార్చుకుని అక్కడే నిరసన తెలుపుతున్నారు. ఈ విషయాన్ని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, భూ పోరాట కమిటీలు, జిల్లా పాలనాధికారి, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయినా చర్యలు తీసుకోలేదు. స్థానిక అధికారులు రియల్ వ్యాపారులకే వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. సంకాంత్రి పండుగ తెల్లవారే భూములను ఖాళీ చేసి వెళ్లి పోవాలంటూ పేదలను రియల్ వ్యాపారులు హెచ్చరించడం ఇక్కడ కొసమెరుపు.

కూర రాజన్నకు తీవ్ర అస్వస్థత

సిరిసిల్ల క్రైం, జనవరి 14: జనశక్తి కేంద్ర కమిటీ కార్యదర్శి కూర రాజన్న (72) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొంత కాలంగా ఆయన గుండె ,కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రస్తుతం కిడ్నీలు దెబ్బతిని తీవ్ర అనారోగ్యంతో హైద్రాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతున్నారు. అంతకుముందు రాజన్నకు నాలుగుసార్లు గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేశారు. మరో వైపు రాజన్న తల్లి కూర మల్లమ్మ(96) అనారోగ్యంతో మంచంపట్టింది.

రైతు ఆత్మహత్య


వెంకటయ్య(ఫైల్)

సైదాపూర్, జనవరి 14: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఘన్‌పూర్‌కు చెందిన తిప్పారపు వెంకటయ్య (55) అనే కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటయ్య మూడెకరాల భూమి కౌలుకు తీసుకొని వరి, పత్తి సాగుచేశాడు.ఆశించినంత దిగుబడి రాలేదు. మూడు లక్షల రూపాయల వరకు అప్పులయ్యాయి. దీంతో శనివారం రాత్రిపురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.



మెద

ఊకొట్టినట్టు గుండెసప్పుడు
నడుస్తున్న అడుగుల సప్పుడు
తడికండ్లమీదికెల్లి ఎల్లి
గాలి బరువెక్కింది

నడుస్తూనే ఉన్న
లోపల బయట

సింత లోపలి సీకటిలో
ఓ కన్నీటి సుక్కను ముట్టిచ్చి

ఎలుమాడింది
ఎద్దుగుంజింది
పొద్దుగూకింది
వల పొలిగిన
మట్టి మల్లేసిన
పరకలేదు పరిగలేదు

సెరువుకింద పొలం

సెర్ల పాప
కట్టెక్కి కూసుంటే
సిక్కం సినబోయింది
గుమ్మి గుడ్లల్ల దిరిగింది

ఎంతకని ఎత్తిపోయను నాత్రిని
సిత్తం సొరికల్ల రాలిపడ్డ
అనాది మనాదిని
గుండెలమీన పేరుకున్న కాలాన్ని
మతిదాపులో
మర్నాగిలో వచ్చి

మెకమ్మై తిరిగితుంది
కలల గోడకు భయం పాకుతుంటే
పెయ్యి వణికి లేసిన

రేకలబారకముందె
దారిమీద దరికోసం
గోసిపెట్టి
కాశబోసుకుంది దినం

పెద్దలకు పెట్టిన పడి
పడమటికెక్కింది

వశబడ్డపొద్దు
కలవరింతనించి జారిపడ్డది

చెమటల్ని చేదుకున్న ఋతువులు
కాలం జెండాలు
ఒక్కొక్క ధ్యానపోస కలిసి
తపోమంద
కల్లములో కళ్ళు తెరిసిన మెద

■ మునాసు వెంకట్
99481 58163

పెళ్ళి తంతును చక్కదిద్దే కవిరాజు 'వివాహ విధి'



సొంత లాభం కొంతే కాదు, అంతా మానుకొని పరుల కోసం పాటుబడేవాళ్లు అప్పుడూ ఉన్నారు, యిప్పుడూ ఉన్నారు- అధిక సంఖ్యలో కాకపోయినా, అక్కడొకరు, యిక్కడొక్కరుగా. అటువంటి వారిలో త్రిపురనేని రామస్వామి ఒకరు. కవిరాజు త్రిపురనేని రచనలన్నింటా వ్యంగ్యము, వేళాకోళము కొంత పెళుసుదనం కన్పించవచ్చు. అందుక్కారణం ఆయన వాక్కొక బాకుగా సామాజిక అస్తవ్యస్తతలపై తిరుగుబాటుదారుడు కావటమే. అదంతా సమాజాన్ని ఉద్ధరించాలనే. తాము పరువుగా జీవిస్తూ యితరులు కూడ పరువుగా జీవించాలనే తాపత్రయాన్ని కలిగి వుండటమే. అటువంటి భావాన్ని కవిరాజు వ్యక్తపరచిన తీరు చూడండి:

"ఇతరులఁబర్వుతో బ్రదుకనిచ్చుట నెన్నఁడు నేర్చికొందు నా
యతమగు నీ ప్రపంచసుఖ మన్నది యొక్కటె నీ సుఖంబుగాఁ
బ్రతి దినమున్ స్మరించు సమభావము నెన్నఁడు నేర్చికొందువ
న్నతిఁ గనుచుండి నీ ప్రజలనారతమున్ నినుమెచ్చ మానవా!"

('ధూర్తమానవా!' శతకం నుండి)

సామాజిక సౌధాన్ని పటిష్ఠమైన పునాదులపైన పునర్నిర్మించేందుకు శక్తిమంతమైన సాధనం కుటుంబ వ్యవస్థ. కుటుంబ వ్యవస్థ సజావుగా సాగినంతకాలం సామాజిక వ్యవస్థకు ఢోకా వుండదు. కనుక కుటుంబ వ్యవస్థపై తగినంత శ్రద్ధ పెట్టాలి. ముందు మనం పెండ్లి ఎందుకోసం చేసుకుంటున్నామో అది మనకు తెలియాలి. అది నిదుర కళ్ల పెండ్లిండ్లలో (అర్ధరాత్రి, వేకువఝాము పెండ్లిండ్లు), సంస్కృత మంత్రాల ఘోషలో, బాజాభజంత్రీల రణగొణధ్వనుల మధ్య చెవికెక్కే అంశం కాదు. అలా చెవికెక్కని విషయం మనసుపై ముద్ర వేయటం జరిగే పని కాదు కదా.

పెండ్లి అవసరం ఏమిటో, దాంపత్య జీవితాన్ని ఎలా నిభాయించాలో, కుటుంబ శ్రేయస్సుకు పాటు పడుతూనే సమాజ సంక్షేమానికి దంపతులు ఏ విధంగా తోడ్పాటునందించవచ్చో తెలియజెప్పేందుకు కవిరాజు అవిరళ కృషి చేశారు. అర్థంకాని శ్లోకాల వల్ల ఫలితం లేదన్నారు. మంత్రాలలో మహిమ హుళక్కి అన్నారు. ఇదంతా వివరిస్తూ 'వివాహ విధి'ని అందించారు. 'వివాహ విధి' మూడవ కూర్పు ముందు మాటగా చెప్పిన ప్రకారం:

"చిన్ననాఁట నుండియుఁ బ్రజాక్షేమంకరములని నేను విశ్వసించిన
యభిప్రాయములను నిర్భయముగను, నిరాఘాటముగను వెలువరించు
నలవాటు కలదు. ఆ యలవాటు కలిమి చేతనే వివాహ విషయమున
నాకుఁగల యభిప్రాయములను నీ చిన్న పొత్తము మూలమున లోకమున కెఱిఁగించితిని."

పుస్తకం అందించి కవిరాజు కూర్చున్నది లేదు. ఎవరయినా పెండ్లి చేయించమని కోరితే వెంటనే భుజంపై తుండు వేసుకొని బయలుదేరేవారు. కార్య సాధనలో ఎన్ని యిబ్బందులెదురైనా వెనుకంజ వేసేవారు కాదు.

కవిరాజు 'వివాహవిధి' తొలికూర్పుకు తొలిపలుకులు రాస్తూ మానవ జీవితంలో వివాహం ఉత్కృష్టమైనదని చెప్పి అష్టవిధ వివాహాలను వివరించారు. ఆ కాలంలో వివాహం మర్యాదాబద్ధమన్నారు. పాశ్చాత్య సంసర్గం వల్ల పూర్వపు అభిప్రాయాలు చెల్లాచెదురయ్యాయన్నారు. మంత్రాలు సంస్కృత భాషలో వున్నందువల్ల వధూవరులకు తమ విధులు అర్థం కాకుండా పోతున్నాయని భావించారు. కనుక ఆ శ్లోకాల భావాలకు కొద్దిగా మార్పులు చేర్పులు చేసి వ్రాయటం జరిగింది. కవిరాజు భావనలో పెండ్లి విషయంలో వధూవరులే పాలికాపులు. యుక్తవయసు వచ్చిన వధూవరులకు తల్లిదండ్రులు ఉపదేశం చేయవచ్చుగాని నిర్బంధ పరచటం తగదన్నారు. పిల్లల పెండ్లిండ్ల విషయంలో ఇంటి పెద్దలు తమ యిష్టాన్ని నెరవేర్చుకునేందుకు మొండిపట్టు పట్టరాదన్నారు. తన 'వివాహవిధి' పెండ్లిండ్లలో జరిగే అనవసరపు ఖర్చుల్ని కూడా తగ్గించగలదని ఆశించారు.

రెండవ కూర్పు నాటికి కవిరాజులో ఉత్సాహం పెల్లుబికింది. తొలికూర్పుకు లభించిన ఆదరణ ఆయన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. నూటికి తొంభైమంది పెండ్లిసమయాన చదివే మంత్రాలు తెలుగులో వుంటేనే బాగుంటుందన్నారు. తొలికూర్పు, మలికూర్పుల నడుమ కవిరాజు తాము కూర్చిన 'వివాహ విధి'ని అనుసరించి ఏడు పెండ్లిండ్లు జరిపారు. ఐదారు రోజుల్లో మరో నాలుగైదు జరగగలవన్నారు. ఆ సందర్భంగా ఓ ఉదంతాన్ని యిలా వెల్లడించారు:

"మొన్న యొక్క స్నేహితుని పెండ్లికిఁబోయితిని. సుమారెనిమిది గంటలకుఁ బ్రారంభింపవలసిన వివాహ కార్యకలాపము పదిన్నర గంటలకు మొదలుపెట్టఁబడెను. ఇది ఇరువైపుల వారి యందెవరికిఁగష్టముగఁదోపలేదు. అనగా శుభలగ్నము శుభమునిచ్చునను నమ్మకమే ప్రజలకుఁబోయినది. పోకయెట్లుండును? పట్టాభిషేకమునకయి పెట్టఁబడిన లగ్నము శ్రీరామునకు వనవాసము దానముఁజేసినది. ప్రత్యక్షముగ నెన్నియో విపరీత ఫలముల నిచ్చిన లగ్నముల మనమెఱుంగుదుము. ఇట్టివన్నియుఁ జూచుచు లగ్నములకయి యింకఁబనుగులాటలెందుకు? లగ్నములు తిన్నఁగఁగుదురలేదని యే రోహిణి కార్తెలో నే రెండు జాములకో కుదిర్చి పెండ్లి పెద్దలకుఁ బెండ్లివారికిఁ జెప్పనలవి కాని చీకాకు గల్పించుట యుచితమా?" కనుక అందరికి అనువైన సమయాన్నే పాణిగ్రహణానికి తగిన సమయంగా ఎంచుకొని వివాహాలు చేయించేవారు. అర్ధరాత్రి, అపరాత్రి పెళ్ళిళ్ళంటే మండిపడేవారు.

భవిష్యత్తు యువకులది, వృద్ధులది కాదు. కనుక వాళ్లు నివసింపవలసిన సంఘాన్ని, అందులో నెలకొల్పవలసిన సంబంధ బాంధవ్యాల్ని కాలానుగుణంగా మార్పులు చేసే విషయంలో పెద్దలు అడ్డు తగలరాదు. ఇది ఈనాటి మాట కాదు. కవిరాజు యనభైయేండ్లనాడు చెప్పిన మాట.

అయితే మిడిమేలంగా యిప్పుడొక చిక్కు వచ్చి పడింది. పెండ్లి చేసుకొనగోరు అమ్మాయిలు రాత్రిపూట వెలుగులు విరజిమ్మే విద్యుద్దీపాల కాంతుల్లో నగలు, పట్టుబట్టల మెరుపుల మధ్య, మెహందీ వేడుకలతో పాటు బాజాల హోరులో జోరుగా జరగాలంటున్నారు. అటువంటి విద్యుద్దీపకాంతులకు, హంగామాలకు లక్షలాది రూపాయిలు వెచ్చించవలసి వస్తున్నది. ఉన్నవారికి యిబ్బందులు వుండకపోవచ్చును. ఇబ్బందులన్నీ 'లేని వారికే' కదా- అది కూడ తోటివారు తొడకోసుకుంటే తాము మెడకోసుకొన సిద్ధమైన వారి విషయమున యింక చెప్పవలసినదేమున్నది?!

అసలు నేటి వివాహ ఆహ్వానాలకు పరిమితులున్నాయా? ఖర్చు మాట అటుంచి ఆహ్వానించిన వారిలో వచ్చిన వారెవరో రాని వారెవరో గమనింపు వుంటుందా? తీరికగా సీ.డీ. పెట్టుకొని చూడవచ్చనే అభిప్రాయం వల్ల వధూవరులను పెండ్లి పీటలపై ఆశీర్వదించే తావున తోపులాటలు! వేదిక దిగివచ్చి చూచుకోగా కొందరి చెప్పులు మాయం! ఇంతటి గందరగోళాలు లేకుండా కొద్దిమంది ముఖ్యుల్ని ఫోను పైనే స్వయంగా ఆహ్వానించి పెండ్లిండ్లు జరిపించేవారు యిప్పటికీ వున్నారంటే నమ్మశక్యం గాకపోయినా సత్యదూరం కాబోదు. ముఖ పరిచయం గల ప్రతివారినీ వివాహవేడుకకు ఆహ్వానించి వధూవరులకు ఆశీర్వాదాలు అందించే సమయంలోనూ, భోజనశాల వద్దనూ తోపులాటలకు గురి చేయటం భావ్యం కాదు.

పూర్వం ప్రచారంలో వున్న ఎనిమిది రకాల పెండ్లిండ్లు మహాభారతం కాలం నాటికి ఐదు విధాలయ్యాయి. అప్పుడు రాక్షసం, గాంధర్వం కూడ విడనాడవలసినవిగా భావించబడినాయి. కవిరాజుగారికి 1930 నాటికి జరిగే పెండ్లిండ్లు యిలా కన్పించాయి: "నూటికిఁదొంబది తొమ్మిది గర్హ్యములగు వివాహములే. కన్యావరశుల్కములు లేని వివాహములు నేడు లేవు.... ఆస్తి యున్నచో సంబంధములు దొరకుట సుకరమైపోయినది. అందుచేతనే నేటి మన వివాహములు పాశ్చాత్య వివాహములకన్న నికృష్టములయినవి."

మరో వైపు నుండి గిర్వాణమునగల పెండ్లి మంత్రాలే చెవికి యింపుగా వుంటాయని జనం తలంచసాగారు. పెండ్లి ఆ విధంగా జరిగితేనే సకల ఐశ్వర్యాలూ, ఆయురారోగ్యాలు సమకూరగలవని విశ్వసింపసాగారు. అందువల్లనే కవిరాజు 'వివాహ విధి'ని సృజియించటం జరిగింది. వారి కృషి వృథాపోరాదు. యువత వివాహాలపై ఖర్చు తగ్గించి తామెందుకు వివాహం చేసుకోవాలో, దాని వలన తమకూ తమ కుటుంబానికేగాక అది దేశ సంక్షేమానికి ఏ విధంగా తోడ్పడుతుందో తెలుసుకొనవలసి వుంది. 'వివాహ విధి'ని ఆచరించవలసి వుంది.

■ రావెల సాంబశివరావు
99590 89630

(జనవరి 16న త్రిపురనేని రామస్వామి 75వ వర్ధంతి)

తుమ్మ ప్రేమ

యాపొద్దు నిన్నిస్టపడినాంటే సెప్తాను
మోజెందుకంటే సెప్పలేను

నువ్వు గొప్పోల్ల పిల్లవని
వాడ సెప్పినాకే తెలిసింది
ఎర్రతోలు తుమ్మ ఒల్లు యాడకుదుర్తదని ఎకసెక్కాలు
గుట్టుగా బ్రమిసినాను

ఇస్కూలుకు పోయొస్తుంటే
మర్రిసెట్టెనకాల్నుంచి ఎర్రిగా సూసినాను

ఎల్లమ్మ గుడికాడ న్యాస్తాలతో
నువ్వు పక పక ఎల్తుర్లా నగినపుడు
రాలిన నవ్వుల్ని బెరిస పిట్టై ఏరుకున్నాను

సిక్కెంటికల్ని మీయమ్మ
గోడ బొక్కలో కుక్కితే
గాలినై ఎత్తుకొచ్చి దిండు ఎనకాల దాసుకున్నాను

నీ పాత నోటుబుక్కుని
కోంటయ్య అంగట్లో దొంగిలించి
రేతిరంతా నీ సేతిరాతనూ, సుక్కల్నీ
మార్సి మార్సి సూసినాను

జాతర్లో మాలచ్చిమిలా మెర్సిపోతున్న నిన్ని
దిస్టి తగిల్యాల అందరి కండ్లు నాయి సేసుకొని
పానంగా సూసినాను

నువ్వు సీకి పారేసిన ఐస్ పుల్లని
దాసుకున్న నన్ని సూసి
నీ న్యాస్తం సూపుల్లో సిగ్గుతో సచ్చిపోయినాను


తిరునాల్లో బొమ్మ గుర్రమెక్కి
మారానిలా నువ్వు సుట్లు సుట్లు తిరుగుతోంటే
దుడ్లు ల్యాక కనుగుడ్లను నీసుట్టే తిప్పాను

మెరప తోట్లో నువ్వు ఎలుగై పరిగెడ్తావుంటే
నీ ఎనకాలే పొద్దు తిరుగుడు పూనయ్యాను

అన్ని సోట్లా నిన్ని ఇట్లా సూసి సూసి
నూనూగు మీసమై పోయాను

సమర్తాడిన నీ బిడియం కాలేజి దుక్కేసి నడిసింది
బస్సులో ఎల్తోన్న నిన్ని
గట్టు మీంచి సూసి దిగొస్తాంటే
కంచె ఏందో గొనిగింది.

■ టి. వెంకటేష్
99853 25362



వారాలు

ఆదివారం-
ఎగురుతూ వస్తుంది మెరుపు తీగలా,
సూర్యకిరణాల రెక్కలపైన,
స్వర్గపు బంగరు తలుపు తెరిచి.

సోమవారం లేస్తుంది
నరకపు వంటింటినుంచి
అడుగంటిన పాల కంపుతో
పొగ వాసనతో.

మంగళవారం,
భూమిలోని ఒక చీకటి తొర్ర నుంచి
పాకుతూ వస్తుంది
నెత్తురు కారుతూ
దెబ్బకి చితికిన పడగతో.

బుధవారం,
కడలి లోతుల్లోని పగడపు గట్టు దాటి
ఈదుతూ వస్తుంది
దాని పొడుగు తోకతో
పదునైన పళ్లతో, నల్లటి పొలుసుతో.


గురువారం,
ఎవరికీ కనబడకుండా
కొండ పైన హిమ గుహ నుంచి
నడిచి వస్తుంది
దాని రోమాల్లో గడ్డకట్టిన నిశ్శబ్దం.

శుక్రవారం,
పరాజిత విప్లవాల మూటతో
నెరిసిన గడ్డంతో, జడ కట్టిన జుట్టుతో
ఊతకర్రతో గూనుతో,
వణుకుతూ వస్తుంది

శనివారం,
ఒక శవపేటికపై సవారి చేస్తూ
గర్జిస్తూ వస్తుంది
ఒక దుర్మంత్రవాదినిగా
నల్లటి ఉత్తరీయంతో.

ఆదివారం,
స్వర్గలోకపు బంగరు తలుపులు మూసి
చిందర వందరగా వున్న
మసక వెలుతురులో మునిగిన
తన గదిలోకి తిరిగి వెళ్తుంది,
వారాల గురించిన కవిత వ్రాయటం కోసం

మలయాళ మూలం : సచ్చిదానందన్
తెలుగు సేత : ఎల్. ఆర్. స్వామి
99490 75859



స్వప్న సౌందర్య సాధన

తళుకులీను తారకల చంద్రకాంతి శోభితాకాశం. శిశిర సాయంత్రాలకు ముందు "మసక చీకటి శీతవేళ" ఎవరు ప్రేమిస్తారు చీకటిని. రాత్రితోపాటే మేల్కొని ఒంటరి గానం చేస్తూ, దైనందిన జీవితాన్ని జమాఖర్చులుగా మార్చుకుని 'అర్థం'తోనే అర్థఅర్థాలతోనే బ్రతుకీడ్చుతూ రాతిరి దివ్య నేత్రాల పైకి దుప్పటి లాక్కుని నిదురించే ప్రపంచానికి జీవించడం నేర్పాలనుకుని, దీపాలన్నీ ఆరిపోయినపుడే ఉజ్వల ప్రజ్వలనం దృష్టికందుతుందని చెప్పాలనుకుని, అంతా నిదురించే వేళ జాగృత జాగరణల సమ్మిశ్రిత నేత్ర సంచరణ విహంగమై పిల్ల తెమ్మెరలపై సుతారంగా తేలివచ్చే దేవపారిజాత చంద్రకాంత విరజాజి పున్నాగపుష్ప పరిమళాలను పురిటివాసనతోనే ఆఘ్రాణించి, మన పగటిలో పరుండి, తన సుదీర్ఘ రాత్రితో అపరిమేయంగా సంభాషించి, సత్యాల నగ్నసత్యాల అబద్ధపు లోకాన్ని తృణప్రాయంగా త్యజించి, స్వప్నమే కావాలని పలవరించి, రాత్రి సహవాసాన్ని ఏకాంతవాసాన్ని అక్షరాలలోకి అనువదించి, శిథిల పత్రాలలో సుతిమెత్తగా చిత్రించిన అరుదైన కవయిత్రి శివలెంక రాజేశ్వరీ దేవి. 'సత్యంవద్దు-స్వప్నమే కావాలి' ఆమె మరణానంతర సంకలిత కవిత్వం. భాషలో, అభివ్యక్తిలో తనదైన వస్తు వైవిధ్యంతో స్వయంబంధిత సజీవ సమాధి నుండి అంతరాత్మ ఖైదీ వ్యక్త వ్యక్తిగతమిది. వేదనాభరిత విషాదాభివ్యక్తి. జీవిత పర్యంతం కొనసాగిన గాయగానం. ఎవర్నీ శపించలేని సున్నిత హృదయం. రుణానుబంధాలసలే లేని స్థితప్రజ్ఞుల్ని క్షమించి, పొందుతూ పోగొట్టుకుంటూ, ఒంటరిగదిలో కొనసాగించిన ఆరు దశాబ్దాల జీవన యానమిది. "హృదయాన్ని ఒంపి ఎవరూ మాట్లాడరెందుకు" అని ('వసంతపంచమినాడు') అమాయకంగా ప్రశ్నించి తనకు ప్రియమైన రాత్రిలో ప్రియతములతో సుదీర్ఘంగా సంభాషించారు. "నేనెవరి తాలూకా కాన"ని స్పష్టపర్చి "నన్నెవరూ... నీవెవరూ అని అడగవద్ద"ని సున్నితంగా మందలించి తన నుంచి తనను వేరుచేసే అన్నిటినీ త్యజించిన సాహసి. "కలల్ని కళ్ళలో కలిపేసుకోవాలని" తపించి నిదుర రాలిపోయాక స్వప్నాలన్నీ శిథిలమైపోయాక అంతటా పరుచుకున్న చీకటిలో పూమొగ్గల్ని మొహానికి మోహంతో అద్దుకుని వెన్నెల వెలుగుల్లో లీనమవుతూ స్వప్నమే కావాలని మారాంచేసిన పసిప్రాయపు ప్రాకులాట.

మరీ ముఖ్యంగా మాతృ రాహిత్యం నుంచి ఉద్భవించిన వాత్సల్యంతో కమ్మని మనస్సున్న ప్రతీ స్త్రీ అమ్మేనని స్థిరీకరించి అనేక మంది పుత్రుల్ని కనుగొన్న మాతృత్వపు మధురిమ ఆమె కవిత్వం నుండి పురిటి వాసనై మనని కమ్ముకుంటుంది. ఆ ప్రేమ రాహిత్యం నుండి ఉద్భవించిన పరితప్త హృదయం ప్రతీకాత్మకంగా పల్లవిస్తుంది. ఆ ప్రేమ జ్వలన తీవ్రతతో దహనమవుతూ హృదాయాకాశాన్ని అలంకరించలేని చంద్రుని కోసం కాలాతీతంగా వీక్షించింది. నిశ్శబ్దంగా నిరీక్షించింది. తనలోని ఖాళీని ఏదో ఒక పదంతో పూరించుకోలేక అర్థవంతం కాలేకపోయినా అపభ్రంశంగా మారలేకపోయింది. "రాతిరి రాతిరికి నూతికాడ దీపం పెడతాను/ రాత్రికి నాదగ్గరే ఉండిపోతావా చెప్పు" ('స్వప్నాక్షరాలు') అని బ్రతిమలాడింది. ఆమె అభివ్యక్తిలోని నవ్యత పఠితుల్ని అవిభక్తం చేస్తుంది. హృదయ మూలాలను పట్టి గుంజుతుంది. ఆమె భావనా పటిమ సంభ్రమానికి గురిచేస్తుంది. కవిత వినా నాకేం కావన్న ('ఒక జన్మ ముందుకి లేదా ఒక జన్మ వెనక్కి') వాస్తవంగానే "నీ స్మృతిలో నేనున్నానా ఇంకా నేను ఉన్నానా" ('నీ స్మృతిలో') అన్న వాక్యాలు ఆమె వేదనావృత హృదయాన్ని మనలోకి ప్రవహింప చేస్తాయి.



కాలమూ, మరికొందరూ ఆమె నుంచి భద్రంగా తప్పుకుపోయాక, తప్పించుకుపోయాక; నాలుగు కాలాల జీవితంలో బాల్య యవ్వనాల వద్దే నిలిచిపోయాక; ప్రేమ, సౌందర్యం, కళాత్మకత, కవితాత్మకలతో సమ్మిశ్రితమై జీవించారామె. "నీ కోసం మళ్ళీ పుట్టి పెరగాలనుంది" ('నీ కోసం') అని తన సుదీర్ఘ రాత్రి నుంచి అర్థాంతరంగా వెళ్ళిపోయారు. "చెప్పటానికి ఏమీ లేదు- చెప్పుకోవడానికి చాలా ఉంది"అని నిస్తంత్రినీ నిషేధించి మూగగా నిష్క్రమించారు. వైయక్తిక అనుభూతుల అంతచ్చేతనను ఛేదించి అచేతనమయ్యారు. స్వప్న నేత్రాలు ముకుళితమైనాకా ఇక ధవళ వర్ణం ముందటి సప్తవర్ణ సౌందర్యమిది. రాత్రి చీకటిలోంచి మెరుస్తూ మనల్ని ఈ అక్షరాల్లోంచి చూస్తుండే తడి కనుల ఆర్తగీతమిది. ఒక్కగానొక్క చిట్టచివరి విషాద గానమిది. మన ఆత్మని ఈ కవితాగంగామాతలో మునకలేయించి పునీతమవుదామా! ఒక్కసారి అమావాస్యలో అంతర్ధానమై నెలవంకలమై జన్మిద్దామా!

(న్యూస్‌ప్రింట్ మీద సుతారంగా లిఖించి నిర్లక్ష్యంగా వదిలేసిన కవిత్వం జీవితకాలంలో సంకలనం కాలేకపోగా, ఆమె మరణానంతరం దాన్ని సేకరించి ఏరికూర్చి ముద్రించిన కవితా సంకలనమిది. 'సత్యం వద్దు స్వప్నమే కావాలన్న' కోరిక సుమనస్విని రాజేశ్వరీదేవిది కాగా, ఈ ఒంటరి కవిత్వాన్ని ఒంటిచేత్తో సంకలితం చేసిన కవి కుమారుడు నామాడి శ్రీధర్. ఈ కవిత్వం ఇస్మాయిల్ అవార్డును స్వీకరించింది. జనవరి 16న కవితా సృజన కోసం ఈ లోకాన్ని దర్శించిన రాజేశ్వరీదేవి జన్మదిన సందర్భాన స్వాప్నిక బంధనాలను పునస్మరించుకుంటూ.)

■ బడుగు భాస్కర్ జోగేష్
98666 02325

కవిసంగమం సిరీస్

కవిసంగమం సిరీస్-36 (మూడు తరాల కవి సంగమం)లో ఎండ్లూరి సుధాకర్, నాగిళ్ల రమేష్, సరసిజ పెనుగొండ, వేణుగోపాల్ జుజ్జూరి, రమేష్‌కార్తీక్ నాయక్ పాల్గొంటారు. ఈ కార్యక్రమం జనవరి 21 సా.6గం.లకు గోల్డెన్ త్రెషోల్డ్, అబిడ్స్, హైదరాబాద్ నందు జరుగుతుంది. కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ కవితా పురస్కార స్వీకర్త మెర్సీ మార్గరెట్‌కు అభినందన ఉంటుంది.

- యాకూబ్

జానుడి సాహిత్య పురస్కారం

మల్లవరపు జానుకవి జయంతి పురస్కారాన్ని పత్తిపాక మోహన్‌కు ప్రకటించారు. మల్లవరపు జానుకవి జన్మదినోత్సవం జనవరి 22న ఒంగోలులో జరిగే జయంతి సభలో పురస్కార ప్రదానం జరుగుతుంది.

- ఎలగొండ రవి

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం

రంగినేని సుజాత మోహన్ రావు ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రంగినేని మోహన్‌రావు తల్లి కీశే రంగినేని ఎల్లమ్మ పేర అందజేస్తున్న సాహిత్య పురస్కారానికి 2017 సంవత్సరానికిగాను వచ్చిన కవితా సంపుటాలను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు సుంకిరెడ్డి నారాయణ రెడ్డి కవితా సంపుటి 'తావు'ను పురస్కారానికి ఎంపిక చేశారు. ఫిబ్రవరిలో సిరిసిల్లలోని రంగినేని చారిటబుల్ ట్రస్ట్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కార ప్రదానం జరుగుతుంది.

- మద్దికుంట లక్ష్మణ్

కవితా సంపుటాలకు ఆహ్వానం

కీశే నాగభైరవ కోటేశ్వరరావు పేరిట ఇస్తున్న నాగభైరవ పురస్కారం 2017కు కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఉత్తమ కవితా సంపుటికి రూ.5వేల నగదు, సత్కారం ఉంటాయి. 2016, 2017ల్లో వెలువడిన వచన కవితా సంపుటాలను జనవరి 30లోగా చిరునామా: చిన్ని నారాయణరావు, 'శ్రీకేతనమ్', ఆదిత్యనగర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్, నెల్లూరు-524003కు పంపాలి. వివరాలకు 9440202942.

- చిన్ని నారాయణరావు

సహస్ర కవి సమ్మేళనం

అవనిగడ్డలో తెలుగులోగిలి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పి.యస్.రావు ఆధ్వర్యంలో, బిక్కి కృష్ణ సారథ్యంలో ఫిబ్రవరి 25, 26, 27 తేదీలలో వెయ్యి మంది కవులతో 'అంతర్జాతీయ సహస్ర కవి సమ్మేళనం - వెయ్యి కవితల పండుగ' జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే కవులు ఫిబ్రవరి 5లోపు 83329 03156 నంబరులో నమోదు చేసుకోవాలి.

- కలిమిశ్రీ

హైదరాబాద్ బుక్ ఫెయిర్


హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన జనవరి 18 నుంచి 28వరకు తెలంగాణ కళా భారతి (ఎన్‌టీఆర్ స్టేడియం)లో జరుగబోవుచున్నది. పుస్తక ప్రదర్శనలో 10 రాష్ట్రాల నుంచి 250 ప్రచురణ కర్తలు, రచయితలు, విక్రేతలు పాల్గొననున్నారు. తొలిసారి తెలంగాణ రచయితలకు ఉచితంగా హాల్ కేటాయించాం. సాహితీ ప్రియులకు ఆహ్వానం.

- జూలూరు గౌరీ శంకర్



రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం వారిది. ఇద్దరూ చిన్నప్పటి నుంచే విదేశాల్లో చదువుకున్నారు. అక్క డాక్టరయితే... తమ్ముడు పేరొందిన వ్యాపారవేత్త. తమ్ముడు విదేశాల నుంచి ఇక్కడికి వచ్చి, రాజకీయాల్లోకి అడుగిడి పార్లమెంట్ సభ్యుడైతే... అక్క ప్రస్తుతం తిరుపతిలో ఆస్పత్రి నిర్మాణంతో బిజీగా ఉన్నారు. 'గల్లా' ఫ్యామిలీకి చెందిన అక్కాతమ్ముళ్లు డాక్టర్ రమాదేవి, గల్లా జయదేవ్‌లతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే'లో సంభాషించారు. ఆ విశేషాలు...

అక్క నాకు అమ్మలాంటిదే!



చిన్నప్పుడు...

▸▸ నమస్తే జయదేవ్‌గారు... నమస్తే రమాదేవి గారూ...

నమస్తే అండీ...

అమెరికా నుంచి వచ్చి ఎంత కాలం అయింది?

రమాదేవి: రెండేళ్లయింది

▸▸ మీ తాతగారు రాజగోపాలనాయుడు గారు, అమ్మగారు అరుణకుమారి గారు రాజకీయాల్లో ఉన్నారు. మీ ఫాదర్ రామచంద్రనాయుడు గానీ... ఇంకెవరైనా సరే మీ కుటుంబంలో అంతా తెలుగులోనే మాట్లాడతారు. కానీ మీ ఇద్దరు మాత్రమే తెలుగు సరిగా మాట్లాడలేకపోవడానికి కారణమేంటి?

జయదేవ్: భారత్‌లో పుట్టి పెరిగి అమెరికా వెళతారు. అక్కడ నలభై ఏళ్లున్నా కూడా ఇంగ్లిష్‌ని తెలుగు యాక్సెంట్‌లోనే మాట్లాడతారు. మాది ఆపోజిట్ సిట్యువేషన్. నేను మూడేళ్లప్పుడు... అక్క ఐదేళ్లప్పుడు అమెరికా వెళ్లిపోయాం. స్కూలింగ్ అంతా అక్కడే. సో... ఆ యాక్సెంట్ నూరేళ్లున్నా కూడా పోదు (నవ్వుతూ).

▸▸ మరి మీ పిల్లలు?

జయదేవ్: మా ఇద్దరు పిల్లల్లో... అశోక్ ఆంధ్రా అబ్బాయిలానే మాట్లాడతాడు. సిద్ధార్థ్ విషయానికి వచ్చే సరికి కాస్త అమెరికన్ యాక్సెంట్ వచ్చేసింది.

రమాదేవి: నేను తెలుగు బాగా మాట్లాడతానండీ! హైదరాబాద్‌లో తెలుగు మాట్లాడేవాళ్లు తక్కువైపోయారు. ఇక్కడ ఆఫీసులో ఎక్కువ మంది ఇంగ్లిష్‌లోనే మాట్లాడుతున్నారు. బయటకు వెళ్లినా ఫ్రెండ్స్ కూడా ఇంగ్లిష్‌లోనే మాట్లాడుతున్నారు. మా పిల్లలిద్దరికీ తెలుగు వచ్చు.

▸▸ అంత చిన్నప్పుడే అమెరికా వెళ్లారు కదా! అక్కడ అమెరికన్స్‌తో ఎలాంటి ఇబ్బందులూ రాలేదా?

జయదేవ్: 1970లో మేమెళ్లాం. అప్పుడక్కడ తెలుగు వాళ్లు అస్సలు లేరు. మేం చేరిన తొలి స్కూల్‌లో నేను, అక్క తప్ప మైనారిటీస్ ఎవరూ లేరు. పిల్లలు తెలిసీ తెలియక 'బ్రౌనీ' అనో.. ఇంకేదో అనో పిలిచేవారు. దీంతో నాకు కోపం వచ్చేది.

▸▸ రీసెంట్‌గా ప్రియాంకా చోప్రా కూడా అంది... 'నన్ను కూడా బ్రౌనీ' అని పిలిచేవాళ్లని!

జయదేవ్: 'ఇక్కడే ఉంటామా... భారత్‌కు వెళ్లిపోతామా' అనే డైలమా ఎప్పుడూ అక్కడి భారతీయుల్లో ఉంటుంది. చిన్నప్పుడే అమెరికా వెళ్లాం కాబట్టి... నాకు, అక్కకు ఫస్ట్ జనరేషన్ ఎక్స్‌పీరియన్స్ కూడా ఉంది. పెరిగే కొద్దీ ఆ వివక్ష పోతుందనుకున్నా కానీ ఏదో ఒక చోట కనిపిస్తూనే ఉంది. భాష ఒకటే కావచ్చు... వేసుకొనే డ్రెస్సులు ఒకటే కావచ్చు... మ్యూజిక్, మూవీస్, టెలివిజన్ షోలు కలిసి చూడవచ్చు... కానీ ఏదో ఒక డిఫరెన్స్ చూపిస్తారు. అది నాకు నచ్చలేదు. ఇరవై ఏళ్లు నేను అక్కడున్నా కూడా... ఎవరన్నా కలిసినప్పుడు ఆ డిఫరెన్స్ తెలుస్తుంటే... ఐ ఫెల్ట్ దిస్ ఈజ్ నాట్ మై ప్లేస్!

రమాదేవి: నాకు ఐదేళ్లప్పుడు మా ఊరు చాలా బాగా గుర్తుంది.

మాది ఉమ్మడి కుటుంబం. భయమనేది లేదు. అమ్మ దగ్గరుండేది. నాన్న అమెరికాలో ఉన్నారప్పుడు. మంచికి... చెడ్డకి... అమ్మ మీద అలిగినా... తాతయ్య ఉండేవారు. అవ్వ ఉండేది. ఆడుకోవాలంటే మా చిన్నాన ఉండేవాళ్లు. సో... ఒక్కసారి అమెరికాకు వెళ్లేసరికి అది పెద్ద షాక్‌లా అయిపోయింది. జయదేవ్ కొంచెం ప్రొటెక్టెడ్. ఎందుకంటే... నర్సరీకి వెళ్లాడు. నన్ను డైరెక్ట్‌గా షికాగో పబ్లిక్ స్కూల్‌లో ఫస్ట్ క్లాస్‌లో జాయిన్ చేసేశారు. అక్కడ పిల్లలు చాలా టఫ్. అమ్మ ఒకటి రెండు రోజులు స్కూలుకు తీసుకెళ్లి... తరువాత 'పిల్లలతో పాటు వచ్చేసేయమ్మా' అని ఊళ్లో చెప్పినట్టు చెప్పేసింది. నాకు భయమేసేది. ఇంగ్లిష్ రాదు. టీచర్ ఏం చెప్పినా 'నో ఇంగ్లిష్' అని చెప్పేదాన్ని. మొదటి రోజే ఎవరో జయదేవ్‌ను కొడితే ముక్కు నుంచి రక్తమొచ్చింది. అమ్మా, నాన్నకు చెప్పాం. వాళ్లు ఆ కొట్టిన వాళ్ల అమ్మా నాన్నకు చెప్పారు. దాంతో కష్టాలు ఎక్కువయ్యాయి. మేమిద్దరం అనుకున్నాం... 'ఎప్పుడేం జరిగినా అమ్మా నాన్నలకు చెప్పకుండా మనమే సాల్వ్ చేసుకోవాలి' అని! అలా మా సమస్యలు మేం పరిష్కరించుకోవడం అలవాటైంది.

▸▸ మరి ఇంట్లో మీ నాన్న దగ్గర ఏడవలేదా... 'నేను ఇక్కడ ఉండను.. వెళ్లిపోతాను' అని?

రమాదేవి: జయదేవ్ ఎక్కువ గొడవ చేసేవాడు... 'వెళ్లిపోతాను.. వెళ్లిపోతాను' అంటూ! (నవ్వు). ఒకరోజు నాన్నగారు షూస్ వేసుకుంటూ ఉంటే జయదేవ్ నాన్న పైన దూకి... 'ఒరే దుర్యోధనా... దుశ్శాసనా.. మమ్మల్ని మా ఊరికి ఎప్పుడు పంపిస్తావు' అని అడిగాడు.

జయదేవ్: నాన్నతో నాకు అంత టచ్ లేదప్పుడు. నేను పుట్టిన తరువాత మా తాతగారు వాళ్ల అమ్మతో ఊళ్లోనే ఉన్నా. అమ్మా, నాన్న, అక్క... నాన్నతో కాకినాడలో ఉండేవారు. నాకు మా అవ్వయితే చాలా దగ్గర... అమ్మ కంటే, అక్క కంటే! అయితే చిన్నప్పటి నుంచీ నాన్నగారు ఆ ఫ్రీడమ్ ఇచ్చేవారు. అమెరికాలో ఉన్నప్పుడు రోజూ కచ్చితంగా సాయంత్రం 6.30-7.30 డిన్నర్, ఆ రోజు ఏం జరిగిందనే దానిపై చర్చ ఉండేది. ఏవన్నా డిఫరెన్సెస్ ఉంటే అక్కడే సెటిల్ చేసుకోవాలి. ఆ అలవాటు ఇప్పటికీ కొనసాగుతోంది.



ఎన్.జి. రంగాతో గల్లా ఫ్యామిలీ..

గుంటూరు ఎన్.జి. రంగా గారి నియోజకవర్గం. ఆయన పార్లమెంటులో ఉన్నప్పుడు మా తాత గారే ఆయన నియోజక వర్గం మేనేజ్‌మెంట్ చూసేవారు. అలా మా తాతగారి పాత సంబంధాలన్నీ ఉన్నాయి. అందుకనే గుంటూరు ఎంచుకున్నా.

▸▸ ఇప్పుడు మీకు (జయదేవ్) 52 ఏళ్లు. కానీ... మీ అక్క ఇప్పటికీ మిమ్మల్ని ఓ చిన్న పిల్లాడిలా చూస్తున్నారు..!

రమాదేవి: చిన్నప్పటి నుంచీ అలవాటైంది. అమ్మ పొద్దున్న కాలేజీకి వెళుతూ చెప్పేది... 'తమ్ముడిని చూస్తుండమని'! స్కూల్లో ఉన్నప్పుడు కూడా సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వెళ్లద్దని చెప్పేది. అమ్మ చెప్పిందని ఐదు నిమిషాల ముందు కూడా నేను వెళ్లనిచ్చేదాన్ని కాదు! (నవ్వు).





జయదేవ్: చిన్నప్పటి నుంచీ అమ్మ చేసే పనిచేస్తూ ఉండేది కాబట్టి... అక్క నాకు అమ్మలాంటిదే!

రమాదేవి: ఇంక జయదేవ్‌ను చూసుకొంటూ నేను కూడా అల్లరి చేయడం మర్చిపోయేదాన్ని.

▸▸ మీది పెద్ద రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. రాజగోపాలనాయుడుగారు చంద్రబాబునాయుడుతో సహా చాలా మందికి రాజకీయ గురువు. మరి మీరు రాజకీయాల్లోకి రావడానికి ఇంత ఆలస్యమెందుకైంది?

జయదేవ్: చిన్నప్పటి నుంచీ నాకు రాజకీయాలపై ఆసక్తి ఉంది. మా తాతగారు 1974లో భారత్‌కు వచ్చిన తరువాత అది ఇంకాస్త పెరిగింది. నా హైస్కూల్ అయ్యేసరికి అమ్మా, నాన్న భారత్‌కు వచ్చేశారు. అక్కడ కాలేజీలో ఇంజనీరింగ్‌లో చేరి, తరువాత పొలిటికల్ సైన్స్‌కు మార్చుకున్నా. కాలేజీ చదివేటప్పుడు భారత్‌కు వెళ్లిపోయి రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నా. ఆ విషయం నాన్నగారికి ఫోన్ చేసి చెప్పాను. దాని తరువాత ఏడాది ఆయన నాతో మాట్లాడలేదు. ఎందుకంటే ఇంజనీరింగ్ వదిలేశానని! మా తాతగారు ఆయనతో మాట్లాడిన తరువాత ఒప్పుకున్నారు.

▸▸ మూడున్నరేళ్లు ఎంపీగా చేశాక సంతృప్తి చెందారా?

జయదేవ్: నేను రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడే 'ఐ వాన్ట్ టు మేక్ ఎ డిఫరెన్స్' అనుకున్నా. కుటుంబ వారసత్వమూ ఉంది. మనవల్ల ఇది జరిగిందని అనిపించుకోవాలి. ఆర్థిక సంస్కరణలకు ముందు భారత్ వెనుకపడ్డ దేశం. ఇప్పుడు కొంచెం మెరుగైంది. దానికి ఎవర్ని తిట్టాలి? ఎవరు రెస్పాన్సిబిలిటీ? మా కుటుంబం స్వాతంత్ర్యం నుంచీ ఒకవిధంగా పవర్‌లో ఉంది. అలాంటప్పుడు మేం రెస్పాన్సిబిలిటీ తీసుకోకపోతే ఇంకెవరు తీసుకోవాలి? దాదాపు ఎంపీగా నాలుగేళ్లవుతోంది. ఇంత వరకూ ఏం చేశామని వెనక్కి తిరిగి చూసుకుంటే... ఈజ్ నాట్ మచ్ అనిపిస్తుంది.

▸▸ ఎంపీగా ఎన్ని మార్కులు వేసుకొంటారు?

జయదేవ్: దేశంలోని ఇతర ఎంపీలతో పోలిస్తే డిఫరెంట్ స్కోర్ వస్తుంది. బట్ వాట్ కెన్ ఎంపీస్ డూ? ఈ సిస్టమ్‌లో ఏదన్నా చేయాలనుకొంటే చేయవచ్చా అంటే... అది చాలా తక్కువ అనిపిస్తుంది.

▸▸ ఈ మధ్య పవన్ కల్యాణ్ సహా చాలామంది... 'ఎంపీలు బిజినెస్ చూసుకొంటున్నారు కానీ... పోలవరం వంటి రాష్ట్ర సమస్యలేవీ పట్టించుకోవడంలేదు' అని తిట్టారు!

జయదేవ్: అవి నేను కూడా చదివాను. ఐ ఫీల్ వెరీ బ్యాడ్ వెన్ ఐ రీడ్ దట్! కరెంట్ పొలిటికల్ సిట్యువేషన్‌లో మాకున్న ఇబ్బందులు కూడా అర్థం చేసుకోవాలి. ప్రత్యేక హోదా వంటి సీరియస్ ఇష్యూస్ వచ్చినప్పుడు మేమంతా ప్రొటెస్ట్ చేశాం. అంతేకానీ మా చేతులు కట్టేసి చేయమంటే ఏం చేస్తాం?

▸▸ రాజకీయాల్లోకి, ముఖ్యంగా ఎంపీలుగా బిజినెస్ పీపుల్ ఎక్కువగా వస్తున్నారన్నది కొందరి అభిప్రాయం! వాళ్లు వాళ్ల వ్యాపార సంబంధిత అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని ఒక ఒపీనియన్ ఉంది! మీరేమంటారు?

జయదేవ్: ఐ డోన్ట్ ఎగ్రీ. పార్టీ ఏది చెబితే అది చేయాలి. వియ్ డోన్ట్ హావ్ ఫ్రీడమ్.

రమాదేవి: మా తాతయ్య గారి నుంచీ ఎవరూ డబ్బులు తీసుకోలేదు. తాతయ్య నన్ను చూడ్డానికి కూడా రిక్షాలో వచ్చేవారు. బస్సుల్లో తిరిగేవారు. డబ్బులు కావాలంటే ఆయనకు వాళ్లమ్మ ఇచ్చేది. అలాగే ఇప్పుడు జయదేవ్‌కు పాలిటిక్స్‌లో ప్రవేశించే అవకాశం వచ్చింది. ఈ రకమైన లైఫ్‌స్టయిల్ మెయిన్‌టెయిన్ చేసి నాన్‌కరప్టెడ్‌గా ఉండాలంటే బిజినెస్‌ను కూడా పట్టించుకోవాలి.

జయదేవ్: నేను మా బిజినెస్‌ను ఇంప్రూవ్ చేయడానికి పాలిటిక్స్‌లోకి రాలేదు. కొంతమంది బిజినెస్‌లో నుంచి ఎంపీలుగా మారారు. కొంతమంది ఎంపీలై బిజినెస్‌కు వస్తారు. ఆ డిఫరెన్స్ ఏమిటో నాకు తెలియడం లేదు.

▸▸ మీది చిత్తూరు జిల్లా. అది వదిలేసి గుంటూరు లోక్‌సభకు ఎందుకు పోటీ చేశారు?

జయదేవ్: తాతగారిని ఎంపీగా చూసినప్పటి నుంచీ నేను కూడా లోక్‌సభకు పోటీ చేయాలన్నది చిన్నప్పటి కల. 1992లో భారత్‌కు తిరిగొచ్చాను. నలభై ఏళ్లకు పాలిటిక్స్‌లో ఎంటరవుదామనుకున్నా. ఎందుకంటే అప్పుడే కంపెనీ మొదలవుతోంది. ఆర్థిక పరిస్థితులు అంత బలంగా లేవు. ఇదంతా బిల్డప్ చేసి వస్తే మంచిదని భావించాను. ఆ సమయంలో అమ్మ కూడా రాజకీయాల్లో ఉన్నారు. అయితే నేను తిరిగి వచ్చినప్పటి నుంచీ అమ్మ ప్రతి ఎలక్షన్‌కూ క్యాంపెయిన్ మేనేజ్ కూడా చేసేవాడిని. 2004 ఎన్నికలప్పుడు పోటీ చేయాలనుకున్నా కుదరలేదు.

▸▸ తెలుగుదేశంలోకి రావాలని ఎందుకు అనుకున్నారు?

జయదేవ్: ముఖ్య కారణం రాష్ట్ర విభజన. మా కుటుంబం 70 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో ఉంది. ఎంతో మంది అందులో ఎందుకని తిట్టినా బయటకు రాలేదు. పార్టీకి లాయల్‌గా ఉన్నాం. కానీ... వెన్ పార్టీ ఈజ్ నాట్ లోయల్ టు యూ! అప్పుడేం చేయాలి? అప్పుడు కాంగ్రెస్‌కు దేశంలోనే అత్యంత బలమైన యూనిట్ ఆంధ్రా. అలాంటి యూనిట్‌నే డోన్ట్ కేర్ అన్నట్టు ప్రవర్తించడం చూసి కోపమొచ్చింది. 'ఐ కెన్ నాట్ సపోర్ట్ దిస్ పార్టీ' అని అమ్మతో చెప్పేశాను. అలా కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చేశాం. అయితే ఎవరి నాయకత్వంలో పనిచేస్తే బాగుంటుందని ఆలోచిస్తే... చంద్రబాబునాయుడు గారే బెటరనిపించింది. ఆయనకు ఒక ఆలోచన ఉంది. విజన్ ఉంది. ఇంతకుముందు ఆయన సీఎంగా ఉన్నప్పుడు కొన్ని పాలసీలను అప్రిషియేట్ చేస్తుంటే అమ్మ కూడా నన్ను తిట్టేది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే చంద్రబాబునాయుడు తప్ప ఇంకెవరూ లేరనిపించింది.

▸▸ ఇప్పుడు కూడా అదే అభిప్రాయంతో ఉన్నారా?



అమ్మతో జయదేవ్, రమాదేవి

గుంటూరు మాకు కొత్త ప్రాంతం అయింది. అది నాకు డిస్ అడ్వాంటేజ్. సో.. .నేను పోటీ చేయాలంటే ముందే మా అమ్మ దగ్గరి నుంచి, మా అక్క దగ్గరి నుంచి, నా భార్య దగ్గరి నుంచి కమిట్‌మెంట్ తీసుకున్నాను మీలో ఎవరో ఒకరు వెళుతూ ఉండాలని. ఆ కమిట్ మెంట్ వాళ్లకి ఉంది.

జయదేవ్: యస్... ఇప్పుడూ అదే అభిప్రాయంతో ఉన్నాను.

▸▸ జయదేవ్ తెలుగుదేశంలోకి వెళదామనుకున్నప్పుడు అక్కగా మీరేమన్నా సలహాలిచ్చారా?

రమాదేవి: లేదండీ! ఆ డిస్కషన్ ఎక్కుగా అమ్మ, నాన్నతో జరిగింది. జయదేవ్ పోటీ చేస్తానన్న తరువాతనే నేను ఇన్వాల్వ్ అయ్యాను. ఎలక్షన్ క్యాంపెయిన్ చేశాను.

జయదేవ్: తెలుగుదేశం పార్టీ డిసైడ్ అయిన తరువాత అమ్మ కూడా సపోర్ట్ చేసింది. తిరుపతి బైఎలక్షన్ టికెట్ రానప్పటి నుంచీ నారా లోకేష్ నాతో టచ్‌లో ఉన్నారు. అప్పుడు పార్టీలోకి రమ్మని అడిగారు. ఆ పరిచయంతో టీడీపీలో చేరాను. అయితే ఆయన నన్ను తిరుపతి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయించాలని అనుకున్నారు. 'లేదు నాకు ఎంపీగానే ఆసక్తి ఉంది. గుంటూరు టికెట్ ఇవ్వండి' అని అడిగాను. ఎందుకంటే... ఐ డిడ్ మై రీసెర్చ్. గుంటూరు 50% అర్బన్, 50% రూరల్! నా ఇమేజ్‌కీ, నా ఆలోచనలకూ తగిన వాతావరణం ఉంటేనే ప్రజలతో కనెక్ట్ అవ్వడానికి ఈజీగా ఉంటుంది. పూర్తి రూరల్ అయితే కొంచెం కష్టం కావచ్చు. ఆ సమయంలో ఇట్స్ నాట్ విన్నింగ్ పార్టీ అండ్ ఇట్స్ నాట్ విన్నింగ్ సీట్!

▸▸ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందా? మీకు ఎవరూ టికెట్ ఆఫర్ చేయలేదా?

రమాదేవి: ఈ మధ్యే ఇండియాకు వచ్చాను. తిరుపతిలో హాస్పిటల్ కడుతున్నాం. అది చాలా పెద్ద ప్రాజెక్టు. 500 బెడ్స్. అన్నీ ఒకేసారి కాకపోయినా ముందుగా ఏడాదిలో 150 బెడ్స్‌తో ప్రారంభించాలని ఆలోచన. ఆ పని చూసుకోవడానికి వచ్చాను. అది పూర్తయి ఒక దారికి వచ్చే వరకు వేరే ఆలోచన చేయడానికి టైం లేదు. ఈ ప్రాజెక్టుపై మా ఆయనకు చాలా ఇంట్రెస్ట్ ఉంది.

▸▸ మీ భర్త ఏం చేస్తారు?

రమాదేవి: ఆయన ఆర్థోపెడిక్ సర్జన్. పీడియాట్రిక్‌లో స్పెషలైజేషన్ చేశారు. హాస్పిటల్ పూర్తయ్యేటప్పటికి ఇక్కడికి వస్తారు. 2018 చివరికల్లా హాస్పిటల్ ప్రారంభించాలని ప్రయత్నం చేస్తున్నాం.

▸▸ మీ స్పెషలైజేషన్ ఏంటి?

రమాదేవి: న్యూరాలజీ. స్లీప్ మెడిసిన్‌పై సబ్ స్పెషలైజేషన్ చేశాను.

▸▸ నిద్ర పట్టకపోతే మీ దగ్గరకు రావచ్చన్నమాట?

రమాదేవి: నిద్ర పట్టకపోయినా, నిద్ర ఎక్కువైనా, గురక పెడుతున్నా, నిద్రలో అరిచినా, కరెక్ట్ టైంలో నిద్ర రాకపోయినా, నిద్రలో నడిచే అలవాటున్నా నా దగ్గరకు రావచ్చు.

▸▸ నిద్ర రాకపోతే స్లీపింగ్ పిల్స్ వేసుకొమ్మని చెబుతున్నారు కదా డాక్టర్లు?

రమాదేవి: ఒక్కొక్కసారి అవసరం ఉంటుంది. ముందుగా హిస్టరీ తీసుకుని నిద్ర ఎందుకు రావడం లేదో కనుక్కోవాలి. ఆలోచనలు, అలవాట్లలో మార్పులు చేసుకోవడం ద్వారా కూడా చాలా తేడాలొస్తాయి. సుడోకు చేస్తుంటే ఆలోచనలన్నీ పోయి మనసు ఆ అంకెల మీదే నిలిచిపోతుంది. ఒక్కొక్కరికి ఒక్కో అభిరుచి ఉంటుంది. దానికి అనుగుణంగా ఎంచుకోవాలి.

▸▸ పార్టీ క్యాడర్‌కు గానీ, జనాలకు గానీ జయదేవ్ అందుబాటులో ఉండడు అని ఒక అసంతృప్తి ఉంది. అది మీ దృష్టికొచ్చిందా?

జయదేవ్: వచ్చింది. ఆ ఇంప్రెషన్ ఉంది. ఐ యాక్సెప్ట్.

▸▸ మరి ఎలా ఓవర్ కమ్ అవుతారు?

జయదేవ్: దీన్ని రెండు విధాలుగా చూడాలి. నా తోటి ఎంపీలతో మాట్లాడి చూసినపుడు వాళ్ల ప్రజలకు అందుబాటులో ఉన్నా జనాలు సంతృప్తిగా లేరని సమాధానం వచ్చింది. 80 శాతం సమయం నియోజకవర్గంలో ఉండే ఎంపీలకు సైతం అదే ప్రాబ్లం ఉంది. క్యాడర్, పబ్లిక్ ఎక్స్‌పెక్టేషన్ ఎంత పెరిగాయంటే 24 గంటలు అక్కడ ఉన్నా కూడా మా దగ్గరకు రాలేదు, మాతో మాట్లాడలేదు, మా ఊరికి రాలేదు అని ఏదో ఒక అసంతృప్తి కనిపిస్తుంది. దాన్ని పూర్తిగా ఓవర్‌కమ్ కాలేము. 1/3 సమయం బిజినెస్ కోసం కేటాయిస్తున్నాను. 1/3 సమయం ఢిల్లీలో ఉంటున్నాను. 1/3 సమయం గుంటూరులో ఉండేలా చూసుకుంటున్నాను. ఆ రేషియో మెయింటేన్ చేయాలని ప్రయత్నం చేస్తున్నాను. ఏడాదిలో నాలుగు నెలలు పార్లమెంట్ సెషన్స్ జరుగుతాయి. అంతేకాకుండా నన్ను చాలా కమిటీల్లో పెట్టారు. ఇవన్నీ టైమ్ తీసుకునేవే. కంపెనీ బిజినెస్ చూసుకోవాలి. మధ్యలో ఫ్యామిలీ చూసుకోవాలి. గుంటూరుకు నేను చేసిన డెవలప్‌మెంట్ ఎవరూ చేయలేరు.

▸▸ మీరూ, మహేశ్‌బాబు ఎప్పుడైనా డిస్కస్ చేసుకుంటుంటారా?

జయదేవ్: యస్.

▸▸ బాగా రిజర్వ్‌డ్‌గా ఉంటాడు కదా!

జయదేవ్: ఇంతకుముందుతో పోల్చితే ఇప్పుడు బెటర్. చాలా విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాడు.

▸▸ రాబోయే ఎన్నికల్లో పరిస్థితి క్రిటికల్‌గా ఉంది అంటే వస్తాడా?

జయదేవ్: నేను ఫోర్స్ చేయను. 2014 ఎన్నికల ప్రచారానికి మహేష్ రాకపోవడమే మంచిదయింది. తనొచ్చినా, మామయ్య వచ్చినా వాళ్ల మూలంగానే గెలిచాడని అనేవారు. ఇప్పుడు నా సామర్థ్యంతోనే గెలిచానన్న సంతృప్తి ఉంది.

▸▸ మళ్లీ ఎంపీగా గెలవాలంటే ఏం చేయాలి? ఎలా ఉండాలి?

జయదేవ్: నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండాలి. దానిపైన దృష్టి పెడతాను.

▸▸ ఫైనల్‌గా మీ యాంబిషన్ ఏంటి?


జయదేవ్: ఐ వాంట్ టు మేక్ ఎ డిఫరెన్స్. 15 వేల మందికి ఉద్యోగాలిచ్చాం. ఒక్కో కుటుంబంలో నలుగురిని వేసుకున్నా 60 వేల మందిని ఎంప్లాయిమెంట్ ద్వారా ఆదుకుంటున్నాం. నా నియోజకవర్గంలో 25 లక్షల మంది ఉన్నారు. వారిపైన నా ప్రభావం ఉండాలంటే నా ఇన్‌ఫ్లూయెన్స్ పెరగాలి. అందుకోసం కృషి చేస్తున్నాను.

అది సక్సెస్ కావాలని కోరుకుంటూ, హాస్పిటల్ ద్వారా మీరు మంచి సేవ చేయాలని కోరుకుంటూ థ్యాంక్యూ వెరీ మచ్.



మహేశ్ ఫ్యామిలీతో జయదేవ్ ఫ్యామిలీ

నాకు, మహేశ్‌కు మధ్య మంచి క్లోజ్‌నెస్ ఉంది. ఏజ్ డిఫరెంట్ కూడా ఉంది కాబట్టి ప్రొటెక్టివ్‌గా ఉంటాను. మంచి, చెడు చెబుతుంటాను. పాలిటిక్స్‌లో ఏం జరుగుతోందో తనకు చెప్పేది నేను ఒక్కడ్నే అనుకుంటా. మహేశ్‌కు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదు. ఏ రాజకీయ పార్టీని సపోర్టు చేయడు.



గిఫ్ట్ హ్యాంపర్ విజేత

జి.తిరుమల

బాలాజీనగర్, కరీంనగర్



విజేతలకు **టాటా-జెమినీ టీ** వారి నుంచి గిఫ్ట్ హ్యాంపర్ అందుతుంది.

ఆంధ్రజ్యోతి నవ్య స్మార్ట్

6 సోమవారం • 15 జనవరి 2018 navya@andhrajyothy.com

ఆర్కుట్ కాదు 'హలో'...!

orkut hello network

ఆర్కుట్ ఈ పేరు ఎక్కడో విన్నట్టుందే అనుకుంటున్నారా? అంత ఈజీగా ఎలా మర్చిపోగలరు! కొన్నేళ్ల క్రితం కనుమరుగైన ఆర్కుట్ మళ్లీ పలకరించడానికి వస్తోంది. 2004లో సామాజిక మాధ్యమ విప్లవానికి తెర లేపిన ఈ 'ఆర్కుట్ ' సృష్టికర్త పేరు ఆర్కుట్ బ్యూకుక్టన్. టర్కీకి చెందిన అతను గూగుల్‌లో పనిచేస్తున్న సమయంలోనే 'ఆర్కుట్'ను రూపొందించాడు. అప్పట్లో ఆర్కుట్ సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. అయితే ఏమైందో ఏమో తెలీదు గానీ గూగుల్ హఠాత్తుగా ఆర్కుట్‌ను నిలిపివేసింది. ఆ తర్వాత కొంత కాలానికి బ్యూకుక్టన్ రాజీనామా చేశాడు. ఇదే తరహాలో అదే ఏడాదిలో ప్రారంభమైన ఫేస్‌బుక్ ఎంతలా దూసుకెళిపోతోందో చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మళ్లీ ఆర్కుట్‌ను మన దేశంలో లాంచ్ చేయడానికి బ్యూకుక్టన్ రెడీ అవుతున్నాడు. గూగుల్ మాజీ ఉద్యోగులైన కొంత మంది స్నేహితులతో కలిసి ఇప్పటికే 'హలో'ని కెనడా, న్యూజీలాండ్, బ్రెజిల్.... ఇలా 12 దేశాల్లో ప్రారంభించాడు. మరో రెండు నెలల్లో ఇది భారత్‌లో అడుగుపెట్టనుంది.

హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లో కూకట్‌పల్లిలోనో, అమీర్‌పేటలోనో, దిల్‌షుక్‌నగర్‌లోనో, జూబ్లీ బస్‌స్టేషన్‌లోనో గంట సేపు బస్ కోసం వెయిట్ చెయ్యడం అంటే మామూలుగా అయితే పెద్ద బోర్! కానీ.. అదే గనక సంక్రాంతికి ఊరెళుతుంటే మాత్రం ఆ వెయిటింగ్ కూడా మధుర జ్ఞాపకమే. ఎందుకంటే, జీవిత కాలానికి సరిపడా సంతోషాన్ని మూటగట్టుకోవాలంటే సంక్రాంతికి మించిన సందర్భం ఉండదు. అలాంటి సంక్రాంతి సాంకేతిక ముసుగులో అతి మామూలుగా మారిపోకూడదు. అదే టెక్నాలజీ సాయంతో పండుగను మరింత మధురంగా మిగుల్చుకోవడం ఎలా?

టెక్ గురు



ఫోనంతా... సంక్రాంతి!

వాట్సప్, ఫేస్‌బుక్‌లకి సెలవులివ్వండి!

ఊరెళితే... అమ్మా, నాన్న, అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలు కళ్లల్లో ప్రేమ నింపుకొని మనతో సమయం గడుపుదామని అనుకుంటారు. మరి, అలాంటప్పుడు మీరేమో వాట్సప్‌లో వందల మందికి ఫార్వార్డెడ్ విషెస్ పంపుకుంటూ... ఫేస్‌బుక్‌లో కామెంట్లు రాసుకుంటూ కూర్చుంటే ఎలా? కళ్లెదుట ఉన్న ఆత్మీయులకు మించిన గొప్ప రిలేషన్లు ఏవీ లేవు. మీరు ఈ క్షణం ఇంత గొప్ప స్థానంలో ఉన్నారంటే... ఆ పల్లెటూరి నుండి నగరాలకూ, విదేశాలకూ ఎదిగిపోయారంటే మీ కోసం జీవితాల్ని త్యాగం చేసిన గొప్ప బంధువులు మీ కళ్లెదుటే ఉన్నారు. అందుకే పండుగ మూడు రోజులూ వాట్సప్, ఫేస్‌బుక్‌లలో మునిగిపోకుండా వాటిని పక్కన పెట్టండి. టెక్నాలజీ మన మంచికి ఉపయోగపడాలి కానీ మనుషుల మధ్య అగాధంగా నిలవకూడదు. ఏ నులక మంచం మీదనో శేష జీవితాన్ని గడిపేస్తున్న అమ్మమ్మ మంచం కోడు మీద కూర్చుని కబుర్లు చెప్పండి. చిన్నప్పటి జ్ఞాపకాలన్నింటినీ అడిగి తెలుసుకోండి. వీలైతే ఆ పెద్దవాళ్ల కళ్ళల్లో గతం గురించి చెప్పేటప్పుడు కనిపించే వెలుగునూ, వారి మాటల్నీ ఫొటోలుగా, వీడియోలుగా క్యాప్చర్ చేయండి. మీ జీవితానికి నిజమైన స్ఫూర్తిప్రదాతలు ఆ పెద్ద వాళ్లు!

తీపి జ్ఞాపకాలు స్కాన్ చేయండి!

పండగకి మీరెళ్లిన ఇల్లు పరాయిది కాదు... మీదే! మీ బాల్యమంతా ఆ ఇంట్లోనే గడిచి ఉంటుంది. ఇల్లంతా కలియదిరిగి మొత్తం ఫొటోలు, వీడియోలుగా బంధించండి. అల్మారాలన్నీ వెదికి, పాత ఫొటోల్లాంటివి ఏమైనా కనిపిస్తాయేమో చూడండి. గూగుల్ ప్లే స్టోర్ నుండి ఫొటో స్కానర్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఆ పాత ఫొటోలను భద్రంగా కేప్చర్ చేయండి. స్వయంగా గూగుల్ సంస్థ రిలీజ్ చేసిన ఫొటో స్కాన్ యాప్ దీని కోసం బాగా పనికొస్తుంది. ఇంట్లో పెరటి పాదులు, పశువుల చావిడిలో గేదెల మొదలు పల్లె అందాలను కాస్త అలా తీరికగా వాకింగ్ చేసుకుంటూ మీ పొలానికి వెళ్లి, ఫొటోలుగా కేప్చర్ చేయండి. ఏ సూపర్ మాల్‌లోనో సెల్ఫీలు దిగితే గొప్పేముంది, మనలాగే అలాంటి పబ్లిక్ ప్లేసెస్‌లో వందల మంది దిగుతారు. కానీ మనమెళ్లినది మన ఊరు, మన ఇల్లు, మన పొలం. అక్కడ ఫొటోలు దిగండి. ఆ జ్ఞాపకాలు జీవితాంతం గుర్తుండి పోతాయి.

కెమేరాతో సెలబ్రేషన్ చేద్దాం!

పండగకు ఊరెళ్ళగానే... చిన్నప్పుడు చదువుకున్న స్కూలూ, కాలేజీ, ఆ దారిలో నడుచుకుంటూ వెళ్తూ మిత్రులతో చెప్పుకున్న కబుర్లూ, పక్కనున్న మన ఊరు వెళ్లడానికి బస్, ఆటో కోసం వెయిట్ చేసిన బస్టాప్, ఏ క్లాస్ గుమ్మం దగ్గరో ఏ అమ్మాయితోనో కలిపిన మొదటి మాటలు, అప్పటి భయాలూ, ఆలోచనలూ... ఇవన్నీ ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. మీ దగ్గర మంచి ఫోన్ ఉంది. కొంతమంది దగ్గర కామ్‌కార్డర్ కూడా ఉండి ఉంటుంది.

మీ అక్క కొడుకునో, పిన్ని కొడుకునో, ఇంకెవరినైనా తీసుకుని బండేసుకుని అలా మీరు చిన్నప్పుడు తిరిగిన ప్రదేశాలన్నీ చుట్టి రండి. మీ ఫోన్‌లో ఆ జ్ఞాపకాలన్నీ బంధించండి. ఆ రోజుల్లో మీరు బుక్స్, పెన్నులూ కొనుక్కున్న షాపులకీ వెళ్లండి. అప్పట్లో అంకుల్స్‌గా ఉన్న వాళ్లంతా ఇప్పుడు తాతయ్యలై అదే కుర్చీలో కూర్చుని స్టేషనరీ అమ్ముకుంటూ ఉండి ఉంటారు. మాట కలిపి వారితో ఓ సెల్ఫీ దిగండి. ఎవడో ముక్కూ మొహం తెలీని సెలబ్రిటీ పక్కన నిలబడి ఫొటో దిగే కన్నా... ఈ ఫొటో చాలా సంతోషాన్నిస్తుంది. గతాన్నీ, జ్ఞాపకాల్నీ చంపేసుకుని బ్రతికే ఏ జీవితమూ పరిపూర్ణమైనది కాదు. అలాగే గతాల్నీ, జ్ఞాపకాల్నీ పదిలపరచలేని ఎంత గొప్ప ఫోనూ, దానిలోని గొప్ప స్పెసిఫికేషన్లూ ఎందుకూ పనికిరావు కూడా! అందుకే ఊరెళ్లి గారెలూ, అరిసెలూ తినేసి కంటి నిండా నిద్రపోవడం కాకుండా కాస్త ఓపిక చేసుకుని మీ జ్ఞాపకాల్ని బంధించండి. ఓపెన్ కెమెరా, క్యాండీ కెమెరా, రెట్రికా, హెచ్‌డి కెమెరా ఫర్ ఆండ్రాయిడ్ లాంటి పలు రకాల కెమెరా యాప్స్‌ను ప్రయత్నించవచ్చు.

అమ్మానాన్నలకూ టెక్నాలజీ!

పేరుకు చాలామంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, గొప్ప గొప్ప పొజిషన్స్‌లో ఉంటారు గానీ ఇంట్లో వాళ్లు అడిగితే ఇవన్నీ నీకెందుకూ అని కసురుకుంటారు. ఊళ్లలోనూ పరిస్థితులు మారిపోతున్నాయి. అందుకని, అమ్మా, నాన్నలకు కాలక్షేపం గురించి కాస్త ఆలోచించండి. ఇంటి పక్కనోళ్లంతా ఫోనుల్లో మునిగి తేలుతుంటే.. వీళ్లకి వీళ్లు ఎంత ఒంటరితనం అనుభవిస్తున్నారో కాస్త ఆలోచించండి. ఓ మంచి ఫోన్ కొనిపెట్టి వాట్సప్, ఫేస్‌బుక్, వాళ్లకు నచ్చే ఆధ్యాత్మిక పాటలు, వీడియోలు వెదికి చూడడం ఎలాగో నేర్పించండి.

చిన్నప్పటి మిత్రులందరినీ...

పండగకి మీరెలా ఊరెళ్లారో మీలాగే మీ ఊళ్లో ఉన్న మీ మిత్రులంతా, లేదా మీ సీనియర్లు, జూనియర్లంతా అమ్మా, నాన్నల దగ్గరకు వచ్చి ఉండొచ్చు. ఇంట్లో కూర్చుని టివితో కాలక్షేపం చేసే బదులు అలా బయటకు వెళ్లి వాళ్లందర్నీ కలవండి. వాళ్ల అమ్మానాన్నల క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకోండి. మీ గ్యాంగ్ అంతా ఊళ్లో ఏ అరుగు మీదనో కూర్చుని చిన్నప్పుడు పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుని ఉండుంటారు. వీలైతే ఓ సాయంత్రం పూట అందరూ అక్కడే కలవండి. మీ ఫోన్లో సెల్ఫీలు తీసుకోండి. ఒక్కొక్కరి వీడియో బైట్ కేప్చర్ చేసుకోండి. మీ మిత్రులందరి బర్త్‌డేలనీ, ఫేస్‌బుక్ ఐడిలనూ, ఫోన్ నెంబర్లనీ సేవ్ చేసుకోండి. గూగుల్ క్యాలెండర్‌లో వారి బర్త్‌డేలకి ప్రతీ ఏటా రిమైండర్లు వచ్చేలా సెట్ చేసుకోండి. అందరూ కలిసి తర్వాత ఓ వాట్సప్ గ్రూపో, ఫేస్‌బుక్ గ్రూపో సృష్టించుకోండి. అందులో అడ్డమైన ఫార్వార్డెడ్ మెసేజ్‌లు కాకుండా మీ చిన్నప్పుడు జ్ఞాపకాలు మాత్రమే షేర్ చేసుకుందామన్న ఓ కండిషన్ పెట్టుకోండి.

సంక్రాంతి అంటేనే జ్ఞాపకాల్ని గుర్తు చేసే భాండాగారం. చలికి ముణుక్కుంటూ చిన్నప్పుడు వేసుకున్న చలిమంటల మొదలు పెద్ద వాళ్ల గుంపులో నక్కి నక్కి మరీ అప్పట్లో చూసిన కోడి పందేల వరకూ ప్రతీదీ గొప్ప జ్ఞాపకమే. మన ఊరు, మన ఊరి మట్టి వాసన, మనవాళ్లు... ఇవన్నీ టెక్నాలజీ వల్ల అంతరించిపోతున్నాయని బాధపడే కన్నా ఇదే టెక్నాలజీని వాడుకుని గతం శాశ్వతంగా నిలిచిపోయేలా కేప్చర్ చేసుకోగలిగితే అంత కన్నా గొప్ప పండగ ఏదీ లేదు!

మీరు ఈ క్షణం ఊళ్లో గడుపుతున్న సంక్రాంతి మరో పదికాలాల పాటు మధురంగా నిలిచిపోయేదిగా ఉండాలి.



● నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

అలా చేస్తే ఫోన్ పాడవుతుందా?

నా ఫోన్లో మొబైల్ డేటాను థెటరింగ్ చేసి, లాప్‌టాప్‌లో వాడుకుంటున్నాను. ఇలా ఎక్కువ సేపు థెటరింగ్ ఎనేబుల్ చేయడం వల్ల ఫోన్ పాడవుతుందని కొంతమంది అంటున్నారు. వాళ్ళ మాట నిజమేనా?

- రామకృష్ణ, వైజాగ్



ప్రతీ ఫోన్‌లోనూ రేడియో అనే పేరుతో ఓ ప్రత్యేకమైన చిప్ ఉంటుంది. దానిలోనే ఫోన్ కాల్స్, మొబైల్ డేటా రిసీవ్ చేసుకునే సామర్థ్యంతో పాటు వైఫై రూటర్ నుండి డేటాను పొందడం, అలాగే ఫోన్‌కు వచ్చిన డేటాని ఓ రూటర్ మాదిరిగా వ్యవహరించి ఇతర డివైజ్‌లకి షేర్ చేసే వెసులుబాటు ఉంటాయి. ఈ చిప్ నాణ్యతను బట్టి నెట్ స్పీడ్, కాల్ క్వాలిటీ లాంటివి మారుతూ ఉంటాయి. అంతేకానీ.. థెటరింగ్ వాడడం వల్ల ఈ చిప్ పాడవడం గానీ, ఫోన్‌కి హాని జరగడం కానీ ఏమీ ఉండదు. అదంతా మన అపోహ మాత్రమే! మీకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ లేకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్ని గంటలైనా మీ ఫోన్‌లోని నెట్‌ని థెటరింగ్ చేసుకుని వాడుకోవచ్చు. బ్రాడ్‌బ్యాండ్ కన్నా స్పీడ్ తక్కువగా ఉండడం మినహాయించి వేరే ఎలాంటి అసౌకర్యమూ దీనివల్ల ఉండదు.

ఆ నోటిఫికేషన్‌ను పట్టించుకోవద్దు!

ఆండ్రాయిడ్ ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పనిచేసే ఫోన్ వాడుతున్నాను. కొన్నిసార్లు నోటిఫికేషన్ ఏరియాలో రన్నింగ్ ఇన్ ద బ్యాక్‌గ్రౌండ్ అనే నోటిఫికేషన్ కనిపిస్తూ ఉంటుంది. దేని వల్ల ఇలా జరుగుతోంది?

- వినయ్‌కుమార్, కోరుట్ల



ఆండ్రాయిడ్ ఓరియోలో నోటిఫికేషన్ల విషయంలో చాలా మార్పులు ప్రవేశపెట్టారు. వాటిలో చాలా వరకూ అందరికీ ఉపయుక్తంగా ఉండేవి. కాగా కొన్ని మాత్రం గందరగోళపరుస్తుంటాయి. మీరు ఏదైనా కాల్ రికార్డర్ యాప్ వాడుతున్నా, విపిఎన్ వాడుతున్నా, నిరంతరం బ్యాక్‌గ్రౌండ్‌లో పనిచేసే వేరే ఏదైనా యాప్ వాడుతున్నా ఫలానా యాప్ బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతోందంటూ ఓ నోటిఫికేషన్ నిరంతరం కనిపిస్తూ ఉంటుంది. దీని అర్థం ఫలానా యాప్ వల్ల మీ బ్యాటరీ ఖర్చవుతోంది అని ఆండ్రాయిడ్ మనకు చెబుతోంది. అంతే తప్ప మనకేదో హాని ఉంటుందని కాదు. ఇలాంటి నోటిఫికేషన్లను పట్టించుకోవలసిన పనిలేదు. ఆండ్రాయిడ్ ఎయిట్ పాయింట్ వన్‌లో ఇదే రన్నింగ్ ఇన్ ది బ్యాక్‌గ్రౌండ్ అనే మెసేజ్‌ను 'యూజింగ్ బ్యాటరీ' అని మార్పిడి చేశారు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

టెక్ ఈజీ

డాటా సెక్యూరిటీలో కింగ్!



కంప్యూటర్ స్టోరేజి ప్రొడక్ట్స్‌లో కింగ్... కింగ్‌స్టన్ కంపెనీ. ఫ్లాష్ డ్రైవ్‌లోని డాటాకు మరింత ప్రొటెక్షన్ కోసం తాజాగా 'కింగ్‌స్టన్ 2000' ఎన్‌క్రిప్టెడ్ ఫ్లాష్ డ్రైవ్‌ను మార్కెట్లోకి తెచ్చింది.

మిలటరీ గ్రేడ్ రక్షణ!

మార్కెట్లో ఉన్నవాటిలో కింగ్‌స్టన్ 2000ను అత్యుత్తమమైనదిగా చెప్పవచ్చు. స్కాన్ చేసిన పాస్‌పోర్ట్, మెడికల్ రికార్డ్ కాపీలు, రహస్య సమాచారాన్ని ఇందులో స్టోర్ చేయవచ్చు. డాటా ట్రావెలర్ 2000 నుంచి డాటాను తస్కరించటం కష్టం. ఇందులో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఎక్స్‌టీఎస్ - ఎఈఎస్ 256 హార్డ్‌వేర్ ఎన్‌క్రిప్షన్ వాడటం వల్ల ఇది పూర్తిగా సురక్షితం అని చెప్పవచ్చు. దీనికి ఒక వైపు కీపాడ్ ఉంది. తప్పుడు పాస్‌వర్డ్‌ను 10 సార్లు నొక్కితే అందులోని డాటా దానంతటదే పూర్తిగా డిలీట్ అవుతుంది. అలాగే పైన లోహపు కవచం ఉండటం వల్ల ఈ డాటా ట్రావెలర్ ఎక్కువ కాలం మన్నుతుంది. అవసరం లేదనుకుంటే కీ చైన్‌గా ఇచ్చిన స్టీల్ కేబుల్‌ను తొలగించవచ్చు. హ్యాకింగ్ ముప్పు ఎక్కువగా ఉండే ఐటీ నిపుణులు, విభాగాలకు ఇది ఉపయోగకరం. కానీ ఇతర డాటా ట్రావెలర్‌లతో పోల్చితే దీని ధర ఎక్కువే!

స్టోరేజ్ కెపాసిటీ: 16 జీబీ, 32 జీబీ, 64 జీబీ

16 జీబీ డ్రైవ్ ధర - 109 డాలర్లు

నయా గాడ్జెట్స్

వారికి శబ్దాలు వినిపిస్తాయి



ఇయర్‌గో సంస్థ వినికిడి లోపం ఉన్నవారి కోసం ఇయర్‌గో మాక్స్ పేరుతో కొత్త వినికిడి పరికరాన్ని మార్కెట్లోకి తెచ్చింది. ఇందులో వాడిన టెక్నాలజీ వల్ల శబ్దాలు తగు స్థాయిలో, స్పష్టంగా వినిపిస్తాయి. ఈ పరికరం రీచార్జబుల్ బ్యాటరీతో పనిచేస్తుది.

టైమ్ మెషిన్' కెమెరా



రోడర్ కంపెనీ 'టైమ్ మెషీన్ కెమెరా'ను మార్కెట్లోకి తెచ్చింది. కెమెరాతో తీసిన వీడియోలను వెంటనే మీ స్మార్ట్‌ఫోన్ లేదా ట్యాబ్లెట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. బ్యాటరీ ఒక్కసారి చార్జ్ చేస్తే 7 గంటల సేపు ఇది పనిచేస్తుంది.

నిద్రపుచ్చే హెడ్‌బ్యాండ్!



ఎలక్ట్రానిక్ దిగ్గజం పిలిప్స్ 'స్మార్ట్ స్లీప్' హెడ్ బ్యాండ్‌ను మార్కెట్లోకి తెచ్చింది. పడుకునేటప్పుడు దీన్ని ధరిస్తే ఇందులో ఉండే సెన్సార్‌లు మెదడు పనితీరును గుర్తిస్తాయి. క్రమ పద్ధతిలో విడుదల చేసే ధ్వని పరంపరతో చక్కటి నిద్ర పడుతుంది.

సలహాలిచ్చే స్కిన్ స్కానర్!



చర్మ సంరక్షణ ఉత్పత్తుల్లో అగ్రగామి సంస్థ జాన్సన్ అండ్ జాన్సన్ తాజాగా స్కిన్ స్కానింగ్ గ్యాడ్జెట్స్‌ను మార్కెట్లోకి తెచ్చింది. వాటిలో 'న్యూట్రోజెనా స్కిన్ 360 స్కిన్ స్కానర్' ఒకటి. ఇది ఒక యాప్‌కు అనుసంధానమై ఉంటుంది. మీ ఫోన్ కెమెరా ద్వారా ఇది చర్మాన్ని చాలా దగ్గరగా పరిశీలిస్తుంది. మొహాన్ని స్కాన్ చేసి చర్మానికి సంబంధించిన సమస్యలను గుర్తిస్తుంది. పరిష్కారాలను సైతం సూచిస్తుంది.

డైలీ సుడోకు - 78

1	7	4						
		3			5	8		
				3	7			4
				8		5		
9		2				6		1
		8		1				
4			6	2				
		7	8			3		
						4	9	6

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 77 సమాధానం

2	6	7	3	8	4	1	5	9
9	8	3	1	6	5	2	4	7
1	5	4	9	7	2	6	3	8
6	7	2	8	4	3	9	1	5
5	4	9	6	2	1	8	7	3
3	1	8	5	9	7	4	6	2
8	9	5	4	3	6	7	2	1
4	2	1	7	5	8	3	9	6
7	3	6	2	1	9	5	8	4


వడ్డేవల్లి సత్యనారాయణ గారి ఆశీస్సులతో
EMVE STUDIOS
REPUBLIC DAY
RELEASE
REWON YADHU
హౌరా బ్రిడ్జ్
Connecting Love
PRODUCER EMVE STUDIOS PVT.LTD
EDITOR KOTAGIRI VENKATESWARARAO MUSIC SEKHAR CHANDRA CINEMATOGRAPHY VIJAY MISHRA
సంక్రాంతి శుభాకాంక్షలు
mango music


UV creations
జనవరి
26
విడుదల
భాగమతి
VAMSI-PRAMOD
ASHOK
THAMAN S
MADHIE
సంక్రాంతి శుభాకాంక్షలు


సంక్రాంతి
శుభాకాంక్షలు
మనసుకు నచ్చింది
#Follow
Your
Heart


సంక్రాంతి
శుభాకాంక్షలు
టచ్ చేసి చూడు
COMING SOON


సంక్రాంతి శుభాకాంక్షలు
DEVAS
DEVAS MEDIA & ENTERTAINMENT PVT LTD
హార్ట్ బీట్
PRODUCER : SHYAM DEVABHAKTUNI
WRITTEN & DIRECTED BY : DWARAKH RAJA
MUSIC : DHARAN KUMAR
జనవరి
19న
విడుదల
A TRIDENT FILMS RELEASE
VIZAG - RAM MOHAN K - 90141 10052 / RAJAHMUNDRY - SRINIVAS N - 80085 54992 / VIJAYAWADA - NARAYANA B - 0866-6664406
TIRUPATI - RAMA KRISHNA M - 94909 92299 / HYDERABAD - SRIDHAR A - 99897 76611


ML Kumar Chowdary presents
PADMAJA PICTURES
సంక్రాంతి
శుభాకాంక్షలు
ఆచారి అమెరికా యాత్ర
అతిత్వరలో ప్రారంభం
G Nageswara Reddy
Kirthi Chowdary - Kittu


అన్నపూర్ణ వారి సంక్రాంతి బొబ్బట్టు
"రంగుల రాట్నం" బంపర్‌హిట్టు
రంగుల రాట్నం


UNIVERSAL HIT
HAPPY
SANKRANTHI
25th
Day
హలో!
A VIKRAM K KUMAR FILM
AKKINENI NAGARJUNA


UV creations
studio green
SUPER
HIT
SURIYA'S
గ్యాంగ్
సంక్రాంతి
శుభాకాంక్షలు


BLUE PLANET Entertainments
T G VISHWA PRASAD PRESENTS
people MEDIA FACTORY
RELEASING THIS MARCH
సంక్రాంతి శుభాకాంక్షలు
MLA
మంచి లక్షణాలున్న అబ్బాయ్
KIRAN REDDY BHARATH CHOWDARY UPENDRA MADHAV
VIVEK KUCHIBHOTLA
MANI SHARMA PRASAD MURELLA TAMMIRAJU KIRAN KUMAR PRAVEEN VARMA


VKA FILMS
సంక్రాంతి శుభాకాంక్షలు
WITH THE BLESSINGS OF MAA TULJA BHAVANI
జనవరి 19 విడుదల
PRODUCERS VIJAY KARAN KAUSHAL KARAN ANIL KARAN
WRITTEN & DIRECTED BY SUBRAHMANYAM RV
MUSIC SAI KARTHEEK DOP PRASAD GK EDITOR SIVA Y.PRASAD ART RK REDDY STUNTS NANDU
VKA FILMS RELEASE
93926 80706 / 98480 54706
U/A


SMT.MAMATHA PRESENTS
HAARIKA & HASSINE CREATIONS
సంక్రాంతి శుభాకాంక్షలు
అజ్ఞాతవాసి
PRINCE IN EXILE
TRIVIKRAM
S RADHA KRISHNA (CHINABABU)
ANIRUDH V MANIKANDAN A S PRAKASH
KOTAGIRI VENKATESWARA RAO PDV PRASAD RAVI VARMA
U/A ADITYA MUSIC /AgnyaathavaasiFilm
SCAN THIS QR CODE IN YOUR USE CODE & GET UPTO RS 100* CASHBACK
*T&C APPLY. MIN. 2 TICKETS. 50% CASHBACK. NEW USERS ONLY.


SANKRANTHI WINNER
మా 'జై సింహా' చిత్రాన్ని కుటుంబ సమేతంగా
ఆదరిస్తున్న మహిళా ప్రేక్షకులకు కృతజ్ఞతలు
CK సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్
జై సింహా
సి.కళ్యాణ్ కె.యస్.రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
యం.రత్నం సి.రాంప్రసాద్ రామ్-లక్ష్మణ్ ప్రవీణ్ ఆంథోని లన్‌బలివు వెంకట్ నారాయణరెడ్డి వంశీ శేఖర్
సంక్రాంతి శుభాకాంక్షలు
design dhani AELAY
U/A
ADITYA MUSIC



జీఎస్‌టి కోత, ఇన్‌ఫ్రా హోదా



రియల్టీ రంగ బడ్జెట్ కోర్కెల చిట్టా

ముంబై: పెద్ద నోట్ల రద్దుతోపాటు రెరా, జిఎస్‌టి అమలుతో భారీగా కుదేలైన స్థిరాస్తి రంగం.. ఈసారి బడ్జెట్ నుంచి ఊరట కోరుకుంటోంది. వచ్చే ఆర్థిక సంవత్సరాని(2018-19)కి ప్రవేశపెట్టబోయే బడ్జెట్ నుంచి రియల్టీ ఇండస్ట్రీ పన్నుల (జిఎస్‌టి) భారం తగ్గింపుతోపాటు మౌలిక రంగ హోదాను ఆశిస్తున్నది. గత ఏడాది రియల్ ఎస్టేట్ సెక్టార్‌లో వ్యవస్థాగతంగా పలు సంస్కరణలు చోటు చేసుకున్నాయి. దాంతో ప్రాజెక్టుల నిర్మాణం మందగించి కొత్తగా అందుబాటులోకి వచ్చిన గృహాల సంఖ్య 1,03,570 యూనిట్లకు పరిమితమైంది. 2016లో ఈ సంఖ్య 1,75,822 యూనిట్లుగా ఉంది.

- ఈసారి బడ్జెట్‌లో రియల్టీ లావాదేవీలపై జిఎస్‌టి భారాన్ని ప్రస్తుతమున్న 12 శాతం నుంచి 6 శాతానికి తగ్గించాలని పరిశ్రమవర్గాలు కోరుకుంటున్నాయి. అలాగే, స్టాంప్ డ్యూటీని కూడా జిఎస్‌టిలో చేర్చాలని వారు కోరుకుంటున్నారు.
- స్థిరాస్తి వ్యాపారానికి మౌలిక రంగ హోదా కల్పించడం వల్ల డిమాండ్‌కు తగ్గ స్థాయిలో గృహాల నిర్మాణానికి వీలవుతుందని, దీర్ఘకాలిక ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకే రుణాలు సేకరించేందుకు అవకాశం ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.
- గృహ కొనుగోలుదారులకు ఇంటి రుణ చెల్లింపులపై లభించే పన్ను రాయితీని ప్రస్తుతమున్న రూ.2 లక్షల నుంచి మరింత పెంచాలని, మొదటిసారి ఇళ్లు కొనుగోలు చేసేవారికిచ్చే పన్ను ప్రోత్సాహక పరిమితిని రూ.50 వేల నుంచి 2 లక్షల రూపాయలకు పెంచాలని రియల్టీ రంగం డిమాండ్ చేస్తోంది. తద్వారా విక్రయాలకు డిమాండ్ పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.
- భూసేకరణ నియమావళిని సైతం సంస్కరించాలని వారు కోరుతున్నారు.

ఆర్ అండ్ డికి రాయితీలు పెంచండి: ఆటో

వాహన తయారీ రంగానికి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి) వ్యయంపై గతంలో కల్పించిన పన్ను రాయితీలను పునరుద్ధరించాలని ఆటో పరిశ్రమ కోరుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాల దిగుమతికి మద్దతివ్వాలని బడ్జెట్ ముందస్తు సమావేశాల్లో ప్రభుత్వానికి సమర్పించిన కోర్కెల చిట్టాలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) పేర్కొంది. కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తామంటూ ఆటో పరిశ్రమకు ఆర్ అండ్ డి వ్యయంపై లభించే విలువ ఆధారిత పన్ను మినహాయింపు పరిమితిని 200 శాతం నుంచి 150 శాతానికి తగ్గించింది. కానీ కార్పొరేట్ పన్నును మాత్రం తగ్గించలేదని సియామ్ డిప్యూటీ జనరల్ సుగతో సేన్ అన్నారు. ఈసారి బడ్జెట్‌లో మినహాయింపు పరిమితిని మళ్లీ 200 శాతానికి పెంచాలని ఆయన కోరారు. ఆటో సంస్థలు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అంతర్గత ఆర్ అండ్ డి కార్యకలాపాల కోసం పెట్టే పెట్టుబడులు, ఇతర వ్యయాలపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకునేందుకు కేంద్రం కంపెనీలకు వెసులుబాటు కల్పించింది. అయితే 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి మినహాయింపు పరిమితిని 200 శాతం నుంచి 150 శాతానికి తగ్గించింది.

ప్రస్తుతం భారత్‌లో తయారుకానటువంటి ఎలక్ట్రిక్ వాహన విడిభాగాలను ప్రిఫరెన్షియల్ ఇంపోర్ట్ టారిఫ్ లిస్ట్‌లో చేర్చాలని సియామ్ కోరుతోంది. ఇప్పటికే కొన్ని విడిభాగాలు ఈ జాబితాలో ఉన్నాయని, అయితే మరికొన్నింటిని చేర్చాల్సిన అవసరం ఉందని సుగతో సేన్ అన్నారు. 2030కల్లా ప్రజా రవాణా విభాగంలో 100 శాతం, వ్యక్తిగత ప్రయాణ విభాగంలో 40 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉండేలా చూడాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

తయారీలో భారత్‌కు 30వ స్థానం

అగ్రస్థానంలో జపాన్.. ర్యాంకులు ప్రకటించిన డబ్ల్యుఇఎఫ్



న్యూఢిల్లీ/జెనీవా: తయారీ రంగంలో వివిధ దేశాలకు సంబంధించిన స్థానాలను వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) ప్రకటించింది. ప్రపంచ తయారీ సూచీ ప్రకారం భారత్‌కు 30వ స్థానం లభించింది. పొరుగు దేశం చైనా ఐదో స్థానంలో ఉన్నప్పటికీ బ్రిక్స్ దేశాల్లోని బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికాకన్నా భారత్ స్థానం మెరుగ్గానే ఉంది. ఈ సూచీలో జపాన్ అగ్రస్థానంలో నిలిచింది. టాప్ టెన్ దేశాల్లో జపాన్ తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనా, చెక్ రిపబ్లిక్, యుఎస్, స్వీడన్, ఆస్ట్రియా, ఐర్లాండ్ నిలిచాయి. బ్రిక్స్ దేశాల్లో రష్యా 35వ స్థానంలో, బ్రెజిల్ 41వ స్థానంలో, దక్షిణాఫ్రికా 45వ స్థానంలో నిలిచాయి. ఈ మేరకు భావి ఉత్పత్తికి సంసిద్ధత పేరుతో జెనీవా కేంద్రంగా ఉన్న డబ్ల్యుఇఎఫ్ తొలి నివేదికను విడుదల చేసింది. ఈ నెల చివర్లో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో డబ్ల్యుఇఎఫ్ వార్షిక సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడటం విశేషం. ఈ నివేదిక ఆధునిక పారిశ్రామిక వ్యూహాల్లో పురోగతిని విశ్లేషించింది. భాగస్వామ్యంతో చర్యలు తీసుకోవాలని సూచించింది. అంతేకాకుండా వంద దేశాలను నాలుగు గ్రూపులుగా విభజించింది. ఈ నాలుగింటిలో భారత్‌ను లెగసీ (వారసత్వ) గ్రూపులో చేర్చింది. ఈ గ్రూపులోని దేశాల్లో ప్రస్తుత మాన్యుఫ్యాక్చరింగ్ స్థాయి బలంగా ఉంది. అయితే భవిష్యత్ మాత్రం రిస్క్‌ను సూచిస్తుంది. ఈ గ్రూపులో హంగేరీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, రష్యా, థాయిలాండ్, టర్కీ తదితర దేశాలున్నాయి. ప్రముఖ దేశాల గ్రూపులో చైనా ఉంది. బ్రెజిల్, దక్షిణాఫ్రికాలు నవజాత గ్రూపులో ఉన్నాయి. 25 ప్రముఖ దేశాలు ఉత్పత్తి వ్యవస్థ అత్యుత్తమంగా ఉంది.

ఐదో అతిపెద్ద తయారీ దేశం

ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద తయారీ దేశంగా ఉంది. 2016 సంవత్సరంలో భారత్‌లో 42,000 కోట్ల డాలర్ల విలువైన విలువ జోడింపు జరిగింది. గత మూడు దశాబ్దాల కాలంలో దేశ తయారీ రంగం సగటున వార్షికంగా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసుకుంటుందని డబ్ల్యుఇఎఫ్ పేర్కొంది. అంతేకాకుండా దేశ జిడిపిలో ఈ రంగం వాటా 16-20 శాతం ఉన్నట్టు తెలిపింది. జనాభాపరంగా ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతంగా వృద్ధి చెందుతోందని, భారత్‌లో తయారైన ఉత్పత్తులకు డిమాండ్ క్రమంగా పెరుగుతోందని పేర్కొంది. దేశీయంగా ఉత్పత్తిని మరింతగా పెంచడానికి అవకాశం ఉందని తెలిపింది. మానవ వనరులు, స్థిరమైన వనరులు భారత్‌కు సవాళ్లను విసురుతున్నాయని, సామర్థ్యాలను పెంచడానికి మరింతగా కృషి చేయాలని పేర్కొంది. ఇందుకుగాను విద్యా ప్రణాళికను మరింత మెరుగుపరచాలని, వృత్తి శిక్షణ కార్యక్రమాల్లో మార్పులు చేర్పులు చేయాలని సూచించింది. అంతేకాకుండా డిజిటల్ నైపుణ్యాలను పెంచాలని పేర్కొంది.

తయారీ రంగం విస్తరణ నేపథ్యంలో ఇంధన వనరులకు ప్రత్యామ్నాయాలను వెతకాలని, కాలుష్య ఉద్గారాలను తగ్గించాలని డబ్ల్యుఇఎఫ్ సూచించింది. భారత ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియాకు శ్రీకారం చుట్టిందని, దీని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా భారత్‌ను మలచాలన్న లక్ష్యంతో ఉన్నట్టు పేర్కొంది.

- ఉత్పత్తి విస్తృతిలో భారత్ 9వ స్థానంలో, క్లిష్టతలో 48వ స్థానంలో ఉంది. మార్కెట్ పరిమాణం పరంగా భారత్ 3వ స్థానంలో నిలిచింది. కార్మిక శక్తిలో మహిళలు, వాణిజ్య టారిఫ్‌లు, రెగ్యులేటరీ సామర్థ్యం,సుస్థిర వనరులకు సంబంధించి మన దేశ స్థానం 90 అంతకన్నా తక్కువగా ఉంది.

ఆదాయానికి ఉత్తేజం.. లాభాల్లో నీరసం

ఆటో కంపెనీల క్యు3 గణాంకాలపై హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అంచనా

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యు3) వాహన సంస్థల ఆర్థిక ఫలితాలు ఎలా ఉండవచ్చనే దానిపై హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ నివేదిక విడుదల చేసింది. క్యు3లో ఆటో కంపెనీల ఆదాయం మెరుగైన వృద్ధి నమోదు చేసుకోవచ్చని అంటోంది. గ్రామీణ మార్కెట్‌లో వాహనాలకు డిమాండ్ పుంజుకోవడంతోపాటు పెద్ద నోట్ల రద్దు కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి విక్రయాలు నిరాశాజనకంగా ఉండటంతో (లో బేస్ ఎఫెక్ట్) సంస్థల ఆదాయలో భారీ వృద్ధి నమోదు కావచ్చని రిపోర్టు పేర్కొంది. అయితే, గణనీయంగా పెరిగిన ఉత్పత్తి వ్యయంతోపాటు ఏడాది చివర్లో ఇచ్చిన ఆఫర్లు లాభాల మార్జిన్లకు పెద్దమొత్తంలో గండికొట్టవచ్చని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అంచనా వేస్తోంది. సంస్థ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..



- మూడో క్వార్టర్‌లో చాలావరకు ఆటో కంపెనీలు, వాహన విడిభాగాల తయారీదారుల ఆదాయం రెండంకెల (14-51 శాతం) వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉంది.
- త్రైమాసిక ప్రాతిపదికన క్యు3లో ఆటో రంగ సంస్థల లాభాల్లో 0.84 శాతం మేర గండిపడవచ్చు.
- గత క్వార్టర్‌లో ప్యాసింజర్ వాహన విక్రయాలు కేవలం 7 శాతమే వృద్ధి చెందగా.. వాణిజ్య వాహన సేల్స్ మాత్రం 28 శాతం పుంజుకున్నాయి.
- గ్రామీణ మార్కెట్‌లో డిమాండ్ పునరుద్ధరణతో టూ వీల్ విక్రయాలు 18 శాతం పెరిగాయి.

ఆటో డిమాండ్.. ఇక జూమ్!

మున్ముందు అన్ని విభాగాల వాహనాలకు డిమాండ్ మరింత పుంజుకోనుందని హెచ్‌డిఎఫ్‌సి నివేదిక పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ పెట్టుబడులు, తలసరి ఆదాయం, పట్టణీకరణ మరింత పుంజుకోవడంతోపాటు మోదీ సర్కారు రూరల్ మార్కెట్‌పై ఫోకస్ పెంచనుండటం, ఆటో లోన్లపై వడ్డీ రేట్లు తగ్గడం ఇందుకు దోహదపడనుందని నివేదిక అభిప్రాయపడింది.

- వాణిజ్య వాహనాల విషయానికొస్తే.. క్యు3లో అశోక్ లేలాండ్ నికర లాభం 81 శాతానికి పైగా వృద్ధి నమోదు చేసుకోవచ్చు. గత త్రైమాసికంలో కంపెనీ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 41 శాతం పుంజుకున్నాయి. లో బేస్ ఎఫెక్ట్ ప్రభావంతో టాటా మోటార్స్ ప్రీ టాక్స్ లాభం 54 శాతం మేర వృద్ధిని నమోదు చేసుకోవచ్చని అంచనా.
- ప్యాసింజర్ కార్ల విభాగంలో అతిపెద్ద సంస్థ మారుతి సుజుకీ ఆదాయం కేవలం 14శాతం వృద్ధి చెందవచ్చు. లాభాల మార్జిన్‌కు 1.27 శాతం మేర గండిపడే అవకాశం ఉంది. టాటా మోటార్స్ లాభం 10.3 శాతంగా, మహీంద్రా లాభం 3 శాతంగా నమోదుకావచ్చు.
- త్రిచక్ర వాహన విక్రయాల దన్నుతో బజాజ్ ఆటో లాభాల మార్జిన్లు 0.50 శాతం మేర పుంజుకొనే అవకాశం ఉంది. ఆదాయం 24 శాతం మేర వృద్ధి నమోదు చేసుకోవచ్చు.
- ద్విచక్ర వాహనాల విషయానికొస్తే.. అధిక మార్కెటింగ్ వ్యయాల కారణంగా హీరోమోటోకార్ప్ మార్జిన్లు 76 శాతం మేర క్షీణించే అవకాశం ఉంది.

గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తం

(జనవరి 15-19 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ : 10681 (+122)

నిఫ్టీ గత వారం 10589-10690 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలో కదలాడి 122 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా క్లోజయింది. వరుసగా ఆరు వారాలు పైకి పయనించినందు వల్ల ఈ వారంలో కూడా ఎగువకే కదిలే ఆస్కారం ఉంది.

- డిసెంబరు 26, 27 తేదీల్లో చంద్రుడు ఉత్తరాభాద్ర నుంచి రేవతి నక్షత్రాల నడుమ సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధి 10478-10552. వరుసగా రెండో వారంలో ఎగువకే పయనించి గత వారంలో పాజిటివ్‌గా క్లోజయినందు వల్ల ఈ వారంలో కూడా బుల్లిష్ ధోరణికే ఆస్కారం ఉంది.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బుల్లిష్‌గా ఉంది. మధ్యకాలిక, దీర్ఘకాలిక దృక్పథాలు రెండింటిలో కూడా నిఫ్టీ బుల్లిష్‌గానే ఉంది. 10500 కన్నా దిగువన ముగిసినప్పుడే బేరిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10527, 10390, 10225, 9907 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ అన్ని డిఎంఏల కన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10750

బ్రేక్‌డౌన్ స్థాయి : 10500

నిరోధ స్థాయిలు: 10825, 10900 (10750 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 10525, 10450 (10600 దిగువన బేరిష్)

గ్రహగతులివే..

- ధనుస్సులోని మూల పాదం 3 నుంచి కుంభంలోని ధనిష్ట పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2-3 మధ్యలో రవి సంచారం
- ధనుస్సులోని మూల పాదం 4 నుంచి పూర్వాషాఢ పాదం 2 మధ్యలో బుధ సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2-4 మధ్యలో శుక్ర సంచారం
- ధనుస్సులోని విశాఖ పాదం 3 నుంచి వృశ్చికంలోని విశాఖ పాదం 4 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3లో మిథున నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 2లో వృషభ నవాంశలో బృహస్పతి సంచారం
- మకరంలో రాహువు, కర్కాటకంలో కేతువు కర్కాటక, మకర నవాంశల్లో సంచారం.

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ద్వితీయార్ధం నిస్తేజం (సోమవారానికి)

తిథి: పుష్య బహుళ చతుర్దశి

నక్షత్రం : మూల

రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 9.31, 12.32

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 9.30 నుంచి 11 గంటల మధ్యన నిస్తేజంగా ట్రేడవుతూ 11.10 నుంచి 12.40 మధ్యలో మెరుగ్గా ఉండి ఆ తర్వాత ముగింపు వరకు నిస్తేజంగానే ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...


నిఫ్టీ ఫ్యూచర్స్ 9.40 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్ లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.30కి క్లోజ్ చేసుకోవచ్చు. 1.30 తర్వాత మళ్లీ ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10720, 10755 మద్దతు స్థాయిలు: 10640, 10605

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

ఫ్యూచర్స్‌తో రైతుకు లాభం



న్యూఢిల్లీ : అధిక ఉత్పాదకతే కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరల క్షీణతకు కారణమని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా ఎన్‌సిడెక్స్‌లో గోరుచిక్కుడు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ దీని వల్ల రానున్న రోజుల్లో రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు పొందగలుగుతారని ఆయన చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరల క్షీణతకు సరైన మందు ఫ్యూచర్స్ ట్రేడింగ్ అని ఆయన అన్నారు. దేశంలో గోరుచిక్కుడులో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించిన రెండో ఎక్స్ఛేంజీ ఎన్‌సిడెక్స్. గత అక్టోబరులో ఎంసిఎక్స్ దీన్ని తొలుత ప్రవేశపెట్టింది. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు రైతన్నలు అందిస్తున్న వాటాను ఆయన ప్రశంసించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలు అందించే దిశగా ఆప్షన్స్ ట్రేడింగ్ ఒక చిన్న అడుగే కావచ్చునని, దీర్ఘకాలంలో అది రైతన్నలకు ఎంతో లాభసాటి అవుతుందని జైట్లీ అన్నారు. ఈ ఆప్షన్స్ ట్రేడింగ్‌తో రైతులు తమ ఉత్పత్తికి వచ్చే ధరలను హెడ్జ్ చేసుకోవచ్చని, ధరలు భారీగా క్షీణించిన సమయంలో అది రైతుల పాలిట కామధేనువుగా నిలుస్తుందని ఎన్‌సిడెక్స్ సిఇఒ సమీర్ షా అన్నారు. దేశవ్యాప్తంగా 15 లక్షల మంది వ్యవసాయదారులు గోరుచిక్కుడు పండిస్తున్నారని అంచనా అని ఎక్స్ఛేంజి చైర్మన్ రవి నారాయణ్ దాస్ చెప్పారు. బడ్జెట్ ప్రకటనను ఇది పాక్షికంగా సాఫల్యం చేస్తుందంటూ రానున్న బడ్జెట్‌లో ఆర్థికమంత్రి మరిన్ని చర్యలు ప్రకటించగలరన్న ఆశాభావం ఆయన ప్రకటించారు.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	402.00	చిత్తూరు	398.00
వరంగల్	404.00	చెన్నై	405.00
విజయవాడ	406.00	నమక్కల్	395.00
గోదావరి	406.00	బెంగళూరు	405.00
విశాఖపట్నం	406.00	ముంబై	447.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	90.00	విజయవాడ	90.00
కరీంనగర్	91.00	గుంటూరు	90.00
వరంగల్	90.00	ఒంగోలు	92.00
మహబూబ్‌నగర్	90.00	చిత్తూరు	80.00
కర్నూలు	90.00	నెల్లూరు	88.00
విశాఖపట్నం	82.00	అనంతపురం	88.00
గోదావరి	90.00		

ఆటుపోట్లకు ఆస్కారం



విజయ్ సింఘానియా

డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

మార్కెట్ నాడి

"ఈ వారంలో స్ర్కిప్ ఆధారిత కదలికలే ఎక్కువగా ఉండవచ్చు. క్యు3 ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు, క్రూడాయిల్ ధరల ధోరణులే మార్కెట్ కదలికలకు కీలకం కావచ్చు."

స్టాక్ మార్కెట్‌లో కొత్త సంవత్సరం ర్యాలీ వరుసగా రెండో వారంలో కూడా కొనసాగింది. ఏ రోజుకారోజు కొత్త శిఖరాలకు ఇండెక్స్‌లు చేరుతూ ఉండడంతో ఈ జోరు ఆగేలా కనిపించడంలేదు. మరిన్ని కార్పొరేట్ ఫలితాలు ఈ వారంలో వెలువడనున్నాయి. కేంద్ర బడ్జెట్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతున్నందు వల్ల మార్కెట్‌లో ఆటుపోట్లకు ఆస్కారం ఉంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 29వ తేదీ నుంచి ప్రారంభంకావచ్చని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ 2018-19 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ జయంతి కారణంగా అమెరికా మార్కెట్లకు సోమవారం సెలవు.

గణాంకాలు...

దేశంలో టోకుధరల సూచి ద్రవ్యోల్బణం గణాంకాలు సోమవారం వెలువడనున్నాయి. బ్రిటన్‌లో వినియోగదారుల ధరల సూచి గణాంకాలు, చైనా జిడిపి గణాంకాలు మంగళవారం వెలువడనున్నాయి. అమెరికా క్రూడాయిల్ నిల్వల గణాంకాలు గురువారం, బ్రిటన్‌లో డిసెంబరు నెలకు రిటైల్ అమ్మకాల గణాంకాలు శుక్రవారం వెలువడనున్నాయి.

ఈ వారం ఫలితాలివే...

అదానీ పవర్, హిందుస్తాన్ యునిలీవర్, జీ ఎంటర్‌టైన్‌మెంట్ (బుధవారం), అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, భారతి ఎయిర్‌టెల్, హిందుస్థాన్ జింక్, అల్ట్రాటెక్ సిమెంట్, యస్ బ్యాంక్ (గురువారం), హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐడిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, కోటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో (శుక్రవారం).

టెక్నికల్స్ ఇవే...

నిఫ్టీ ముందువారంలో ఏర్పడిన బలమైన కదలికను నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. కన్సాలిడేషన్ దశలో ఉన్నప్పటికీ కొత్త గరిష్ఠ స్థాయిలను తాకడం ఆరోగ్యకరమైన సంకేతం. వీక్లీ చార్టుల్లో మరో తాజా బ్రేకౌట్ కనిపిస్తోంది. నిఫ్టీ 10800-10850 దిశగా కదిలే ఆస్కారం ఉంది. సమీప మద్దతు స్థాయి 10575 వరకు క్షీణిస్తే తిరిగి ప్రవేశించేందుకు మంచి అవకాశంగా మలుచుకోవచ్చు.

- బ్యాంక్ నిఫ్టీ కూడా వేగం అందుకునే ప్రయత్నంలో ఉంది. వీక్లీ చార్టుల్లో తాజా బ్రేకౌట్ కనిపిస్తోంది. డెయిలీ చార్టుల్లో కూడా కీలక మద్దతు స్థాయి 24500 కన్నా పైన నిలదొక్కుకుంది.
- ఆప్షన్స్ గణాంకాల ప్రకారం నిఫ్టీ ఆప్షన్స్‌కు ప్రస్తుత సీరీస్‌లో 11000 సిఇ, 10500 పిఇ వద్ద ఓపెన్ ఇంటరెస్ట్ కనిపిస్తోంది. బ్యాంక్ నిఫ్టీకి 26000 సిఇ, 25500 పిఇ వద్ద ఓపెన్ ఇంటరెస్ట్ కనిపిస్తోంది.

టార్గెట్ 10800



వి. సుందర్ రాజా

టెక్ వ్యూ



నిఫ్టీ గత వారంలో 10650 పాయింట్ల వరకు వెళ్లి రియాక్షన్ సాధించింది. కాని అది మైనర్ రియాక్షన్‌కే పరిమితం కావడంతో తదుపరి తిరిగి అప్‌ట్రెండ్‌ను కొనసాగించి శుక్రవారం నాడు బలమైన కదలికతో 10650 పాయింట్ల వరకు వెళ్లి వారం గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. ఇది సానుకూలత సంకేతం. టెక్నికల్‌గా అప్‌ట్రెండ్ కొనసాగుతోంది, వీక్లీ చార్టుల్లో కూడా ఏడు వారాలుగా నిరంతర అప్‌ట్రెండ్ కనిపించడం, శుక్రవారం అమెరికన్ మార్కెట్ బలమైన అప్‌ట్రెండ్ సాధించడం వల్ల కొత్త గరిష్ఠ స్థాయిలను తాకే ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలివే...

నిరోధం: 10740, 10800

మద్దతు : 10700, 10650

బుల్లిష్ స్థాయిలివే...

మరింత పురోగమించినట్టయితే ప్రధాన నిరోధం 10800 వరకు వెళ్లే ఆస్కారం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయి పైన బలంగా క్లోజ్ కావాలి. తదుపరి టార్గెట్ 11000. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.

బేరిష్ స్థాయిలు...

మైనర్ మద్దతు స్థాయి 10650 కన్నా దిగువన క్లోజయితే మైనర్ అప్రమత్త సంకేతం ఇస్తుంది. గత వారంలో ఏర్పడిన బాటమ్ ప్రధాన మద్దతు స్థాయి 10590 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ సంకేతం ఇస్తుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 10500.

- బ్యాంక్ నిఫ్టీ వాస్తవ సామర్థ్యం కన్నా తక్కువగానే కదలాడుతూ 25800 వద్ద బలమైన నిరోధం ఎదుర్కొంటోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం అ పైన బలంగా క్లోజ్ కావాలి. తదుపరి టార్గెట్ 26000 (నవంబరు 28న తాకిన స్థాయి). ప్రధాన మద్దతు స్థాయి 25800 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 25500 కన్నా దిగువన స్వల్పకాలిక కరెక్షన్‌గా భావించాలి.

స్వల్పకాలిక వ్యూహం: స్వల్పకాలిక ట్రేడర్లు 10500 కన్నా దిగువన స్టాప్‌లాస్‌తో బై పొజిషన్లు హోల్డ్ చేయవచ్చు. ఇన్వెస్టర్లు గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి.

పాటర్న్...

45 డిగ్రీల కోణంలో ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్‌కన్నా ఇండెక్స్ చాలా పైన ఉండడం సానుకూల సంకేతం. నెలవారీ చార్టుల్లో ఓవర్‌బాట్ స్థితి కొనసాగుతోంది. 10590కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది. 20 డిఎంఎకన్నా మార్కెట్ చాలా పైనే ఉండడం సాధారణ పరిస్థితుల్లో ఎలాంటి ముప్పు లేదనేందుకు సంకేతం.

టైమ్: ఈ సూచిక ప్రకారం తదుపరి రివర్సల్ బుధవారంనాడు ఉంది.

సూచన : గరిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బాటా ఇండియా (రూ.748) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.750 ఎగువన అప్‌ట్రెండ్ **మొదటి నిరోధం** రూ.780 **రెండో నిరోధం** రూ.820

రూ.740 దిగువన డౌన్‌ట్రెండ్ **మొదటి మద్దతు** రూ.710 **రెండో మద్దతు** రూ.680

గెయిల్ (రూ.493) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.490 ఎగువన అప్‌ట్రెండ్ **మొదటి నిరోధం** రూ.510 **రెండో నిరోధం** రూ.530

రూ.480 దిగువన డౌన్‌ట్రెండ్ **మొదటి మద్దతు** రూ.460 **రెండో మద్దతు** రూ.440

■ వి.సుందర్ రాజా,

www.sundartrends.in

బిజినెస్ ప్లస్

పిండి కొద్దీ రొట్టె అని సామెత. రిస్క్ కొద్దీ రాబడులు అనేది స్టాక్ మార్కెట్ నానుడి. ఎంత రిస్క్ ఉన్నా దీర్ఘ కాలంలో స్టాక్ మార్కెట్‌పై వచ్చినంత రాబడులు మరే పెట్టుబడుల్లోనూ రావు. అయితే ఈక్విటీ మార్కెట్ పెట్టుబడుల విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. లేకపోతే కొంప కొల్లేరయ్యే ప్రమాదం ఉంది. మారుతున్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ పెట్టుబడి అవకాశాలను 'బిజినెస్ ప్లస్' పాఠకులకు వివరిస్తున్నారు యుటిఐ ఎఎంసి ఈక్విటీ హెడ్ వెట్రి సుబ్రమణియం.



రాబడులకు ఈక్విటీ షేర్లు బెస్ట్



కొన్ని ఇబ్బందులున్నా గత మూడేళ్లలో భారత్ మంచి వృద్ధి రేటునే నమోదు చేసింది. ప్రభుత్వం కూడా ఇందుకు అవసరమైన అనేక విధానపరమైన చర్యలు తీసుకుంది. ఈ చర్యలతో మన ఆర్థిక వ్యవస్థ మూలాలు పటిష్ఠమయ్యాయి. దీంతో గత మూడేళ్లుగా స్టాక్ మార్కెట్లో దేశీయ ఇన్వెస్టర్ల పెట్టుబడులు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగాయి. వాస్తవానికి మనకు ఉన్న అవకాశాలతో పోలిస్తే ప్రస్తుతం సాధిస్తున్న వృద్ధి రేటు చాలా తక్కువ. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. స్టాక్ మార్కెట్ పెద్ద సస్పెన్స్. ఎపుడు ఎలా మలుపులు తిరుగుతుందో ఎవరికీ తెలియదు. ఆ మలుపులను ఊహించడం పెద్ద సవాలే. మన మార్కెట్ దీర్ఘకాలిక రాబడులను పరిశీలిస్తే, ఇన్వెస్టర్లు ఇప్పటికీ ఈక్విటీ షేర్లలో పెట్టుబడులు పెంచుకోవచ్చు.


మార్కెట్ పరిస్థితి

స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై రాబడులు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లలా ఒకేలా ఉండవు. అనేక అంశాల ఆధారంగా మారుతుంటాయి. ఇక్కడ ఫండమెంటల్స్ కంటే ఇన్వెస్టర్ల ప్రవర్తనే కీలకం. గత ఐదారేళ్లలో భారత స్టాక్ మార్కెట్లో పెద్దగా ఆటుపోట్లు లేవనే చెప్పాలి. మధ్యలో అప్పుడప్పుడు కొద్దిపాటి ఆటు పోట్లు వచ్చినా, ఇన్వెస్టర్లు అందుకు సిద్ధంగానే ఉండడంతో పెద్ద నష్టాలేమీ ఎదురవలేదు.

మిడ్‌క్యాప్ ఫండ్స్‌పై రాబడులు

గత మూడేళ్లలో నిఫ్టీ సగటు రాబడులు చూస్తే నిరాశే మిగులుతుంది. ఈ కాలంలో నిఫ్టీ సగటు వార్షిక రాబడులు ఏడు శాతం మాత్రమే. ఇదే సమయంలో ఈక్విటీలతో పోలిస్తే బాండ్స్ (రుణ పత్రాలు) మార్కెట్ మంచి రాబడులు ఇచ్చింది. అయితే గత మూడేళ్లలో మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు మాత్రం ఇన్వెస్టర్లకు ఏటా సగటున 20 నుంచి 24 శాతం రాబడులు పంచాయి. మిడ్ క్యాప్ షేర్లపై రాబడులు, లార్జ్ క్యాప్ షేర్లను మించి పోయాయి. ప్రస్తుతం అనేక మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు లార్జ్ క్యాప్ కంపెనీల షేర్ల కంటే ప్రీమియంతో ట్రేడవుతున్నాయి. గత మూడేళ్ల నుంచి ఈ ప్రీమియం కొనసాగడమేగాక మరింత పెరిగింది.





ఎన్‌బిఎఫ్‌సిలు

ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో ఫైనాన్షియల్ రంగానికి చెందిన కంపెనీల షేర్ల ఆధిపత్యం కొనసాగుతోంది. అందుకే దేశ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల్లో ఈ షేర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బెంచ్‌మార్క్ ఇండెక్స్‌ల్లోనూ ఈ కంపెనీల వాటా 32 నుంచి 33 శాతం వరకు ఉంది. దీంతో అన్ని తరగతుల ఇన్వెస్టర్లు.. ఫైనాన్షియల్ కంపెనీల షేర్లలో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఉన్న పెట్టుబడులన్నీ ఇదే తరహా కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేయడం ఏ మాత్రం మంచిది కాదు.

దేశంలో బ్యాంకుల పరపతిని పరిశీలిస్తే ఇప్పటికీ రిటైల్ రంగానికి ఇచ్చే అప్పులు చాలా తక్కువ. అమెరికా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇందుకు పూర్తిగా వ్యతిరేక పరిస్థితి. అక్కడ బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు ఇచ్చే రుణాల్లో ఎక్కువ భాగం రిటైల్ రుణాలే. కంపెనీలన్నీ బాండ్ మార్కెట్ లేదా ఈక్విటీ మార్కెట్ ద్వారా అవసరమైన నిధులు సమీకిస్తాయి. మన దేశంలోను ఇటీవల రిటైల్ రుణాలు ఊపందుకుంటున్నాయి. బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలకు ఇది కలిసి రానుంది.

మిడ్‌క్యాప్ స్టాక్స్‌తో జర జాగ్రత్త

ఐటిసి-01 అంటే ఏమిటి? ఎవరు ఫైల్ చేయాలి?

ఇదీ జీఎస్‌టీ

జిఎస్‌టిలో రిజిస్ట్రేషన్ కలిగి అమ్మకం మీద పన్ను కట్టే వారికి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటిసి) తీసుకునే సదుపాయం ఉందన్న విషయం తెలిసిందే. ఈ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. జిఎస్‌టి రావటానికి ముందు ఉన్న స్టాక్ మీద క్రెడిట్ తీసుకోవటానికి, అప్పటికే ఉన్న క్రెడిట్‌ను జిఎస్‌టిలోకి మార్చుకోవటానికి జిఎస్‌టిలో సదుపాయం కల్పించారు. అలాగే జిఎస్‌టి రిజిస్ట్రేషన్ తీసుకున్న తర్వాత కొనుగోలు చేసే సరుకు మీద కూడా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవచ్చు. కానీ, జిఎస్‌టి వచ్చే నాటికి కొంతమందికి రిజిస్ట్రేషన్ అవసరం లేకపోవచ్చు. ఎందుకంటే వీరి వ్యాపారం రూ.20 లక్షల లోపు ఉండవచ్చు. క్రమేపి వ్యాపారం పెరిగి కొంతకాలం తర్వాత రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సిన అవసరం ఏర్పడవచ్చు.



మరి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు అంటే వీరు అమ్మే సరుకు మీద జిఎస్‌టి కట్టి విక్రయించాలి. అంటే రిజిస్ట్రేషన్ తేదీ నాటికి ఉన్న పాత సరుకును కూడా జిఎస్‌టి కట్టి విక్రయించాల్సి ఉంటుంది. మరి ఆ సరుకును కొనుగోలు చేసేటప్పుడు ఆ వ్యాపారి కట్టిన జిఎస్‌టికి సంబంధించి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ఎలా తీసుకోవాలి.

అలాగే ఒక వర్తకుడు జిఎస్‌టిలో రిజిస్ట్రేషన్ పొంది కాంపోజిషన్ స్కీమ్‌లో వ్యాపారం చేస్తున్నాడు అనుకుందాం. కాంపోజిషన్ స్కీమ్‌లో ఉన్నంత కాలం అతను ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకునే సదుపాయం లేదు. కానీ, నిర్దిష్ట టర్నోవర్ పరిమితి దాటిన తర్వాత అతను సాధారణ వ్యాపారస్తుడు మాదిరిగానే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆ తర్వాత కొనుగోలు చేసే సరుకు మీద ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవచ్చు. కానీ, కాంపోజిషన్ స్కీమ్ నుంచి బయటకు వచ్చే నాటికి ఉన్న సమయంలో అతని వద్ద ఉన్న సరుకుకు సంబంధించిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ఎలా తీసుకోవాలి ? ఎందుకంటే వాస్తవానికి ఆ సరుకు తను కాంపోజిషన్ స్కీమ్‌లో ఉన్న కాలంలో కొనుగోలు చేసింది. అందుకే కొనుగోలు చేసిన సమయంలో ఎలాంటి క్రెడిట్ తీసుకోవటానికి అనుమతి లేదు. కానీ, సరుకు అమ్మే సమయంలో స్కీమ్ నుంచి బయటకు వచ్చి సాధరణ పన్ను కట్టి విక్రయిస్తున్నాడు. కాబట్టి ఆ స్టాక్‌కు సంబంధించిన ఇన్‌పుట్ టాక్స్ సదుపాయం కూడా అతనికి లభించాలి.


గొండాల రాంబాబు

ఇలాంటి ప్రత్యేక సందర్భాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఐటిసి-01 అనే ఫారమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో పూర్తి చేయటం ద్వారా ఇలాంటి సందర్భాల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పొందవచ్చు. అలాగే పైన చెప్పిన ఉదాహరణలోనే కాకుండా ఒక సరఫరా మీద కొంతకాలం పన్ను లేకుండా ఉండవచ్చు. ఆ తర్వాత దాని మీద పన్ను విధించవచ్చు. అలాంటి సందర్భాల్లో కూడా పన్ను విధించే నాటికి ఉన్న స్టాక్ మీద ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవచ్చు. (ఆయా సరుకు మీద కొనుగోలు సమయంలో జిఎస్‌టి కట్టి ఉంటే).

ఈ ఐటిసి-1 ఫారమ్ ఆన్‌లైన్‌లో సర్వీసెస్ అనే బటన్ కింద లభిస్తుంది. దీన్ని నింపటం ద్వారా ఆయా సందర్భాల్లో లభించే క్రెడిట్ పొందవచ్చు.

జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

బీమా రంగంలో టెలిమాటిక్స్

ప్రస్తుతం ఇంజన్ సామర్థ్యం, వినియోగం, వయస్సు వంటి విషయాల ఆధారంగా మోటార్ వాహనాల ప్రీమియం నిర్ణయిస్తున్నారు. ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీల ప్రీమియంను మాత్రం ఆయా వ్యక్తుల వయస్సు, స్త్రీ-పురుషులు, అలవాట్లు, ఆరోగ్య పరిస్థితులను బట్టి నిర్ణయిస్తున్నారు. టెలిమాటిక్స్ టెక్నాలజీతో బీమా రంగంలో చోటు చేసుకోనున్న మార్పుల గురించి 'బిజినెస్ ప్లస్' పాఠకులకు 'ది థర్డ్ అంపైర్ మీడియా' సిఇఒ సునీల్ ధవళ వివరిస్తున్నారు.



రాబోయే మార్పులు

టెలిమాటిక్స్‌తో బీమా పాలసీల ప్రీమియం ముఖచిత్రమే మారిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఇంటర్నెట్, మొబైల్ టెలిఫోన్ విస్తరణతో టెలిమాటిక్స్ టెక్నాలజీ రోజురోజుకి మరింత విస్తృతమవుతోంది. మోటార్ ఇన్సూరెన్స్‌తో పాటు, ఆరోగ్య, జీవిత బీమా రంగంలోనూ కంపెనీలు, ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి. ఇవి ఇంటర్నెట్‌తో అనుసంధానమైన పరికరాల నుంచి ఆయా వ్యక్తుల ఆరోగ్యం, వాహనాలు నడిపే తీరు, వాహనాల పరిస్థితులను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తుంటాయి. గత సంవత్సరం బ్లూటూత్, 4జి కనెక్టివిటీ కలిగి ఉండి ఐఒటి ఆధారంగా పనిచేసే పరికరాలను కార్ రెంటల్ సంస్థలు కార్లలో అమర్చాయి. వీటి ద్వారా కార్లను రెంట్‌కు తీసుకున్న వ్యక్తుల డ్రైవింగ్ తీరుతెన్నులను ఎప్పటికపుడు ట్రాక్ చేయవచ్చు. అలాగే కారులో ఎంత ఇంధనం ఉంది? డ్రైవర్ క్లచ్, బ్రేకులు సరిగా ఉపయోగిస్తున్నారా? లేదా? అనే వివరాలూ తెలుసుకోవచ్చు. ఇంకా నిర్లక్ష్యంగా ఎడాపెడా వాహనం నడుపుతూ సడన్‌గా బ్రేకులు వేస్తున్నారా? సీటు బెల్టు కట్టుకుంటున్నారా? లేదా? ఇంజన్ కండీషన్ ఎలా ఉంది? అనే విషయాలూ తెలుసుకోవచ్చు. ఆరోగ్య బీమాకు సంబంధించి కూడా, బీమా కంపెనీలు ఈ పరికరాల సాయంతో ఆయా వ్యక్తుల వ్యక్తిగత ఫిట్‌నెస్, జీవన శైలిపై అంచనాకు రావచ్చు.



ప్రీమియంలో మార్పులు

ఈ వివరాల ఆధారంగా బీమా కంపెనీలు ముందు ముందు ప్రీమియం నిర్ణయించే అవకాశం ఉంది. జాగ్రత్తగా వాహనాలు నడిపే వారికి తక్కువ ప్రీమియంతో, నిర్లక్ష్యంగా నడిపే వారి నుంచి ఎక్కువ ప్రీమియం వసూలు చేసేందుకు ఆస్కారం ఉంది. అలాగే మంచి వ్యక్తిగత అలవాట్లు, జీవన శైలి ఉండే వారి నుంచి తక్కువ ప్రీమియం వసూలు చేస్తారని భావిస్తున్నారు. ఈ విషయాలు పరిశీలించేందుకు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డిఎఐ) ఇప్పటికే ఒక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసింది. ఈ గ్రూప్ సిఫార్సులతో థర్డ్ పార్టీ మోటార్ ఇన్సూరెన్స్ ప్రీమియంలోనూ మార్పులు జరిగే అవకాశం ఉంది.

ఇతర మార్పులు

కొత్త టెక్నాలజీతో ప్రీమియం చెల్లింపు విధానంలోనే కాకుండా బీమా రంగంలోని ఉద్యోగ అవకాశాల్లోనూ మార్పు వచ్చే అవకాశం ఉంది. ఉద్యోగ అవకాశాలు తగ్గడంతో పాటు ఉన్న ఉద్యోగాలు కుదించుకు పోతాయని అంచనా. టెలిమాటిక్స్ టెక్నాలజీ ద్వారా బీమా క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్లు సులభంగా, త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉంది.




ఎస్కార్ట్స్

దేశంలోని అగ్రగామి కంపెనీల్లో ఒకటి. అగ్రి మెషినరీ, కన్‌స్ట్రక్షన్ పరికరాలు, రైల్వే పరికరాలను తయారు చేస్తోంది. మొత్తం రెవెన్యూలో 80 శాతం మేర వ్యవసాయ యంత్రాల విభాగం, కన్‌స్ట్రక్షన్ పరికరాల విభాగం నుంచి 14.5 శాతం, రైల్వే పరికరాల విభాగం నుంచి 5.8 శాతం రెవెన్యూ వస్తోంది. దేశంలో ఆరు ప్లాంట్ల ద్వారా కార్యకలాపాలను నిర్వహిస్తోంది. అలాగే పోలాండ్‌లో కూడా ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్ల మార్కెట్లో తన వాటాను 10.8 శాతానికి పెంచుకోగలిగింది. వ్యవసాయ ప్రధాన రాష్ట్రాల్లో తన వాటాను గరిష్ఠంగా పెంచుకోవటం ద్వారా మొత్తం ట్రాక్టర్ల పరిశ్రమ సగటు కన్నా మెరుగైన వృద్ధి రేటును నమోదు చేసింది. అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లో హెరిటేజ్ బ్రాండ్ పేరుతో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. యూరప్, అమెరికా దేశాల్లో టైయర్-4 పర్యావరణ నిబంధనలతో 22 హెచ్‌పి, 90 హెచ్‌పి శ్రేణిలో ట్రాక్టర్లను ప్రవేశపెట్టింది.

అధిక సామర్థ్యంతో మరిన్ని ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. దేశీయ మార్కెట్లోకి ఇటీవల ఎలక్ట్రిక్, హైడ్రోస్టాటిక్ కాన్సెప్ట్ ట్రాక్టర్లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఉన్న సామర్థ్య వినియోగాన్ని గణనీయంగా పెంచుకోవటం ద్వారా ఆర్ఒసిఇని పెంచుకోవాలని భావిస్తోంది. కన్‌స్ట్రక్షన్, మెటీరియల్ హ్యాండ్లింగ్ పరికరాల విభాగం దేశీయ మార్కెట్లో 10 శాతం వాటాను కలిగి ఉంది.

ఈ విభాగంలో వివిధ రకాల ఉత్పత్తులతో భారీ రేంజ్‌ను కలిగి ఉంది. పిక్ అండ్ క్యారీ క్రేన్స్, బ్యాక్ హో లోడర్లు, కాంపాక్టర్స్ కన్‌స్ట్రక్షన్ క్రేన్స్, ఫోర్క్ లిఫ్ట్ ట్రక్స్ తదితర పరికరాలను తయారు చేస్తోంది. గత రెండేళ్లు నిర్మాణ రంగం వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో కంపెనీ ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఉంది. 2017-18లో దేశీయ నిర్మాణ రంగం 16.3 శాతం మేర వృద్ధి చెందుతుందని అంచనా. ఇక రైల్వే పరికరాల విభాగంలో బ్రేక్స్, కప్లర్స్, సస్పెన్షన్ సిస్టమ్స్, కాంపోజిట్ మెటీరియల్స్, టెస్టింగ్ పరికరాలను తయారు చేస్తోంది. గత వందేళ్లుగా ఈ పరికరాలను భారతీయ రైల్వేకు సరఫరా చేస్తోంది. బోగీ మౌంటెడ్ బ్రేక్ సిస్టమ్స్‌కు భారీ ఆర్డర్‌ను పొందిన కంపెనీ ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించింది. అలాగే షాక్ అబ్జర్వర్ సిస్టమ్స్‌కు కూడా ఇటీవల ఆర్డర్‌ను దక్కించుకుంది. ఇటీవల అభివృద్ధి పరిచిన ఆక్సిల్ మౌంటెడ్ డిస్క్ బ్రేక్స్ ప్రస్తుతం టెస్టింగ్ దశలో ఉంది. ఈ ఏడాది చివరి నాటికి తుది అనుమతులు లభించి ఆర్డర్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రైల్వే పరికరాల విభాగానికి రూ.175 కోట్లకు పైగా ఆర్డర్ బుక్ ఉంది. ఈ విభాగంలో ఉత్పత్తుల రేంజ్‌ను పెంచటంతో పాటు టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రైల్వే మౌలిక సదుపాయాల రంగంలో నూరు శాతం ఎఫ్‌డిఐలను అనుమతించిన విషయం తెలిసిందే. 12 వ పంచవర్ష ప్రణాళికలో దాదాపు 7,000 కోట్ల డాలర్ల వ్యయాన్ని అంచనా వేశారు. గత ఏడాది కాలంగా రుతుపవనాలు సానుకూలంగా ఉండటం, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర పెంచటం వంటి అంశాలు వ్యవసాయ పరికరాల రంగానికి అనుకూలం కానున్నాయి. ప్రస్తుతం ఉన్న 7.5 శాతం స్థూల లాభ మార్జిన్లు 2017-18 ఆర్థిక సంవత్సరంలో రెండంకెల స్థాయికి చేరుకుంటాయని భావిస్తోంది.



టెక్నికల్స్

టెక్నికల్‌గా ఈ షేరు గత వారం జీవిత కాల గరిష్ఠ స్థాయిలో క్లోజైంది. అలాగే బుల్లిష్ ప్రైస్ ప్యాట్రన్ అసెండింగ్ ట్రయాంగిల్ బ్రేకౌట్ జరిగింది. స్వల్ప, దీర్ఘకాలిక మూవింగ్ యావరేజీలకు ఎగువన ట్రేడ్ అవుతూ ఉంది. గత రెండు వారాలుగా వాల్యూమ్స్ 50 వారాల సగటు కన్నా ఎక్కువగా నమోదవుతున్నాయి. విలియమ్స్ ఓ నీల్ మెథడాలజీ ప్రకారం అక్యుములేషన్ జరుగుతూ ఎ- రేటింగ్ ను కలిగి ఉంది. అలాగే ఎనిమిది వారాల కప్ అండ్ హ్యాండిల్ బ్రేకౌట్ కూడా జరిగింది. మూమెంటమ్ ఇండికేటర్లన్నీ బుల్లిష్ ధోరణిని ధ్రువీకరిస్తున్నాయి. డైరెక్షనల్ మూమెంట్ ఇండికేటర్ ఎడిఎక్స్ 22 స్థాయికి ఎగువన బుల్లిష్ డైరెక్షన్‌ను సూచిస్తోంది. ఈ షేరు వచ్చే వారం రూ.788 నుంచి రూ.825 మధ్య శ్రేణిలో అక్యుములేట్ చేయవచ్చు. టెక్నికల్ స్టాప్‌లాస్ రూ.745. స్వల్పకాలిక లక్ష్యం రూ.975. వచ్చే ఏడాది కాలంలో ఈ షేరు రూ.1,035 నుంచి రూ.1,170 లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

ఫండమెంటల్స్

సెప్టెంబరు త్రైమాసికంలో 23.2 శాతం వృద్ధితో 12,116.85 కోట్ల రెవెన్యూను సాధించింది. ట్రాక్టర్ అమ్మకాలు 31.5 శాతం పెరిగాయి. కన్‌స్ట్రక్షన్ పరికరాల విభాగం 34.3 శాతం వృద్ధిని సాధించింది. నికర లాభం గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో రూ.31.29 కోట్లుండగా అది 77.56 కోట్లకు పెరిగింది. నికర లాభ మార్జిన్లు 3.14 శాతం నుంచి దాదాపు రెట్టింపు అయి 6.4 శాతానికి చేరాయి. 2017 మార్చి నాటికి పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఇపిఎస్ 147 శాతం మేర వృద్ధి చెంది 6.46 శాతం నుంచి 15.98 శాతానికి పెరిగింది. దీంతో ఇపిఎస్ స్ట్రెంత్ 89గా ఉంది. 2016 డిసెంబరులో 49 మంది సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ షేరును కొనుగోలు చేయగా 2017 డిసెంబరు నాటికి ఇది 105కు చేరుకుంది. ప్రస్తుతం ఎఫ్ఐఐలకు 15.3 శాతం వాటా ఉంది. మ్యూచువల్ ఫండ్ సంస్థల వాటా 1.27 శాతం నుంచి 5.49 శాతానికి పెరిగింది. మొత్తం 21.09 శాతం వాటా సంస్థాగత ఇన్వెస్టర్ల వద్దనే ఉంది.

టి బ్రహ్మచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్,
హైదరాబాద్ చాప్టర్, tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.



జ్యోతిషుడి బ్లాక్ మెయిలింగ్!

» అచ్చెన్నను బెదిరించి దొరికిపోయిన కాళిదాసు



శ్రీకాకుళం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మంత్రినే చంపేస్తామని బెదిరించి భారీగా డబ్బు గుంజాలని ఓ జ్యోతిష్యుడు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. మంత్రి కె అచ్చెన్నాయుడుకు బెదిరింపు కాల్స్ కేసును సిక్కోలు పోలీసులు ఛేదించారు. ఊహించని విధంగా ప్రముఖ జ్యోతిష్యుడు కాళిదాసు శర్మ, అతని అనుచరుణ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఎస్పీ త్రివిక్రమవర్మ వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో జ్యోతిష్యుడిగా పేరుగాంచిన మురపాక కాళిదాసు శర్మ(44) ప్రముఖులకు గ్రహాలు అనుకూలంగా లేవంటూ శాంతిహోమాలు, ప్రత్యేక పూజలు జరిపించాలని చెప్పి భారీగా డబ్బు గుంజేవాడు. ఒడిసాలోని రాయఘడలో నివాసముంటున్న జోస్యుల శంకరరావుతో కలిసి ఉత్తరాంధ్రలో ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని వారిలో ప్రాణభీతికి సంబంధించిన అనుమానాలు లేవనెత్తి భారీగా డబ్బులు గుంజేందుకు పన్నాగం పన్నారు. అందులో భాగంగా అచ్చెన్నను సైతం బెదిరించారు. రాయఘడలో ఓ సెల్ దుకాణంలో గిరిజనుడి పేరిట సిమ్ కొనుగోలు చేసి, అదే నంబర్‌తో టెక్కలిలోని మంత్రి అనుచరుడికి ఫోన్ చేసి తాము నక్సలైట్లమని, అచ్చెన్నను చంపేస్తామని హెచ్చరించారు. ప్రాణహాని నిజమేనని భావించేలా చేసేందుకు అచ్చెన్న పయనించే మార్గానికి సమీపంలో ట్రాఫిక్ సిబ్బంది ఏర్పాటు చేసిన టైర్లలో అమర్చాడు. అయితే రంగంలోకి దిగిన పోలీసులు తనిఖీలు ముమ్మరంచేసి జిలెటిన్ స్టిక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాయఘడ నుంచి వచ్చిన ఫోన్ ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేయడంతో శంకర్రావు పోలీసులకు పట్టుబడ్డారు. ఇదిలా ఉండగా గతేడాది నవంబరు 11న పార్వతీపురంలో కాళిదాసుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీసౌభాగ్య విద్యేశ్వరి పంచాయతన యాగంలో మంత్రి అచ్చెన్నాయుడు సతీ సమేతంగా పాల్గొన్నారు కూడా.

వైఎస్‌కు రెట్టింపు
అభివృద్ధి చేస్తా: జగన్

రామచంద్రాపురం, జనవరి 14: ప్రజలు సీఎంగా తనకు అవకాశమిస్తే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కంటే రాష్ట్రాన్ని రెండింతలు అభివృద్ధి చేస్తానని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఆదివారం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం నడవలూరు నుంచి రావిళ్లవారిపల్లె వరకు ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని నవరత్నాల కార్యక్రమాన్ని తీసుకొస్తున్నామన్నారు. తాను అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛను 60 ఏళ్ల నుంచే ఇస్తానన్నారు. ప్రతి పేదవాడికీ 3 సెంట్ల స్థలంతోపాటు, ఇళ్లు నిర్మించి ఇస్తానన్నారు. రేషన్‌షాపులో రూ.150కే సరుకులు ఇస్తానన్నారు. నెన్నూరు, నడవలూరులో వైఎస్ విగ్రహాలను ఆవిష్కరించారు. రావిళ్లవారిపల్లె పొలాల్లో రాత్రి బస చేశారు. రావిళ్లవారిపల్లె గ్రామ యువకులు జగన్ నడిచి వెళ్ళడంతో వీధి అపవిత్రమైందంటూ నీటితో శుద్ధి చేశారు. గ్రామంలో బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేయడానికి వచ్చిన వైసీపీ నాయకులను టీడీపీ మద్దతుదారులు అడ్డుకుని వెనక్కు పంపేశారు.

» గాలిపటాలు ఆశల పల్లకీలు : వెంకయ్యనాయుడు



నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో కుటుంబ సభ్యులతో కలిసి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భోగి మంటలు వేశారు. అక్షర విద్యాలయంలో సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపా వెంకట్, మనుమళ్లు, మనుమరాళ్లతో కలిసి ఉత్సాహంగా గాలి పటాలను ఎగురవేశారు. పూర్వీకులు మన పండుగలను ప్రకృతిని అనుసరించి ఏర్పాటు చేశారని, భారతీయ జీవన విధానం ప్రకృతిలో మమేకమై ఉంటుందని వెంకయ్య అన్నారు. గాలిపటాలు ఉన్నతమైన ఆశలకు, ఆశయాలకు.. భవిష్యత్తుకు ప్రతిబింబాలని వివరించారు.

- వెంకటాచలం

శ్రీవారి ఆలయం ముందు
భోగి మంటలు



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ముందు ఆదివారం వేకువజామున భోగి మంటలు వేశారు. ఎప్పటిలా ముఖ ద్వారం ముందు అటవీశాఖ సిబ్బంది ఎండు కలపను ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా ఆలయం నుంచి దివిటీలతో భోగి మంటను వెలిగించారు.

- తిరుమల

కత్తి కట్టిన కోడి!

» గోదావరి, కృష్ణాలో జోరుగా పందేలు

» పలు చోట్ల ప్రజాప్రతినిధులే ప్రారంభకులు

» తొలి రోజే చేతులు మారిన రూ.50 కోట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



పందెం కోడి గెలిచింది. న్యాయస్థానాల ఆదేశాలు.. పోలీసుల హెచ్చరికలను బేఖాతర్ చేస్తూ కత్తులు కట్టిన కోళ్లు బరిలోకి దూకి రంకెలు వేశాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ఉభయగోదావరి జిల్లాల్లోనే సుమారు రూ.45 కోట్ల విలువైన పందేలు సాగాయి. ఉభయ గోదావరులను తలదన్నేలా కృష్ణా జిల్లాలోనూ వందలాది బరుల్లో వేల సంఖ్యలో పందేలు సాగాయి. ఆడమగ..చిన్నపెద్ద..అన్న తేడా లేకుండా కోడి పందేలను చూసేందుకు ఎగబడ్డారు.

పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జోరుగా కోడి పందేలు నడిచాయి. వెంప గ్రామం మినహా మిగతా అన్ని చోట్లా కోడి పందేల శిబిరాలు జనంతో కిటకిటలాడాయి. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కోడి పందేలు చూసేందుకు తరలివచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గం గుండుగొలనులో స్థానిక ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, కొయ్యలగూడెంలో ఎమ్మెల్యే ముడియం శ్రీనివాస్, ద్వారకాతిరుమలలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పందేలను ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం, భీమవరం, ఉండి, పోలవరం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, కొవ్వూరు, ఏలూరు, దెందులూరు, తణుకు నియోజకవర్గాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. ఒక్కో కోడి పందేనికి రూ.10 నుంచి 15 లక్షల మేర చేతులు మారాయి. ఆదివారం పశ్చిమ గోదావరిలో జరిగిన పందేల్లో సుమారు రూ.25 కోట్లు వరకు చేతులు మారినట్లు సమాచారం.

భీమవరం మండలం వెంప, శ్రీరాంపురం గ్రామాల్లో కోడిపందేలను పోలీసులు అడ్డుకున్నారు. అయితే నిర్వాహకులు కాశీరాజు.. అన్ని చోట్ల పందేలు జరుగుతుంటే వెంప, శ్రీరాంపురంలో అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కామవరపుకోటలో ఆదివారం మధ్యాహ్నం వరకు బరులను స్థానిక అధికారులు ధ్వంసం చేస్తూనే ఉన్నారు. అయితే కొద్దిసేపటికే పందెంరాయుళ్లు తిరిగి బరులను సిద్ధం చేసి పందేలకు దిగారు. తూర్పుగోదావరి జిల్లాలో ప్రధాన రహదారుల చెంతనే తిరునాళ్లను తలపించే రీతిలో పందేలు సాగాయి. తొలిరోజు జిల్లాలో రూ.20కోట్లపైనే చేతులు మారాయి. కోనసీమలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని మురమళ్ల వద్ద మినీస్టేడియంలో పందేలను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) ప్రారంభించారు. ఒక్క మురమళ్లలోనే తొలిరోజు పందేల్లో రూ.10కోట్ల మేర చేతులు మారినట్టు సమాచారం. ఇక్కడ సువిశాల ప్రాంగణంలో 7 నుంచి 8వేల మంది ప్రేక్షకులు తిలకించే రీతిలో ఏర్పాట్లు చేశారు. స్టేడియం లోపల, బయట ఆరు ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు విజువల్స్‌ను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి ప్రేక్షకులకు ప్రదర్శించారు. కృష్ణా జిల్లాలోనూ పందేలను నిర్వహించారు. ప్రజాప్రతినిధులే దగ్గరుండి బరులు ఏర్పాటు చేయించి పందేలు ప్రారంభించారు. కాగా, పలు చోట్ల కోడి పందేల బరుల వద్ద పొట్టేళ్ల పందేలూ నిర్వహించారు.



తాడిపత్రిలో లక్ష గెలుచుకున్న పంది!

తాడిపత్రి, జనవరి 14 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రిలో పందుల పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పోటీలను తిలకించారు. పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీప మైదానంలో జరిగిన ఈ పోటీలకు పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్దఎత్తున హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో పందులను తీసుకుని యజమానులు హాజరయ్యారు. మొదటి కేటగిరీలో జరిగిన ఫైనల్ పోటీల్లో కళ్యాణదుర్గం, పెద్దపప్పూరు మండలాలకు చెందిన పందులు పోటీపడగా, పెద్దపప్పూరు పంది విజేతగా నిలిచి రూ. లక్ష కైవసం చేసుకుంది. రెండో కేటగిరీలో కర్నూలుపై అదే జిల్లా కొలిమిగుండ్లకు చెందిన పంది గెలుపొంది రూ.50 వేలు కైవసం చేసుకుంది. మొత్తం 8 పందులు విజయం సాధించగా, వాటి యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు.

కార్యకర్తలకు 'కరుణ' దర్శనం

» పార్టీ శ్రేణుల్లో ఉప్పొంగిన ఉత్సాహం

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో మంచంపట్టిన డీఎంకే అధినేత ఎం.కరుణానిధి ఎట్టకేలకు 11 నెలల తరువాత కార్యకర్తలను నేరుగా కలుసుకున్నారు. స్థానిక గోపాలపురంలోని తన ఇంటి నుంచి బయటకు వచ్చిన కరుణ.. కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఆశీస్సులందజేశారు. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని కరుణానిధి, పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో కార్యకర్తలను కలుసుకుని కొత్త పది రూపాయల నోటును కానుకగా ఇవ్వడం ఆనవాయితీ. అయితే 2016 డిసెంబర్‌లో తీవ్ర అస్వస్థతకు గురై ఆళ్వార్‌పేటలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందారు. అప్పటి నుంచి గోపాలపురంలోని తన ఇంటికే పరిమితమయ్యారు. శ్వాసకోస సమస్యతో ఆయన గొంతు వద్ద ట్రక్యోస్టమీ పరికరం అమర్చటంతో ప్రస్తుతం ఆయన మాట్లాడలేని స్థితిలో ఉన్నారు.

సీఎం హోదాలో హెరిటేజ్‌లోకి చంద్రబాబు

» కుటుంబసమేతంగా శ్రీవారి దర్శనం

» నారావారిపల్లెలో భోగి వేడుకలు

తిరుపతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కాశిపెంట్లలోని హెరిటేజ్ పరిశ్రమలోకి సీఎం హోదాలో చంద్రబాబు మొట్ట మొదటిసారిగా అడుగుపెట్టారు. ఎనర్జీ కన్జర్వేటరీ అవార్డుల ఫంక్షన్‌లో పాల్గొన్నారు. డెయిరీ అభివృద్ధికి కృషి చేసిన తన భార్య, హెరిటేజ్ వైస్ చైర్మన్ భువనేశ్వరిని, సహకరించిన కార్మికులకు అభినందనలు తెలిపారు. సంక్రాంతికి సొంతూరికి వచ్చిన చంద్రబాబు... భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌తో కలిసి ఆదివారం హెరిటేజ్‌కి వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కుటుంబ పోషణకు రాజకీయాల మీద ఆధారపడకూడదనే ఉద్దేశంతో హెరిటేజ్ డెయిరీ ప్రారంభించామన్నారు. 25 ఏళ్ల హెరిటేజ్ ప్రస్థానంలో ఒకే ఒక్కసారి చిత్తూరులో చిల్లింగ్ సెంటర్ ప్రారంభోత్సవ సభలో పాల్గొన్నానని తెలిపారు. సీఎం హోదాలో కాశిపెంట్ల హెరిటేజ్ డెయిరీలోకి తొలిసారిగా అడుగు పెట్టానని అన్నారు. కాగా, ఏపీని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, నదుల అనుసంధానం తప్పకుండా పూర్తిచేస్తామన్నారు. యువతకు ఉపాధి, ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించి రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతానన్నారు.అలాగే చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలోని చంద్రబాబు స్వగృహం వద్ద ఆదివారం తెల్లవారుజామున భోగిమంట వేశారు. ఇంటి ఆవరణలో సాయంత్రం గంగిరెద్దులతో నృత్య ప్రదర్శన నిర్వహించారు.



తిరుపతిలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న చంద్రబాబు కుటుంబం


నాగరాజు ఔషధ
ప్రయోగంతో మరణించలేదు

» కేసు పరిశోధన నిలిపివేస్తున్నాం: కరీంనగర్ సీపీ

కరీంనగర్ క్రైం, జనవరి 14: జమ్మికుంట మండలం నాగంపేటకు చెందిన నాగరాజు ఔషధ ప్రయోగంతో మృతి చెందలేదని కరీంనగర్ పోలీసు కమిషనర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఎఫ్ఎస్ఎల్, కాకతీయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ల నివేదికల్లో కూడా ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో నాగరాజు కేసును నిలిపివేస్తున్నామన్నారు. గత ఏడాది జూన్ 2న నాగరాజు మృతిచెందగా, తన తండ్రి ఔషధ ప్రయోగంతోనే మరణించాడని అదే నెల 16న జమ్మికుంట పోలీసులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో జూన్ 19న తహసీల్దార్ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లతో శవపరీక్ష చేయించామని సీపీ పేర్కొన్నారు. అనంతరం మృతదేహం నుంచి సేకరించిన శరీరభాగాలను ఇస్టోపాథలాజీ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామన్నారు. ఈ నివేదిక ప్రకారం.. పరీక్షల నిమిత్తం పంపిన అవయవాల్లో ఎలాంటి విషపూరిత పదార్థాలు కనిపించలేదని నిర్ధారించారన్నారు. రెండు నివేదికలను ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ ప్రొఫెసర్ల బృందం విశ్లేషించగా.. నాగరాజు మరణానికి ఔషధ పరీక్షలకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టమైందన్నారు. అలాగే డ్రగ్స్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు, లోటస్ ల్యాబ్ పత్రాలు, ఆడియో, వీడియో సీడీలను న్యాయ సలహాదారుడి పర్యవేక్షణలో సునిశితంగా పరిశీలించిన తర్వాత నాగరాజు మృతికి ఔషధ ప్రయోగంతో సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. అందుకే తదుపరి పరిశోధనను నిలిపివేయాలని నిశ్చయించామని తెలిపారు.

జాబ్ గైడ్

యూనివర్సిటీల్లో.. కొలువుల పండగ



యూనివర్సిటీల్లో అధ్యాపక కొలువుల సందడి నెలకొంది. భారీ స్థాయిలో నియమాకానికి రంగం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని 14 యూనివర్సిటీలు అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ స్థాయుల్లో దాదాపుగా 900కుపైగా టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేశాయి. పోస్టులను బట్టి రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేదా కేవలం ఇంటర్వ్యూ ఆధారంగా ఈ ఖాళీలను యూనివర్సిటీలు నేరుగా భర్తీ చేయనున్నాయి. ఆయా కొలువుల కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది సువర్ణ అవకాశం. సంబంధిత వివరాలను చూద్దాం..

ప్రస్తుత నోటిఫికేషన్ల ద్వారా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, శ్రీకృష్ణ దేవరాయ, ఆచార్య నాగార్జున, ఆంధ్రా, కృష్ణా, ద్రవిడ, యోగి వేమన, ఆది కవి నన్నయ, రాయలసీమ, జేఎన్‌టీయూ అనంతపురం, జేఎన్‌టీయూ కాకినాడ, అంబేద్కర్, విక్రమ సింహపురి యూనివర్సిటీలు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించాయి. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను ఏక కాలంలో భర్తీ చేస్తుండటం విశేషం.

అసిస్టెంట్ ప్రొఫెసర్లే ఎక్కువ

అత్యధికంగా ఆంధ్రా యూనివర్సిటీ వివిధ విభాగాల్లో 300కుపైగా అధ్యాపక పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు అత్యధికంగా ఉన్నాయి. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ 150కుపైగా, జేఎన్‌టీయూ అనంతపురం 120కుపైగా అధ్యాపక ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించాయి. ఇందులో కొన్ని బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా ఉన్నాయి. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పోస్టులకు కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రత్యేక పోర్టల్

అసిస్టెంట్ / అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీల భర్తీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను కూడా రూపొందించారు. దీని ద్వారా అసిస్టెంట్ / అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీ కోసం వివిధ యూనివర్సిటీలు విడుదల చేసిన నోటిఫికేషన్లు, అర్హత, దరఖాస్తు, పరీక్ష విధానం తదితర వివరాలను తెలుసుకోవచ్చు. పోర్టల్ లింక్: http://sche.ap.gov.in/ASSTPROF/Masters/HOME.aspx

వేర్వేరు పద్ధతులు

నియామక విషయానికొస్తే ఒక్కో పోస్టును బట్టి వేర్వేరు విధానాలను అనుసరిస్తున్నారు. వివరాలు..

- అసిస్టెంట్ ప్రొఫెసర్: ఈ విభాగంలోని పోస్టుల భర్తీకి రెండు దశల విధానాన్ని అనుసరిస్తారు. అవి.. రాత పరీక్ష, ఇంటర్వ్యూ.
- రాత పరీక్ష (స్క్రీనింగ్ టెస్ట్): దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. అవి.. పేపర్-1 టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్, పేపర్-2 సబ్జెక్టివ్. ఈ రెండు పేపర్ల నుంచి 300 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 300. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పునకు 1/3 మార్కు కోత విధిస్తారు. రాత పరీక్షను ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే అవకాశం ఉంది.
- పేపర్-1 టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్: బోధన, పరిశోధన పట్ల అభ్యర్థుల అభిరుచి, ఆసక్తిని తెలుసుకునే విధంగా ఈ పేపర్‌లో ప్రశ్నలు ఇస్తారు. ఇది అన్ని విభాగాల వారికి కామన్. ఇందులో 120 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. వీటికి 120 నిమిషాల్లో (రెండు గంటలు) సమాధానాలను గుర్తించాలి. ఈ పేపర్‌లో టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్ (మ్యాథమెటిక్స్‌తో కలిపి), లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ (గవర్నెన్స్, పాలిటీ, అడ్మినిస్ట్రేషన్) వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- పేపర్-2 సబ్జెక్టివ్: ఇందులో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 180 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. వీటికి 180 నిమిషాల్లో (మూడు గంటలు) సమాధానాలను గుర్తించాలి.
- ఇంటర్వ్యూ: రాత పరీక్షలో చూపిన ప్రతిభ చూపిన అభ్యర్థులను యూనివర్సిటీ నిబంధనల మేరకు ఇంటర్వ్యూకు పిలుస్తారు. చివరగా రాత పరీక్ష, ఇంటర్వ్యూలో సాధించిన మెరిట్‌ను పరిగణనలోకి తీసుకొని పోస్టింగ్‌ను ఖరారు చేస్తారు.
- అసోసియేట్ ప్రొఫెసర్: ఈ పోస్టులను కూడా రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేస్తారు. రాత పరీక్ష విషయానికొస్తే.. కేవలం ఒకే సబ్జెక్ట్ పేపర్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రెండు పేపర్ల విధానాన్ని పాటించవచ్చు. ఈ విధానం యూనివర్సిటీని బట్టి వేర్వేరుగా ఉంటుంది.
- ప్రొఫెసర్: ఈ పోస్టులను ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేస్తారు. ఈ పద్ధతిలో ప్రెజెంటేషన్ / సెమినార్ వంటివి కూడా ఉండొచ్చు. ఇందుకు ఒక్కో యూనివర్సిటీ ఒక్కో విధానాన్ని పాటిస్తుంది.

ఆంధ్రా యూనివర్సిటీ

- సబ్జెక్టులు: కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఎకనామిక్స్, పాలిటిక్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 217 (ఫేజ్ 1)
- దరఖాస్తుకు చివరితేది: ఫిబ్రవరి 2, 2018
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 104 (ఫేజ్ 2)
- దరఖాస్తుకు చివరితేది: ఫిబ్రవరి 2, 2018
- పోస్టుల సంఖ్య: 08 (బీసీ)
- అసోసియేట్ ప్రొఫెసర్: 03
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 05
- దరఖాస్తుకు చివరితేది: జనవరి 31, 2018.
- ప్రొఫెసర్ పోస్టులు: 03
- దరఖాస్తుకు చివరితేది: జనవరి 31, 2018.
- అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 16
- దరఖాస్తుకు చివరితేది: ఫిబ్రవరి 2, 2018
- వెబ్‌సైట్: http://andhrauniversity.edu.in/

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

- సబ్జెక్టులు: ఎడ్యుకేషన్, సోషల్ వర్క్, ఉమెన్ స్టడీస్, అప్లయిడ్ మేథమెటిక్స్ తదితరాలు.
- అసోసియేట్ ప్రొఫెసర్: 01
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 11 (ఫేజ్-1)
- ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.
- చివరితేది: జనవరి 20, 2018.
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 05 (ఫేజ్-2)
- చివరితేది: జనవరి 30, 2018.
- వెబ్‌సైట్: www.spmvv.ac.in

శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ

- సబ్జెక్టులు: బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, ఫిజిక్స్, సివిల్ ఇంజనీరింగ్ తదితరాలు.
- అసోసియేట్ ప్రొఫెసర్: 06
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 22, 2018.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 125 (ఫేజ్-1)
- దరఖాస్తుకు చివరి తేది: ఫిబ్రవరి 2, 2018
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 48 (ఫేజ్-2)
- దరఖాస్తుకు చివరి తేది: ఫిబ్రవరి 5, 2018
- ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 02
- దరఖాస్తుకు చివరి తేది: ఫిబ్రవరి 5, 2018
- వెబ్‌సైట్: www.svuniversity.edu.in

రాయలసీమ యూనివర్సిటీ

- సబ్జెక్టులు: బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, మేథమెటిక్స్, జువాలజీ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 02 పోస్టులు
- దరఖాస్తుకు చివరితేది: జనవరి 17, 2018.
- వెబ్‌సైట్: http://ruk.ac.in/

విక్రమ సింహపురి యూనివర్సిటీ

- సబ్జెక్టులు: తెలుగు, మేథమెటిక్స్, ఫుడ్ టెక్నాలజీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బోటనీ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 32 పోస్టులు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: జనవరి 27, 2018.
- వెబ్‌సైట్: www.simhapuriuniv.ac.in/

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ

- సబ్జెక్టులు: లా, కామర్స్, ఎడ్యుకేషన్, కంప్యూటర్ సైన్స్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలు: 31
- అసోసియేట్ ప్రొఫెసర్
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: జనవరి 31, 2018
- వెబ్‌సైట్: http://www.brau.edu.in/

ద్రవిడ యూనివర్సిటీ

- సబ్జెక్టులు: ఇంగ్లీష్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 09
- దరఖాస్తుకు చివరి తేది: ఫిబ్రవరి 1, 2018
- అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 04 (బ్యాక్‌లాగ్ 2 , రెగ్యులర్ 2)
- దరఖాస్తుకు చివరి తేది: ఫిబ్రవరి 1, 2018
- వెబ్‌సైట్: http://www.dravidianuniversity.ac.in/

యోగి వేమన విశ్వవిద్యాలయం

- సబ్జెక్టులు: కెమిస్ట్రీ, జువాలజీ, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితరాలు.
- అసోసియేట్ ప్రొఫెసర్ - 25 (ఫేజ్-1)
- అసిస్టెంట్ ప్రొఫెసర్ - 20
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31, 2018
- అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలు-3 (ఫేజ్-2)
- దరఖాసుకు చివరి తేదీ: జనవరి 27, 2018
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29, 2018
- వెబ్‌సైట్: www.yogivemanauniversity.ac.in/

ఆచార్య నాగార్జున వర్సిటీ

- సబ్జెక్టులు: ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, స్టాటిస్టిక్స్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 60 (ఫేజ్-1)
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 25, 2018
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 07 (ఫేజ్-2)
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 28, 2018
- అసోసియేట్ ప్రొఫెసర్: 02 పోస్టులు
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1, 2018
- ప్రొఫెసర్: 04 పోస్టులు
- ప్రిన్సిపల్ / ప్రొఫెసర్: 01 పోస్టు
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1, 2018
- వెబ్‌సైట్: www.nagarjunauniversity.ac.in/

జేఎన్‌టీయూ - అనంతపురం

- సబ్జెక్టులు: సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 89 (ఫేజ్-1)
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 29, 2018
- అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 08
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 29, 2018
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 36 (ఫేజ్-2)
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 30, 2018.
- వెబ్‌సైట్: http://jntua.ac.in/

శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ

- సబ్జెక్టులు: ఎకనామిక్స్, ఇంగ్లీష్ అండ్ కంపేరిటివ్ లిటరేచర్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 26, 2018.
- అసిస్టెంట్ ప్రొఫెసర్
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 27, 2018.
- వెబ్‌సైట్: www.skuniversity.ac.in/

జేఎన్‌టీయూ - కాకినాడ

- సబ్జెక్టులు: ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 15 పోస్టులు (ఫేజ్-2)
- దరఖాస్తుకు చివరి తేది: ఫిబ్రవరి 3, 2018
- అసోసియేట్ ప్రొఫెసర్
- దరఖాస్తుకు చివరి తేది: ఫిబ్రవరి 3, 2018
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య: 10 (ఫేజ్-1)
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 31, 2018
- అసోసియేట్ ప్రొఫెసర్
- దరఖాస్తుకు చివరి తేది: జనవరి 31, 2018
- వెబ్‌సైట్: www.jntuk.edu.in/

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

- సబ్జెక్టులు: ఇంగ్లీష్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 34 పోస్టులు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: జనవరి 30, 2018
- వెబ్‌సైట్: www.nannayauniversity.info/

కృష్ణా యూనివర్సిటీ

- సబ్జెక్టులు: ఇంగ్లీష్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ తదితరాలు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 15 పోస్టులు (ఫేజ్-1)
- దరఖాస్తుకు చివరితేది: జనవరి 30, 2018
- అసోసియేట్ ప్రొఫెసర్: 08 పోస్టులు
- దరఖాస్తుకు చివరితేది: జనవరి 31, 2018.
- బ్యాక్‌లాగ్ / క్యారీ ఫార్వర్డ్ టీచింగ్ పోస్టులు: 11
- అసోసియేట్ ప్రొఫెసర్: 06 అసిస్టెంట్ ప్రొఫెసర్: 05
- దరఖాస్తుకు చివరితేది: జనవరి 31, 2018.
- వెబ్‌సైట్: www.krishnauniversity.ac.in/

అమెరికా తరవాత అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షిస్తున్న దేశం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే). ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రఖ్యాత యూనివర్సిటీలకు నెలవైన యూకేలో ఇంజనీరింగ్, టెక్నాలజీ, మెడికల్ సైన్సెస్ కోర్సులకు డిమాండ్ ఎక్కువ. అమెరికాతో పోలిస్తే స్వల్ప వ్యవధిలోనే మాస్టర్స్ కోర్సును పూర్తి చేసే అవకాశం, తక్కువ ఖర్చు, అత్యున్నత సౌకర్యాలు, ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్స్ వంటివి యూకేను పాపులర్ డెస్టినేషన్‌గా మారుస్తున్నాయి. మరింత మంది అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించే లక్ష్యంతో తాజాగా వీసా నిబంధనలను సరళతరం చేసింది. భారతీయ విద్యార్థులకు కలిసొచ్చే ఈ మార్పులను తెలుసుకుందాం...

స్టడీ అబ్రాడ్

యూకే వీసా... ఉద్యోగానికి ఓకే

విదేశీ విద్య దిశగా చేసే సన్నాహాల్లో కీలకమైంది వీసా. ఏదైనా ఒక దేశంలో చట్టబద్ధంగా అడుగుపెట్టడానికి ఆ దేశ ప్రభుత్వం వీసా రూపంలో అనుమతి ఇస్తుంది. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు అడ్మిషన్ లేదా కన్ఫర్మేషన్ లెటర్ సొంతం చేసుకోవడంతోనే వీసాకు సంబంధించిన వ్యవహారాలను పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అమెరికా మాదిరిగానే యూకేలో కూడా బహుళ వీసా విధానం అమల్లో ఉంది. ఒక్కో టాస్క్‌ను బట్టి ఒక్కో వీసా కేటాయిస్తారు. ఇందుకోసం ఆ దేశం పాయింట్ బేస్డ్ సిస్టమ్ (పీబీఎస్)ను అనుసరిస్తుంది. విద్యార్థులకు టయర్ 4 వీసాను మంజూరు చేస్తారు.



అమల్లోకి వచ్చిన మార్పులు

యునైటెడ్ కింగ్‌డమ్ అక్కడ చదివే అంతర్జాతీయ విద్యార్థులకు వీసా విషయంలో కొన్ని మార్పులు చేసింది. తద్వారా వారికి అక్కడే ఉండి ఉద్యోగ ప్రయత్నాలు చేయడానికి మరింత వెసులుబాటు లభించనుంది. వర్క్ వీసాలకు సంబంధించి సవరించిన కొత్త ఇమ్మిగ్రేషన్ నిబంధనలు జనవరి 11 నుంచి అమల్లోకి వచ్చాయి.

పాత నిబంధన ప్రతికూలం

యూకేలో చదవడానికి వచ్చే అంతర్జాతీయ విద్యార్థులకు సాధారణంగా టయర్ 4 పాయింట్ బేస్డ్ వీసాలు మంజూరు చేస్తారు. కోర్సు వ్యవధితోపాటు మరికొంత కాలంపాటు అక్కడే ఉండటానికి ఈ వీసాల ద్వారా వీలవుతుంది. ఉదాహరణకు లాంగ్ టర్మ్ స్టడీ విషయంలో 12 నెలలపాటు, అదనంగా 4 నెలలపాటు అక్కడే ఉద్యోగ ప్రయత్నాలు చేయడానికి అవకాశం ఉంటుంది. అయితే ఈ 4 నెలల సమయంలోనే వారు ఉద్యోగం సాధించాలి. లేకుంటే స్వదేశానికి తిరిగి రావాల్సి ఉంటుంది. అంతర్జాతీయ విద్యార్థులకు ఈ నిబంధన ప్రతికూలంగా ఉండేది.

డిగ్రీ తరవాతే

గతంలో డిగ్రీ ప్రదానం చేసిన తరవాతే టయర్ 2 వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఉదాహరణకు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సును తీసుకుంటే.. ఆ కోర్సుకు సంబంధించిన థిసిస్ సమర్పించడం, దాని మూల్యాంకనం, ఫలితాల వెల్లడి, డిగ్రీ అందజేయడం వరకు ఎదురు చూడాల్సి వచ్చేది. దాంతో టయర్ 4 వీసాతో కోర్సు ముగిసిన తరవాత అక్కడ ఉండేందుకు లభించే అదనపు సమయం వృథా అయ్యేది. ఫలితంగా ఉద్యోగ ప్రయత్నాలకు సరిపడ సమయం చిక్కేది కాదు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులు స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వచ్చేది.

భిన్నాభిప్రాయాలు

అంతర్జాతీయ విద్యార్థులను ప్రభావితం చేస్తున్న ఈ నిబంధనపై యూకేలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నిబంధనను సరళతరం చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఈ క్రమంలోనే యూకే యూనివర్సిటీలు, ఆ దేశ ప్రభుత్వం మధ్య జరిగిన సుదీర్ఘ చర్చలు జరిగాయి. వాటి ఫలితంగానే ఈ కొత్త నిబంధన కార్యరూపం దాల్చింది. ఈ నిబంధనను లండన్ మేయర్ సాదిక్ ఖాన్ సమర్థించారు. టయర్ 2 వీసా స్వరూపాన్ని మార్చి విదేశీ విద్యార్థులకు 12-24 నెలలపాటు ఉద్యోగం చేసే అవకాశం కల్పించాలని ఖాన్ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు.

పాయింట్ బేస్డ్ సిస్టమ్ ఇలా...

- లైసెన్స్‌డ్ స్పాన్సర్ జారీ చేసే లెటర్, కోర్సు ఫీజు, అక్కడ నివసించేందుకు అవసరమయ్యే సౌకర్యాలు, తదితరాల ఆధారంగా ఈ పాయింట్లను కేటాయిస్తారు. వీటిని పరిగణనలోకి తీసుకుని వీసా మంజూరు చేస్తారు.
- ఐదు కేటగిరీలుగా వీసాలను విభజించారు. అవి.. టయర్-1, టయర్-2, టయర్-3, టయర్ -4, టయర్-5.
- టయర్-1 పోస్ట్ స్టడీ వర్క్ వీసా. టయర్ - 2 స్పాన్సర్డ్ ఎంప్లాయీస్‌కు ఉద్దేశించింది (వర్క్ పర్మిట్). టయర్ - 3 తాత్కాలిక వీసా (లో స్కిల్డ్ వర్కర్స్ కోసం కేటాయించేది). టయర్-4 స్టూడెంట్ వీసా. టయర్-5 యూత్ మొబిలిటీ స్కీమ్స్ / తాత్కాలిక వర్కర్స్ కోసం ఉద్దేశించింది.
- యూకేలో చదువుకు వచ్చే విదేశీ విద్యార్థులు టయర్ - 4 (జనరల్) వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి.

వెసులుబాటు

కొత్త నిబంధనల ప్రకారం కోర్సు పూర్తయిన వెంటనే టయర్ 2 వీసా (స్కిల్డ్ వర్కర్ వీసా)కు సులభంగా మారొచ్చు. నాన్ యూరోపియన్ ఎకనమిక్ ఏరియా దేశాలకు చెందిన వారు యూకే పౌరులు స్పాన్సర్ చేసే కంపెనీల్లో నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలు చేయడానికి జనరల్ టయర్ 2 వీసా అవకాశం కల్పిస్తుంది. కోర్సు పూర్తయిన వెంటనే టయర్ 2 వీసా కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లభిస్తుంది. తాజా నిబంధనలు..

- కోర్సు ఫలితాలతో నిమిత్తం లేకుండా, పూర్తయిన వెంటనే టయర్ 4 నుంచి టయర్ 2 వీసా స్వాపింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- డాక్టోరల్ విద్యార్థులకు మాత్రం ఫలితాలు వచ్చిన తరవాత మాత్రమే టయర్ 2 వీసా స్వాపింగ్‌కు అర్హత లభిస్తుంది.
- టయర్ వీసా 2 మంజూరుకు పట్టే సమయాన్ని కూడా తగ్గిస్తారు.
- జనరల్ టయర్ 2 వీసా ఇమ్మిగ్రేషన్ నిబంధనలను అప్‌డేట్ చేస్తారు.

జాబ్ కార్నర్

ఎస్‌బిఐలో మేనేజర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి మరో భారీ నోటిఫికేషన్ విడుదలైంది. స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్ హోదాలో మేనేజర్, చీఫ్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కేవలం ఒక ఇంటర్వ్యూతో అత్యున్నత స్థాయి బ్యాంక్ ఉద్యోగాన్ని సొంతం చేసుకొనే ఈ సువర్ణావకాశానికి సంబంధించిన వివరాలను చూద్దాం......

మొత్తం ఖాళీలు 121

విభాగాలవారీ ఖాళీలు

మేనేజర్ (MMGS III): అన్ని డిపార్టుమెంట్లలో కలిపి క్రెడిట్ అనలిస్ట్ 35, అసెట్ మేనేజ్‌మెంట్ 2, బిజినెస్ డెవలప్‌మెంట్ & మార్కెటింగ్ 20, హై వేల్యూ అగ్రి బిజినెస్ డెవలప్‌మెంట్ 4, మర్చంట్ అక్వైరింగ్ బిజినెస్ 2, హెచ్‌ఎన్‌ఐ మార్కెటింగ్ అండ్ పబ్లిసిటీ 1, హెచ్‌ఎన్‌ఐ బ్యాంకింగ్ & రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ 8, డిజిటల్ మార్కెటింగ్ 2, మార్కెటింగ్ 1, వెల్త్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్, మేనేజర్ టెక్నాలజీ 1 ఖాళీలు ఉన్నాయి.

చీఫ్ మేనేజర్ (SMGS IV): డిపార్టుమెంట్లన్నిటిలో కలిపి క్రెడిట్ అనలిస్ట్ 30, అసెట్ మేనేజ్‌మెంట్ 1, బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ & ఎంఐఎస్ రిపోర్టింగ్ 5, రిలేషన్‌షిప్ & సిండికేషన్స్ మేనేజ్‌మెంట్ 1, హై వేల్యూ అగ్రి బిజినెస్ డెవలప్‌మెంట్ 1, డెబిట్ కార్డ్ బిజినెస్ 1, డిజిటల్ బ్యాంకింగ్ 1, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ & మేనేజ్‌మెంట్ 3, ప్రొడక్ట్ ఇన్నోవేషన్ & మార్కెటింగ్ రీసెర్చ్ 1, డేటా ఇంటర్ప్రిటేషన్ /మేనేజ్‌మెంట్ 1 ఖాళీలు ఉన్నాయి.

అర్హత

విభాగం, సంబంధిత డిపార్టుమెంట్‌ను అనుసరించి సీఏ/ ఎంబీఏ/ పీజీడీఎం/ఐసిడబ్ల్యుఏ/ ఎసిఎస్/ బిఇ/ బిటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదు నుంచి ఎనిమిదేళ్ల అనుభవం తప్పనిసరి.

వయసు

పోస్టు నిబంధనల ప్రకారం 25 ఏళ్లకు తగ్గకుండా 38 ఏళ్లకు మించకుండా ఉండాలి. రిజర్వుడు వర్గాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక

బ్యాంకు నిర్ణయం ప్రకారం అభ్యర్థులను వారి దరఖాస్తు ఆధారంగా షార్ట్‌లిస్ట్‌చేసి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ స్కోరు ఆధారంగానే మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇంటర్వ్యూ సంబంధిత కాల్‌లెటర్‌ను అభ్యర్థి ఇమెయిల్‌కు పంపుతారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.600(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు ఇంటిమేషన్ ఛార్జీల కింద రూ.100 చెల్లిస్తే చాలు)
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 4
- వెబ్‌సైట్: www.sbi.co.in/careers

ఎస్‌ఆర్ విద్యార్థుల ఉత్తమ ఆవిష్కరణ

న్యూస్ బాక్స్



వరంగల్ ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన ఆటోమేటెడ్ టాయ్ మేకర్ మిషన్ 'నేషనల్ లెవల్ ప్రాబ్లమ్ సాల్వింగ్ కాంపిటీషన్'లో ఉత్తమ ఆవిష్కరణగా నిలిచింది. ఈ పోటీలను జనవరి 5 నుంచి 7 వరకు తమిళనాడు మదురైలోని త్యాగరాజ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో నిర్వహించారు. ఇందులో 30 కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు కాలేజ్ చుట్టుపక్కల గ్రామాలను సందర్శించి అక్కడి బొమ్మల తయారీదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కార మార్గాలను చూపించాలి. ఈ క్రమంలో ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు వినీత్ రెడ్డి, ఇనోష్, శ్రీహర్ష, ఇమ్రాన్, శ్రీచరణ్, వినయ్ తక్కువ ఖర్చుతో కూడిన ఒక ఆటోమేటెడ్ టాయ్ మేకర్ మిషన్‌ను ఆవిష్కరించారు. దీని ద్వారా రోజుకు 40 బొమ్మలను ఉత్పత్తి చేయొచ్చు. ఈ ఆటోమేటెడ్ మిషన్‌లో గ్రైండర్, కన్వేయర్ బెల్ట్, రోలర్స్, బ్లాక్ కట్టర్, డై పంచ్, ఫ్యూరెన్స్ (కొలిమి) ఉన్నాయి. ఈ పోటీల్లో సమర్పించిన డిజైన్లలో ఎస్‌ఆర్ విద్యార్థులు ఆవిష్కరణ ఉత్తమమైందిగా ఎంపికైంది. ప్రస్తుతం అక్కడి గ్రామ స్తులు అనుసరిస్తున్న విధానంలో రోజుకు 10 బొమ్మలను మాత్రమే ఉత్పత్తి చేస్తుంది.

క్యూఆర్ కోడెడ్ పుస్తకాలు..

మైక్రోసాఫ్ట్ రూపొందించిన 'క్యూఆర్ కోడెడ్ టెక్స్ట్‌బుక్' అద్భుతమైన ఫలితాలిస్తోంది. మహారాష్ట్రలో 18 లక్షల మంది విద్యార్థులు ఈ టెక్స్ట్ బుక్స్ ఉపయోగిస్తున్నారు. 'మైక్రోసాఫ్ట్ ఇన్నోవేటివ్ ఎడ్యుకేటర్' (ఎంఐఇ) నిపుణుడు రంజిత్‌సింగ్ దిసాలే ఈ క్యూఆర్ కోడెడ్ టెక్స్ట్‌బుక్స్ డిజైన్ చేశారు. టెక్స్ట్ బుక్ మీద క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా.. మైక్రోసాఫ్ట్ ఎడ్యుకేటర్ కమ్యూనిటీలోని కంటెంట్‌ను పొందవచ్చు.





అపవిత్రంగా వెళ్తే.. తేనెటీగల దాడి?

మునుస్వామి గుట్టకు వెళ్లే భక్తుల నమ్మకం

.. నల్లగొండ జిల్లా చందంపేట మండలం దేవరచర్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో.. మునుస్వామి గుట్టపై వెలసిన శివాలయానికి అపవిత్రంగా వెళ్తే అదే జరుగుతుందంటారు స్థానికులు. అక్కడి గుట్టలు, గుహలు, అందమైన జలపాతాల మధ్య.. 13వ శతాబ్దంలో పరమశివుడు వెలిశాడని స్థలపురాణం. కొండల నుంచి జాలువారే నీరు ప్రతి క్షణం శివలింగాన్ని అభిషేకించడం విశేషం.

ని-దర్శనం

Nidarshanam

ఎలా వెళ్లాలి?

నల్లగొండ జిల్లా దేవరకొండకు 35 కిలోమీటర్ల దూరంలో దేవరచర్ల ఉంది. దేవరచర్ల తండా నుంచి శివాలయానికి చేరుకోవాలంటే మూడు కిలోమీటర్లు వెళ్లవలసి ఉంటుంది. గతంలో కాలినడకన వెళ్లే విధంగా దారి ఉండేది. ఇప్పుడు స్థానికులు విరాళాల రూపంలో సేకరించిన నిధులతో దారి ఏర్పాటు చేశారు. రెండు కిలోమీటర్ల వరకు ఈ డొంకదారి ఉంది. అక్కడి నుంచి శివాలయానికి చేరుకోవాలంటే కొండలు, గుట్టలు, బండరాళ్లు, దట్టమైన చెట్ల పొదలు దాటి ఒక కిలోమీటరు నడవాలి. దేవరకొండను పరిపాలించిన రేచర్ల పద్మ నాయక వెలమ వంశస్థులే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పురావస్తుశాఖ గుర్తించింది.

గిరిజనులే పూజారులు..

దేవరచర్ల గ్రామానికి చెందిన కేతావత్ గోపా..70 ఏళ్ల క్రితం పశువులను మేపుతున్న క్రమంలో ఈ శివలింగాన్ని చూశారు. నాటి నుంచి ఆ ప్రాంత గిరిజనులే ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పూజారులు.. కేతావత్ లక్ష్మణ్, గోపాల్. దేవరకొండ, నల్లగొండ, మహబూబ్‌నగర్, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు దేవరచర్ల శివుడిని దర్శించుకునేందుకు పండుగ రోజుల్లో పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు అంటున్నారు.

–దేవరకొండ/చందంపేట



క్లాసు రూములో తపస్సు చేయుట వేస్టురా గురూ!

నవతరానికి కొత్త బోధనా పద్ధతులు

పెరుగుతున్న క్లౌడ్ బేస్డ్ అప్లికేషన్లు.. సంచలనం సృష్టిస్తున్న 'మైక్రోసాఫ్ట్ ఆఫీస్ 365'

సత్ఫలితాలనిస్తున్న 'ఒన్ నోట్', ఎంఐఇ విధానాలు

కాలం మారుతోంది. తరం మారుతోంది. టెక్నాలజీ పరుగులు తీస్తోంది. మనుషులు చేసే చాలా పనులు భవిష్యత్తులో రోబోల చేతుల్లోకి వెళ్లిపోతాయన్న ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇప్పటికే మన జీవితాల్లో టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తోంది. మరి రానున్న రెండు మూడు దశాబ్దాలలో క్లాస్‌రూమ్‌లు ఎలా ఉండబోతున్నాయి? అంటే.. 'క్లాసు రూములో తపస్సు చేయట వేస్టురా గురూ.. బయట ఉన్నది డిజిటల్ ప్రపంచమన్నది చూడరా గురూ!' అంటున్నారు నిపుణులు! అందుకు తగ్గట్టుగా విద్యాబోధనలో విప్లవాత్మకమైన మార్పులకు స్వాగతం పలకాలని సూచిస్తున్నారు. అవును.. క్లాస్ రూమ్‌లో కంటే వెలుపలే విద్యార్థులు ఎక్కువ సబ్జెక్టులు నేర్చుకునే విధంగా విద్యా బోధన మారుతోంది. కొత్త తరం విద్యార్థుల కోసం ఆధునిక సాఫ్ట్‌వేర్, టూల్స్‌తో టీచర్లు కూడా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వీడియో, వాయిస్, టెక్స్ట్ చాలామంది వాడుతున్నారు. స్కైప్, లైవ్ స్ట్రీమింగ్ కూడా చాలామందికి అందుబాటులో ఉంది. మున్ముందు వర్చువల్ క్లాస్‌రూమ్స్ పెరగనున్నాయి. క్లాసు రూమ్‌లో ధైర్యంగా సందేహం అడగలేని విద్యార్థులకు.. ఈ వర్చువల్ క్లాస్ రూమ్స్ ఉపయోగపడతాయి.

Microsoft Office 365

మైక్రోసాఫ్ట్ 365

'మైక్రోసాఫ్ట్ ఆఫీస్ 365'తో విద్యార్థులు, టీచర్లు కూడా లబ్ధి పొందవచ్చు. క్లౌడ్ టెక్నాలజీ ద్వారా మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎక్సెల్, పవర్ పాయింట్‌తోపాటు.. వన్ నోట్, మైక్రోసాఫ్ట్ టీమ్ యాప్స్‌ను ఉపయోగించవచ్చు. ఈ క్లౌడ్ టెక్నాలజీ టీచర్లు, విద్యార్థులను అనుసంధానం చేస్తుంది. రోజువారీ క్లాస్‌వర్క్‌లో విద్యార్థులు ఓ టీమ్‌గా పనిచేయడానికి క్లౌడ్ తోడ్పడుతుంది. దీనివల్ల పరస్పర సహకారంతో ఓ బృందంగా పనిచేయడం చిన్నతనం నుంచే అలవడుతుంది. భవిష్యత్తులో చిన్న వ్యాపారాలు, స్టార్టప్‌లు మొలకెత్తడానికి అవసరమైన టీమ్ వర్క్‌ను ఈ టూల్స్ ద్వారా చిన్నతనం నుంచే పిల్లలు నేర్చుకోగలుగుతారు. అలాగే.. 'వన్ నోట్ క్లాస్‌నోట్ బుక్స్' వంటి టూల్స్ విద్యాబోధనలో మరిన్ని మార్పులకు నాంది పలుకుతున్నాయి. క్లాస్ నోట్‌బుక్‌తో టీచర్లకు మరింత ఉపయోగం! దీని వల్ల సమయం ఆదా అవుతుంది. వేగంగా విద్యార్థుల హోంవర్క్, క్లాస్‌వర్క్ చెక్ చేయడం.. పుస్తకాలు, అసైన్‌మెంట్ల పరిశీలన, గ్రేడింగ్ ఇవ్వడం తదితర అవసరాలకు అనుగుణంగా వన్ నోట్ క్లాస్ నోట్‌బుక్‌ను డిజైన్ చేశారు. దివ్యాంగులు కూడా ఆత్మవిశ్వాసంతో విద్య నేర్చుకునేవిధంగా దీనిలో 'ఇమ్మెర్స్ రీడర్' అనే ఫీచర్ ఉంది. దివ్యాంగుల్లో సైతం వ్యక్తీకరణ సామర్థ్యాలు, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇది తోడ్పడుతుంది. అలాగే.. ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌లో పాఠాలు బోధించడానికి 'మైక్రోసాఫ్ట్ ఇమాజిన్ అకాడమీ' ఉపయోగపడుతోంది. టెక్నాలజీ నేపథ్యం లేని టీచర్లు కూడా విద్యార్థులకు కోడింగ్ పాఠాలు సులభంగా బోధించడానికి ఈ టూల్స్ ఉపయోగపడతాయి. వీటన్నింటి ద్వారా.. విద్యార్థులు కాలేజీలో అడుగుపెట్టడానికి ముందే కంప్యూటర్ సైన్స్, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సైన్స్‌లో నైపుణ్యం సంపాదించగలుగుతారు. తమ ముందు తరాలవారు చేసినట్టే తమ ఐడియాలను పెన్నుతో పేపర్ మీద పెడతారు. కాకపోతే అవి.. డిజిటల్ పెన్నులు, డిజిటల్ పేపర్లు.. అంతే!!

ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీతో మాట్లాడుతున్న కేపీసీసీ అధ్యక్షుడు పరమేశ్వర్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ వేణుగోపాల్ (ఫైల్ ఫొటో)



స్వామీజీ.. నేతాజీ!

ఆసక్తికరంగా కన్నడ రాజకీయం

మఠాల నుంచి ఎన్నికల బరిలోకి..

బీజేపీ పరిశీలనలో 10మంది పేర్లు

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభావం కర్ణాటకలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆయన పాలనా విధానాల ముచ్చట కాదిది! యోగిగా మొదలై, ఆశ్రమవాసిగా పార్లమెంటులో అడుగుపెట్టిన ఆదిత్యనాథ్ ప్రస్థానం ఇప్పుడు కన్నడ ఎన్నికల బరిని విశేషంగా ఆకర్షిస్తోంది. కర్ణాటకలో దశాబ్దాలుగా ఆశ్రమాలు, పీఠాలకు పరిమితమైన అనేకమంది స్వాములు.. యోగి బాటను అనుసరిస్తూ ప్రజాజీవితంలోకి రావాలని ఉత్సాహపడుతుండటం ఆసక్తి రేపుతోంది. యోగి ఆదిత్యనాథ్ యూపీలోని ఓ గుళ్లో పూజారి. సొంత ఆశ్రమం నిర్వహించేవారు. అక్కడినుంచే నేరుగా చట్టసభలకు ఆయన ఎన్నికయ్యారు. అనూహ్యంగా ముఖ్యమంత్రి పదవినీ చేపట్టారు. యోగి ప్రేరణతో కర్ణాటకలో అనేకమంది స్వాములు రాజకీయ ప్రవేశానికి సిద్ధమవుతున్నారు. ఈ విషయంలో మంగళూరు గురుపుర వజ్రదేహి మఠాధిపతి రాజశేఖరానంద స్వామీజీ, ధార్వాడ మానగుండ బసవానంద స్వామి, చిత్రదుర్గ శరణ మాదార గురుపీఠాధిపతి మాదార చెన్నయ్య స్వామీజీ ముందు వరుసలో నిలిచారు. 'నాయకులు తమ రాజకీయ కర్తవ్యాలను విస్మరించారు. వాటిని నిర్వర్తించడానికీ, ప్రజాసేవ చేయడానికీ రాజకీయాల్లో ఉండటం అవసరం అని భావిస్తున్నాను' అని బసవానంద స్వామీజీ బహటంగానే ప్రకటించారు.

అభిమానులు, భక్తుల ఒత్తిడితోనే తాను రాజకీయాల్లోకి రావాల్సి వస్తున్నదని రాజశేఖరానంద స్వామీజీ తెలిపారు. ఇలా కారణాలు ఏవైనా తర్వలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి వీరంతా ఉత్సాహం చూపుతున్నారు. నియోజకవర్గాలను ఎంపిక చేసుకొని పని కూడా మొదలుపెట్టేశారు. స్వామీజీలకు సీటు ఇస్తే, కొత్తగా తమకు కలిసొచ్చే ఓట్లను దృష్టిలో ఉంచుకొని.. రాజకీయ పార్టీలు సైతం వీరివైపు మొగ్గుచూపుతున్నాయి. ఈ విషయంలో బీజేపీ ముందుండగా, స్వామీజీలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్, జేడీయూ కూడా ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

మఠాల మద్దతు కోసం..

దేశంలో ఎక్కడా లేనన్ని మఠాలు కర్ణాటకలో ఉన్నాయి. ఎన్నికలొస్తే రాజకీయ నాయకులు ప్రజల దగ్గరకు వెళ్లడానికి ముందుగా స్వామీజీల ఆశీస్సుల కోసం బారులు తీరుతుంటారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి డాక్టర్ నిర్మలానందనాథ స్వామీజీ మద్దతు కోసం రాజకీయ పార్టీలు పోటీలు పడుతున్నాయి. వక్కలిగ సామాజిక వర్గానికి ఈయనే పెద్దదిక్కు. ఆ వర్గం ఓట్లపై కన్నేసిన నాయకులు స్వామీజీని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఇప్పటికే ఈ మఠాన్ని సందర్శించారు. కాంగ్రెస్, జేడీయూ నేతలు కూడా అదే బాట పట్టారు. మరోవైపు, రానున్న శాసనసభ ఎన్నికల్లో కనీసం 10మంది స్వామీజీలకు బీజేపీ టికెట్లు కేటాయించే సూచనలు కనిపిస్తున్నాయి. అవకాశం లభిస్తే బీజేపీ తరపున బరిలోకి దిగేందుకు తాను సిద్ధమేనని రాజశేఖరానంద స్వామీజీ ప్రకటించారు.

– బెంగళూరు, ఆంధ్రజ్యోతి

మగాళ్లకు ఆ స్వేచ్ఛ ఉంది!

- సంచలనం సృష్టిస్తున్న ఫ్రెంచ్ మహిళల వ్యాఖ్యలు
- 'మీ టూ' ఉద్యమానికి వ్యతిరేకంగా బహిరంగ లేఖ

లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా 'మీ టూ' ఉద్యమం ఉధృతమవుతోంది. అమెరికాలో హాలీవుడ్ నటీమణులు మొదలుపెట్టిన ఈ ఆందోళన.. లక్షలాది మహిళల్లో స్థైర్యం నింపింది. తాము కూడా బాధితులమే అంటూ మహిళలు ధైర్యంగా వీధుల్లోకి వస్తున్నారు. ఆన్‌లైన్‌లో తమ బాధలను వెల్లడించడంతోపాటు పురుష దురహంకారాన్ని, వివక్షను ప్రశ్నిస్తున్నారు.



మరోవైపు ఫ్రాన్స్‌లో మాత్రం 'మీ టూ' ఉద్యమాన్ని నిందిస్తూ వంద మంది మహిళలు ఆందోళన చేపట్టారు. మగాళ్లకు వేధించి, వెంటపడి, హింసించే స్వేచ్ఛ ఉందని సమర్థిస్తూ బహిరంగ లేఖ కూడా రాశారు. ప్రముఖ ఫ్రెంచ్ నటి, మోడల్, ప్రొడ్యూసర్ అయిన కేథరీన్ డెనెవె కూడా ఆ లేఖపై సంతకం చేయడం సంచలనం సృష్టించింది. 'మహిళల మోకాలిని తాకారనీ, ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నించారన్న ఆరోపణలపై చాలామంది పురుషులను పదవుల నుంచి, ఉద్యోగాల నుంచి తొలగించారు. రేప్ చేయడం నేరమే. కానీ ఒకరిని ఆకర్షించడానికి ప్రయత్నించడం.. ఆ క్రమంలో దురుసుగా ప్రవర్తించడం పురుషాహంకారం కాదు' అని లేఖలో పేర్కొన్నారు. అయితే వందమంది మహిళలు రాసిన ఈ బహిరంగ లేఖపై ఫ్రెంచ్ ఫెమినిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హార్వే వీన్‌స్టీన్ లాంటి రేపిస్టులను, మహిళలను లైంగికంగా వేధించే మృగాళ్లను సమర్థించే విధంగా రాతలు రాయవద్దని హితవు పలుకుతున్నారు.

- సెంట్రల్ డెస్క్

మంచు కాదు.. మనసు కరిగించే ఫొటో

ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడిని చూశారా? బుగ్గలు ఎర్రగా మారి.. జుట్టు పూర్తిగా మంచుతో నిండిపోయింది. ఇతని పేరు వాంగ్ ఫ్యుమన్. చైనాలోని యునన్ ప్రావిన్స్‌కు చెందిన వాంగ్.. మైనస్ 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో 4.5 కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాలకు వెళ్తాడు. ఇలా వెళ్లినప్పుడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది. చైనాలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం ఎంత తీవ్రంగా ఉందో ఈ ఫొటోనే తెలియజేస్తుందంటూ ఆ దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ ఫొటో చూసి చలించిపోయిన చాలామంది అక్కడి పాఠశాల విద్యార్థులను ఆదుకునేందుకు ఇప్పటివరకు 2 కోట్ల రూపాయల విరాళాలు అందించారు.





దేశ ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన కేంద్ర మాజీ ఎన్నికల ప్రధాన అధికారి టీఎన్ శేషన్ ప్రస్తుతం వృద్ధాశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. పిల్లలు లేకపోవడంతో తన భార్య జయలక్ష్మితో కలిసి చెన్నైలోని గురుకులం వృద్ధాశ్రమంలో శేషజీవితం గడుపుతున్నారు.

'శేష' జీవితం వృద్ధాశ్రమంలో!

పిల్లలు లేక.. భార్యతో కలిసి చెన్నైలోని ఓ ఆశ్రమంలో మాజీ సీఈసీ.. అక్కడివారికి తన పింఛను డబ్బుల నుంచి సాయం

కేరళ రాష్ట్రం పాలక్కాడు జిల్లా తిరునెల్లై గ్రామానికి చెందిన టీఎన్ శేషన్ (తిరునెల్లై నారాయణ అయ్యర్ శేషన్) (85) కేంద్ర ఎన్నికల సంఘం 10వ ప్రధానాధికారిగా 1990 నుంచి 1996 వరకు పనిచేశారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడబోయిన మహామహులకు తన నిర్ణయాలతో చుక్కలు చూపించారు. ఆయన సంస్కరణలతోనే ఎన్నికల వ్యవస్థలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయన హయాం నుంచే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును కూడా పరిమితం చేశారు. అంతకుముందు ఆయన తమిళనాడులోని కోయంబత్తూరు, దిండిగల్ జిల్లాల సహాయ కలెక్టర్‌గా, మదురై కలెక్టర్‌గా, రవాణాశాఖ డైరెక్టర్‌గా, వ్యవసాయ, కార్మిక శాఖల కార్యదర్శిగా పదవులు చేపట్టారు. 1997 రాష్ట్రపతి ఎన్నికల్లో కేఆర్ నారాయణన్‌పై పోటీ చేశారు. ఈసీగా ఉద్యోగ విరమణ చేసిన తరువాత.. ఆయన గురించి పెద్దగా వార్తలు రావడం లేదు. శేషన్ పుట్టపర్తి సాయిబాబాకు వీరభక్తుడు. సాయిబాబా శివైక్యం పొందినప్పటి నుంచి తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఆయనకు తన స్వగ్రామంలో సొంత ఇల్లు ఉంది. అయితే, తమను సంరక్షించేందుకు పిల్లలు లేకపోవడంతో శేషన్ దంపతులు వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ఆశ్రమంలోని తోటివారి కష్టాలను వింటూ, వారికి చేతనైన సాయం అందిస్తున్నారు. తన సర్వీసు పింఛను డబ్బుల్లో కొంత సామాజిక సేవలకు వెచ్చిస్తున్నారు. ఈ ఆశ్రమంలో తన తోటివారి సమక్షంలో అత్యంత నిరాడంబరంగా గత నెల 15వ తేదీన తన 85వ పుట్టినరోజును శేషన్ జరుపుకొన్నారు.

–చెన్నై, ఆంధ్రజ్యోతి

సంక్రాంతి శుభాకాంక్షలు

నదుల అనుసంధానానికి నో

తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం.. కేంద్రానికి స్పష్టం చేయాలని భావన.. ఈనెల 17న ఢిల్లీలో సమావేశం

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి నుంచి కావేరికి నీటిని తరలించాలన్న కేంద్ర ప్రభుత్వ నదుల అనుసంధాన ప్రతిపాదనను వ్యతిరేకించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేయనుంది. ప్రస్తుతం గోదావరి నదిలో ఉన్న నీరు రాష్ట్ర అవసరాలకే సరిపోతుందని, ఇతర బేసిన్లకు తరలించడానికి అదనపు నీరు లేదని వివరించనుంది. ప్రస్తుతం గోదావరిపై పలు ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని, ఇక్కడి నీటిని ఇతర ప్రాంతానికి తరలిస్తే.. భవిష్యత్తులో తీవ్ర నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే, కేంద్రం తెరపైకి తీసుకు వచ్చిన నదుల అనుసంధాన ప్రతిపాదనను వ్యతిరేకించాలని నిర్ణయించింది. ఇదే విషయాన్ని స్పష్టం చేయడానికి మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఢిల్లీ వెళ్లనున్నారు. గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు; అక్కడి నుంచి పెన్నా బేసిన్ ద్వారా కావేరి బేసిన్‌కు తీసుకెళ్లడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధాన ప్రతిపాదనను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా, ఖమ్మం జిల్లా అనికేపల్లి వద్ద ప్రత్యేక బ్యారేజీని నిర్మించి, ఇక్కడి నుంచి సుమారు 247 టీఎంసీల గోదావరి నీటిని లిఫ్టు చేసి నాగార్జున సాగర్‌లోకి తరలించాలని ప్రతిపాదించింది. ఆ నీటిని పెన్నా ద్వారా కావేరి బేసిన్ వరకు తరలించాలని భావించింది. ఈ ప్రతిపాదనపై చర్చించడానికి ఈనెల 17న ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఆయా రాష్ట్రాలు తమ తమ అభిప్రాయాలను చెప్పాల్సి ఉంది. దీనికి మంత్రి హరీశ్‌రావు, స్పెషల్ సీఎస్ జోషి, ఇతర ఇంజనీర్లు ఢిల్లీకి వెళుతున్నారు. ఈ నేపథ్యంలోనే, నదుల అనుసంధానంపై ఆదివారం మంత్రి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి చర్చించారు. కేంద్రానికి రాష్ట్రం వాదనను వినిపించడానికి వీలుగా ప్రత్యేక నివేదికను రూపొందిస్తున్నారు.



ఒడిసా కూడా వ్యతిరేకమే

నదుల అనుసంధానంలో మొదటి ప్రతిపాదన ప్రకారం మహానది నుంచి నీటిని గోదావరికి తీసుకు రావాల్సి ఉంది. ఇలా మహానది నుంచి తీసుకొచ్చిన నీటిని అనికేపల్లి రిజర్వాయర్లో నిల్వ చేస్తారు. అక్కడి నుంచి సాగర్‌కు, ఆ తర్వాత పెన్నా నుంచి కావేరి బేసిన్‌కు తరలించాలని ప్రతిపాదించారు. అయితే.. మహానది నుంచి నీటి తరలింపును ఒడిసా ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దాంతో ఆ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టింది. దాని స్థానంలో తెలంగాణలో కాళేశ్వరం దిగువన గోదావరి నది నుంచి నీటిని కావేరి బేసిన్‌కు తరలించాలని నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలోని అనికేపల్లిలో సుమారు 300 టీఎంసీలకు పైగా అదనపు నీరు ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చింది. ఇందుకు గత 110 ఏళ్ల నీటి ప్రవాహ లెక్కలను పరిగణనలోకి తీసుకుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ లెక్కలతో ఏకీభవించడం లేదు. నిజానికి, గోదావరిపై కాళేశ్వరం, దేవాదుల వంటి ప్రాజెక్టులు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వాటికి అనుమతులు ఇచ్చే సమయంలో నదిలో 40 ఏళ్లపాటు వచ్చిన వరద ప్రవాహ లెక్కలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పరిగణనలోకి తీసుకుంది. వీటి ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం ఆయా ప్రాజెక్టు నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది. ప్రాజెక్టుల అనుమతికి 40 ఏళ్లను ప్రామాణికంగా తీసుకున్న సీడబ్ల్యూసీ.. ఇప్పుడు నదుల అనుసంధానానికి 110 ఏళ్లను పరిగణించింది. అయితే, 110 ఏళ్లు కాకుండా 40 ఏళ్ల వరదను పరిగణనలోకి తీసుకుంటే.. గోదావరిలో మిగులు జలాలు లేవని తేలింది. పైగా ఈ నదిపై తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టులో భాగంగా సుమారు 180 టీఎంసీలను తరలించాల్సి ఉంది. దిగువన సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు 70 టీఎంసీలను లిఫ్టు చేయాల్సి ఉంది. వీటితోపాటు దేవాదుల మూడో దశను కూడా పూర్తి చేస్తున్నారు. ఇందుకు తుపాకులగూడెం వద్ద ప్రత్యేక బ్యారేజీని చేపట్టారు. దేవాదుల ద్వారా సుమారు 300 రోజులపాటు నీటిని లిఫ్టు చేయాల్సి ఉంది. మరోవైపు, కృష్ణాలో రోజురోజుకు నీటి లభ్యత తగ్గిపోతోంది. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు అమల్లోకి వస్తే.. ఆలమట్టి ద్వారా నీటి వాడకం పెరగడానికి అవకాశం ఉంది. అదే జరిగితే.. దిగువకు నీటి ప్రవాహం రావడం చాలా వరకు తగ్గిపోనుంది. గోదావరిలో 954 టీఎంసీలు; కృష్ణాలో 299 టీఎంసీల నికర జలాలు, మరో 70 టీఎంసీల మిగులు జలాలు వాడుకోవడానికి రాష్ట్రానికి హక్కు ఉంది. రెండు నదుల్లోనూ కలిపి సుమారు 1300-1400 టీఎంసీలు వాడుకోవచ్చు. అయితే.. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మేరకు నీటి లభ్యత ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితిలో గోదావరి నుంచి 247 టీఎంసీలను కావేరి బేసిన్‌కు తరలించడానికి అంగీకరిస్తే..భవిష్యత్తులో రాష్ట్ర నీటి అవసరాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే.. మహానది నుంచి నీటిని గోదావరిలోకి తీసుకు వస్తే.. అప్పుడు నదుల అనుసంధానానికి మొగ్గు చూపాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మహానది నుంచి నీటిని తరలించకుండా గోదావరి నుంచే నీటిని తీసుకెళ్లడాన్ని మాత్రం అంగీకరించకూడదని నిశ్చయించింది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేయనుంది.

సర్పంచ్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి

▸▸ లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన: పొన్నం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

గ్రామాల్లో మళ్లీ పెత్తందారీ వ్యవస్థను తెచ్చేందుకే సీఎం కేసీఆర్ పంచాయతీ రాజ్ కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కరీంనగర్, వరంగల్ రూరల్ జిల్లా భీమదేవరపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికలను ప్రత్యక్షంగా నిర్వహించాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పరోక్ష ఎన్నికలతో సర్పంచ్ పదవిని వేలం పాట ద్వారా కొనుగోలు చేసే ప్రమాదం ఉందన్నారు. పరోక్ష ఎన్నికలతో రౌడీలు, గూండాలు, ధనవంతులే ఎన్నికవుతారని, గ్రామాలకు తీరని నష్టం జరుగుతుందని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ జిల్లా తిప్పర్తిలో అన్నారు. కాగా, విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలను కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆధారాలతో సహా బయటపెట్టడంతో మతిపోయిన మంత్రి కేటీఆర్ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి హైదరాబాద్‌లో అన్నారు.

పరోక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నిక సరికాదు

▸▸ సీఎంకు ఆర్.కృష్ణయ్య లేఖ

రాంనగర్/హైదరాబాద్, జనవరి 14: సర్పంచ్ ఎన్నికలు పరోక్షంగా నిర్వహించాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం లేఖ రాశారు. బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టంలో సవరణలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలన్నారు. పరోక్ష ఎన్నికలతో భూస్వాములు, దొరలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యే ప్రమాదముందన్నారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం: కిషన్‌రెడ్డి

ఆదిభట్ల, జనవరి 14: సర్పంచ్‌లకు పరోక్ష ఎన్నికలు ప్రజాసామ్యానికి ప్రమాదకరమని బీజేపీ శాసనసభా పక్ష నేత జీ కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడ గ్రామంలోని మేనమామల ఇంట్లో కిషన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. కొత్త చట్టంతో.. వార్డు సభ్యుల బెదిరింపులతో సర్పంచ్ పని చేయలేడని, గ్రామాల్లో ఘర్షణలకు దారితీసే ప్రమాదముందన్నారు.

6 రాష్ట్రాలు.. 5 నదులు.. ఒక అనుసంధానం \\ మహా కావేరి!

▸▸ దుమ్ముగూడెం కింద అకినేపల్లిలో బ్యారేజీ

▸▸ రెండో దశలో మహానది నుంచి కావేరికి రూ.45 వేల కోట్ల వ్యయ అంచనా

▸▸ తెలంగాణలో 3 లక్షలు; ఏపీ, తమిళనాడుల్లో నాలుగేసి లక్షల హెక్టార్లకు నీరు

▸▸ కానీ, తెలంగాణలో 30 వేల ఎకరాలు మునక

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆరు రాష్ట్రాల్లో ఐదు నదుల అనుసంధానం! ఇంద్రావతి, మహానది నుంచి కావేరికి నీళ్లు! వయా, తెలంగాణ, ఏపీ! నదుల అనుసంధానం శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదన ఇది. ఈ ప్రాజెక్టుతో తెలంగాణలో 3.10 లక్షల హెక్టార్లు; ఏపీలో 4.04 లక్షల హెక్టార్లు; తమిళనాడులో 4.01 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుబాటులోకి వస్తుందంటున్నారు. ఈ మార్గంలో జల మార్గం కూడా అభివృద్ధి చేస్తామంటున్నారు. ఈ అనుసంధానంతో పంటలు, ఇతర అవకాశాల ద్వారా రూ.13 వేల కోట్ల ఆదాయం వస్తుందని జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) అంచనా వేసింది. ఈ ప్రాజెక్టుకు రూ.45,049 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. అనుసంధానంతో తెలంగాణ, ఏపీ, తమిళనాడుకూ ప్రయోజనం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ తన ప్రతిపాదనల్లో పేర్కొంది. ఈ ప్రాజెక్టుతో మనకు లాభమా నష్టమా!? అనే తర్జనభర్జనల్లో ఏపీ, తెలంగాణ ఉన్నాయి.

నదుల అనుసంధాన ప్రాజెక్టు వ్యయ అంచనాలు

అనుసంధానం	వ్యయం (రూ. కోట్లలో)
గోదావరి-కృష్ణా	16,868
కృష్ణా-పెన్నా	14,822
పెన్నా-కావేరి	13,359
మొత్తం	45,049

ఇంద్రావతి టు నాగార్జున సాగర్

మొదటి దశలో తెలంగాణలోని ఇంద్రావతి మిగులు జలాలను కావేరీ గ్రాండ్ ఆనకట్టకు చేర్చాలనేది ప్రతిపాదన. ప్రాణహిత, ఇంద్రావతి, శబరి ఉపనదులు కలిసిన తర్వాత గోదావరిలో 427 టీఎంసీల నీరు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గోదావరి బేసిన్ నుంచి 247 టీఎంసీలనూ నాగార్జున సాగర్‌లోకి ఎత్తి పోయాలని భావిస్తున్నారు. ఇచ్చంపల్లికి సుమారు 60 కిలోమీటర్ల దిగువన ఖమ్మం జిల్లా వెంకటాపురం మండలం అకినేపల్లి వద్ద బ్యారేజిని నిర్మించనున్నారు. సుమారు 20 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 72.50 మీటర్ల ఎత్తుతో దీనిని నిర్మిస్తారు. దుమ్ముగూడెం- సాగర్ టెయిల్ పాండ్ కాల్వకు కొంత ఎగువ ప్రాంతంలో ప్రత్యేక కాలువను తవ్వనున్నారు. అకినేపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి, సాగర్‌లోకి తరలిస్తారు. సాగర్‌కు చేరిన నీటిని కండలేరు వరద కాలువ ద్వారా తమిళనాడుకు తరలిస్తారు.

మహానది నుంచి శ్రీశైలానికి

రెండో దశలో మహానదికి ఉప నది అయిన మణిభద్ర నుంచి నీటిని పోలవరం తీసుకురావాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. అక్కడి నుంచి పులిచింతలకు, అనంతరం శ్రీశైలానికి తరలిస్తారు. ఆ నీటిని మళ్లీ కండలేరు వరద కాల్వ ద్వారా కావేరీ ఆయకట్టుకు తరలించాలని భావిస్తున్నారు. అయితే, కేంద్రం అంచనా వేసినట్టు మహానదిలో 360 టీఎంసీల మిగులు నీరు లేదని ఒడిసా ప్రభుత్వం ప్రకటించింది. మహానది నుంచి నీటిని తరలించకుండా గోదావరి నీటిని కృష్ణా మీదుగా పెన్నా, కావేరి బేసిన్‌లకు తరలించడం సాధ్యం కాదు. అలా జరిగితే తెలుగు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఇది మరో దుమ్ముగూడెం

ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపాదించిన దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ మాదిరే ఈ ప్రతిపాదన ఉంది. తెలంగాణలో భారీగా భూములు కోల్పోవాల్సి వస్తుందని, నీటిని మాత్రం ఇతర ప్రాంతం ఉపయోగించుకుంటుందని దాన్ని తెలంగాణ సర్కారు రద్దు చేసింది. అకినేపల్లి బ్యారేజీ నిర్మాణంతో తెలంగాణలో సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణం ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. దీనికితోడు, ప్రాజెక్టు వ్యయం, నీటి కోటాల్లో వాటాలపై స్పష్టత లేదు.



పైపుల లారీ ఢీకొనడంతో.. నుజ్జునుజ్జయిన ఆటో

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో.. అయిదుగురి మృతి

టేకులపల్లి, ఇల్లెందు, బూర్గంపాడు, కొత్తగూడెం క్రైం, జనవరి 14: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో అయిదుగురు మృతి చెందిన సంఘటనలు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకున్నాయి. టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామం వద్ద నిలిపి ఉన్న ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందగా.. బూర్గంపాడులో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ తాపీమేస్త్రీ చనిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పంతుల్‌నాయక్ తండాకు చెందిన మోతీలాల్(50), లలిత దంపతులు తమ కుమారుడు చరణ్‌తో కలిసి ఆదివారం పాల్వంచలోని పెద్దమ్మ గుడికి వెళ్లారు. సాయంత్రం దైవదర్శనం అనంతరం షేరింగ్ ఆటోలో తిరుగుప్రయాణమయ్యారు. ఆటోలో వీరితోపాటు సీతంపేటకు చెందిన ఎర్రనాగుల రమేష్ (25), మరో ఇద్దరు గుర్తుతెలియని మహిళలు ఉన్నారు. ఆటో బేతంపూడి సమీపంలోని తంగెళ్ల తండా వద్దకు రాగానే.. చరణ్ బహిర్భూమికి వెళ్లాలని ఆటోను ఆపాడు. అతనితోపాటు లలిత ఆటో దిగగా.. మిగతా ప్రయాణికులతోపాటు.. డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ పైపుల లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో.. రమేష్, ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా.. ఆటో డ్రైవర్ వంశీ, మోతీలాల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మోతీలాల్ మార్గమధ్యంలో మృతిచెందాడు. ఆటోడ్రైవర్ అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఘటనలో.. బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం కూడలిలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న కుమ్మరిపల్లి నర్సింహారావు (35) అనే తాపీమేస్త్రీ మృతిచెందాడు.

రాములవారి 'ప్రవరల' మార్పుపై వివరణివ్వండి

▸▸ ప్రభుత్వానికి హైకోర్టు న్యాయవాది లీగల్ నోటీసు

భద్రాచలం, జనవరి 14: భద్రాద్రి రాములవారి ఆలయంలో నిర్వహించే స్వామి వారి కల్యాణం, ఇతర పూజల్లో 2012 నుంచి స్వామి వారి ప్రవరలను మార్పు చేయడంపై ప్రభుత్వానికి, దేవాదాయ కమిషనర్‌కు హైకోర్టు న్యాయవాది డి.సుదర్శనరెడ్డి లీగల్ నోటీసులు పంపారు. దీంతో ఈ నెల 5న భద్రాద్రి దేవస్థానం అధికారులకు మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలంటూ ఉన్నతాధికారుల నుంచి మెమో జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం.

విదేశీ పర్యటనకు మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం తెల్లవారుజామున విదేశీ పర్యటనకు బయలుదేరారు. ఆయనతోపాటు ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఇతర అధికారులు ఉన్నారు. ఈ బృందం కొరియా, జపాన్, తదితర దేశాల్లో పర్యటించనుంది. పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించేందుకు ఈ పర్యటనను ఖరారు చేశారు. ఈ నెల 23 నుంచి 26 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొననున్న కేటీఆర్.. 27న హైదరాబాద్ చేరుకుంటారు. మరో రోజు పర్యటన పొడిగించిన పక్షంలో కేటీఆర్ దుబాయ్‌లో పర్యటించే అవకాశాలున్నాయి.

ప్రజలకు స్పీకర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా.. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వైస్‌చైర్మన్ ప్రతాప్ ఆదివారం స్పీకర్‌ను అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

బీసీలను అణిచివేసింది మీరు కాదా..?

▸▸ ఉత్తమ్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, జనవరి 14(ఆంధ్రజ్యోతి): 'అధికారం దూరం కాగానే బీసీలు గుర్తుకొచ్చారా..? అసలు బీసీలను అణిచివేసింది కాంగ్రెస్ కాదా..?' అని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. 2019లో అధికారంలోకి రాగానే బీసీలను అన్ని విధాలా ఆదుకుంటామన్న ఉత్తమ్ హామీని నీటిమూటగా అభివర్ణించారు. ఆదివారం టీఆర్ఎస్ఎల్పీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కల్లుగీత వృత్తిని కాంగ్రెస్ ప్రభుత్వాలే నిర్వీర్యం చేశాయన్నారు. నీరా ఉత్పత్తులను ప్రోత్సహించి గీత కార్మికులకు హైబ్రిడ్ తాటి విత్తనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

దోపిడీ రహిత తెలంగాణే బీఎల్ఎఫ్ లక్ష్యం: తమ్మినేని

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అగ్రకులాలు, కార్పొరేట్ శక్తుల దోపిడీ నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా 28 పార్టీలతో కూడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) పనిచేయనుందని ఆ ఫ్రంట్ కన్వీనర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఈ నెల 25న జరగనున్న బీఎల్ఎఫ్ ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తమ్మినేని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సామాజిక న్యాయం అన్ని కులాల హక్కుగా పేర్కొంటూ ఈ నెల 25 తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో సభలు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రతిపక్షాలపై కక్షసాధింపు ధోరణి తగదు: చాడ

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని టీఆర్ఎస్ ప్రభుత్వానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆదివారం హితవు చెప్పారు. తెలుగు రైతు అధ్యక్షులు ఒంటేరు ప్రతాప్‌రెడ్డిని అరెస్టు చేసిన తీరును ఆయన తప్పుబట్టారు. ఇకనైనా కక్షసాధింపు ధోరణి విడనాడాలని, అరెస్టు చేసిన నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హిందూ మతమే ప్రధాన శత్రువు: కేఎన్‌పీఎస్

పాలమూరు, జనవరి 14: 'భారతదేశంలో హిందూ మతమే పేదలకు ప్రధాన శత్రువైంది, మతమే రాజ్యమై పాలిస్తోంది' అని కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్ ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విరసం 26వ రాష్ట్ర మహాసభల రెండో రోజు కార్యక్రమంలో 'హిందుత్వ కుల స్వభావం' అంశంపై ఆయన ప్రసంగించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో హిందూ మతోన్మాదం తీవ్రరూపం దాల్చడంతో దళితులు, ముస్లింలకు రక్షణ కరువైందన్నారు. దేశంలో పశువులకు ఇచ్చిన విలువ మనుషులకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందుత్వ వ్యతిరేక సాహిత్యం- వస్తువు, దృక్పథం అంశంపై శివరాత్రి సుధాకర్ ప్రసంగించారు. హిందువు అనే పదం వేదాల్లో, పురాణాలతో పాటు వారు ఆరాధిస్తున్న ఏ గ్రంథంలోను లేదన్నారు.

మెరుపు 'పంచ్'

(మొదటి పేజీ తరువాయి)

సన్నద్ధమయ్యే అవకాశం ఇవ్వకుండా.. వారు సర్దుకునేలోపే నిర్వహించి విజయకేతనం ఎగురవేయాలనేది అధికార టీఆర్ఎస్ ముఖ్యుల ఆలోచనగా తెలుస్తోంది. ఈ మేరకు ఫిబ్రవరి రెండో వారంలోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లేందుకు సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అందుకు స్వల్ప వ్యవధి మాత్రమే ఉండడంతో ఈ లోగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సాంకేతిక ప్రక్రియ పూర్తవుతుందా? లేదా? చట్టం అనుమతిస్తుందా? అనే విషయంలో అధికార వర్గాల్లో కొన్ని అనుమానాలు ఉన్నాయి. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణ కసరత్తులో నిమగ్నమైనందున.. ప్రభుత్వం తలచుకుంటే ఫిబ్రవరి రెండో వారంలో కష్టమేమీ కాదనే అభిప్రాయం కూడా ఉంది. పైగా ఎన్నికల ప్రక్రియను పది రోజుల్లోనే ముగించాలనుకుంటున్న నేపథ్యంలో ఇతరత్రా ఇబ్బందులు కూడా ఉండబోవనేది ప్రభుత్వం ఆలోచనగా తెలుస్తోంది.

గడువు వరకు పాలకవర్గాల కొనసాగింపు..

గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఎన్నికైన నాటినుంచి ఐదేళ్లు అధికారంలో విధిగా కొనసాగాలని చట్టం చెబుతోంది. దీంతో ప్రస్తుత పాలకవర్గాలను పదవీకాలం గడువు (జూలై 31) వరకు కదిలించకుండా కొనసాగించాలని, ఆ లోగా కొత్తగా ఎన్నికైన వారికి శిక్షణ, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించాలని సర్కారు భావిస్తోంది. తద్వారా ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించినా చట్టపరమైన చిక్కులేమీ ఉండబోవని అంచనా వేస్తోంది. కొత్తగా ఎన్నికైనవారు శిక్షణ, క్షేత్ర అవగాహన పూర్తి చేసుకొని.. పాత పాలకవర్గాల పదవీకాలం ముగిశాక ఆగస్టు 1వ తేదీన పదవీ బాధ్యతలు చేపట్టేలా చర్యలు చేపడితే చాలునని భావిస్తోంది. అయితే నూతన పంచాయతీరాజ్ చట్టం అసెంబ్లీ ఆమోదం పొంది, అమల్లోకి వచ్చేదానిని బట్టి పంచాయతీ ఎన్నికల తేదీలు ఖరారు కానున్నాయి. కాగా, సీఎం కేసీఆర్ ఈ నెల 16న (మంగళవారం) ప్రగతి భవన్‌లో కలెక్టర్ల సమావేశం నిర్వహించనున్నారు. భూముల రికార్డుల శుద్ధీకరణ, నవీకరణ అజెండాగా నిర్వహించనున్న ఈ సమావేశంలో.. మార్చి 11న ధరణి కార్యక్రమం కింద చేయతలపెట్టిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీపై కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. పంచాయతీరాజ్ నూతన చట్టం, గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహాలు వంటి అంశాలు కూడా కలెక్టర్ల సమావేశంలో ప్రస్తావనకు రానున్నట్లు సమాచారం. తండాల వారీగా జనాబా ఖరారు చేసి వాటికి చట్టపరంగా గ్రామ పంచాయతీ హోదా కల్పించటానికి రంగం సిద్ధం చేయాలని కలెక్టర్లను సీఎం కేసీఆర్ ఆదేశించనున్నారు. ఇక ఈ నెల 22న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనున్నట్లు, నూతన పంచాయతీరాజ్ చట్టానికి ఈ సందర్భంగా కేబినెట్ ఆమోదం తెలపనున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఈ నెల 23, 24 తేదీల్లో శాసనసభ, శాసనమండలి సమావేశాలు నిర్వహించాలనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ సమావేశాల్లోనే పంచాయతీరాజ్ నూతన చట్టానికి ఆమోదం తెలుపుతారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చనున్నారు. ఇదిలా ఉండగా.. సహకార సంఘాల పదవీకాలాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఫిబ్రవరి మొదటి వారంతో సహకార సంఘాల పదవీకాలం ముగియనుంది. కానీ, ప్రభుత్వం ఎలాగూ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని భావిస్తుండటంతో, సహకార సంఘాల ఎన్నికలపై ఆ తర్వాత ఆలోచన చేయవచ్చని అనుకుంటున్నారు. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సహకార సంఘాల పదవీకాలాన్ని పొడిగించకుండా, వాటికి ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయించారు.

కార్పొరేట్ ఆస్పత్రులు విదేశీ గుప్పిట్లో

(మొదటి పేజీ తరువాయి)

హెల్త్ బిజినెస్ నెమ్మదిగా విదేశీ కంపెనీల గుప్పిట్లోకి వెళుతోంది. హైదరాబాద్‌లో అత్యున్నతస్థాయిలో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో 90 శాతం విదేశీ కంపెనీలకు షేర్ ఉంది. కొద్దో గొప్పో పేరున్న ఆస్పత్రులు కూడా ఎంతో కొంత వాటాను విదేశీ సంస్థలకు అమ్మేసుకుంటున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థ (ఐఎఫ్‌సీ) అనేది ప్రపంచ బ్యాంకు అనుబంధ సంస్థ. ఇది అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్‌లో రూ.450 కోట్లు పెట్టుబడి పెట్టింది. దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో ఈ సంస్థ ఇప్పటి వరకు రూ.4000 కోట్లు పెట్టుబడి పెట్టడం విశేషం. అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆస్పత్రిలో టీపీజీ గ్రోత్ అనే ఫారిన్ కంపెనీ దాదాపు 60 శాతం వాటాను చేజిక్కించుకుంది. గచ్చిబౌలిలో ఉన్న కాంటినెంటల్ ఆస్పత్రిలో కొంత వాటాను మలేషియాకు చెందిన ఐహెచ్‌హెచ్ హెల్త్ కేర్ సంస్థ కొనుగోలు చేసింది. కేర్ ఆస్పత్రిలో దుబాయ్ కంపెనీ అబ్రాజ్ గ్రూపు 72 శాతం వాటాను దక్కించుకుంది. ఆస్పత్రిలో ఆ కంపెనీ రూ.2000 కోట్లు పెట్టుబడి పెట్టింది. అలాగే, సన్‌షైన్ ఆస్పత్రిలో దుబాయ్‌కి చెందిన కంపెనీ పెట్టుబడి పెట్టింది. ప్రైమ్ ఆస్పత్రిలో దుబాయ్‌కు చెందిన ఆస్టర్ డీఎమ్ హెల్త్ కేర్ సంస్థ మెజారిటీ వాటాను సంపాదించింది. అపోలో గ్రూప్ ఆఫ్ హస్పిటల్స్ ఇప్పటికే పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. త్వరలో కిమ్స్ ఆస్పత్రి కూడా పబ్లిక్ ఇష్యూకు వస్తుందని బిజినెస్ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ ఆస్పత్రుల్లో పెట్టుబడులు పెట్టడానికి మరిన్ని విదేశీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని అంటున్నారు. దేశ ఆరోగ్య పరిశ్రమ 2020 నాటికి రూ.20 లక్షల కోట్లు చేరుతుందని అంచనా. కాగా విదేశీ కంపెనీలు నగర ఆస్పత్రుల్లోని మెజారిటీ వాటాను కొనేస్తుండటంపై సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్ముందు కార్పొరేట్ ఆస్పత్రులపై విదేశీ సంస్థల పెత్తనం పెరిగి వైద్యసేవలు మరింత ప్రియమవుతాయని, పారామెడికల్ సిబ్బంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని విశ్లేషిస్తున్నారు. ఈ పరిణామంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

కొన్ని కంపెనీలకు పెట్టుబడి బూమరాంగ్

కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెట్టుబడులు పెడుతున్న విదేశీ కంపెనీల్లో కొన్నింటికి నష్టాలూ వస్తున్నాయి. కేవలం ఆస్పత్రుల బ్రాండ్‌నే నమ్ముకొని కోట్లు కుమ్మరిస్తుండడంతో పెట్టుబడికి తగ్గట్టు ఆదాయం రాక విలవిల్లాడుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ ఆస్పత్రిలో దుబాయ్‌కి చెందిన ఓ కంపెనీ రూ. 2500 కోట్లు పెట్టుబడి పెట్టింది. కొంతకాలానికి పెట్టుబడికి తగినంత ఆదాయం లేకపోవడంతో ఆస్పత్రి నిర్వాహకులను సదరు కంపెనీ ప్రతినిధులు గట్టిగా నిలదీసినట్టు సమాచారం. ఆస్పత్రి వ్యవస్థాపక వైద్యుడి వేతనంలో కూడా భారీ కోత విధించింది. ఇష్టం లేకున్నా ఆస్పత్రిలో కొనసాగుతున్న ఆ పెద్దమనిషి.. నగర శివార్లలో 20 ఎకరాల్లో సొంతంగా ఆస్పత్రిని నిర్మించబోతున్నారని తెలిసింది.

నగర ఆస్పత్రుల్లోనే పెట్టుబడి ఎందుకు?

కార్పొరేట్ ఆస్పత్రుల పట్ల విదేశీ కంపెనీలు ఎందుకింత ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి? అంటే.. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ పథకమే అని చెప్పవచ్చు. ఆరోగ్య శ్రీ కింద రాష్ట్ర సర్కారు ఏడాదికి రూ. 700 కోట్లు చెల్లిస్తోంది. ఈ పథకం కింద చికిత్స చేయించుకుంటున్న రోగుల్లో 70 శాతం కార్పొరేట్ ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్య శ్రీ కింద సర్కారు చెల్లిస్తున్న రూ.700 కోట్లలో దాదాపు రూ. 500 కోట్లు ఆ ఆస్పత్రులకే వెళుతున్నాయి. ఉద్యోగులు హెల్త్ స్కీమ్ కూడా కార్పొరేట్ ఆస్పత్రులకు వరంగా మారింది. ఉద్యోగుల్లో 99 శాతం మంది కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయించుకుంటున్నారు.

పరిషత్‌లకు ప్రత్యక్షమా? పరోక్షమా?

▸▸ పంచాయతీ చట్టంపై ముగిసిన కసరత్తు

▸▸ జిల్లా, మండల పరిషత్‌లపై జరగని చర్చ

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకురానుండడం, సర్పంచ్‌లను పరోక్ష పద్ధతిలో ఎన్నుకోవాలని నిర్ణయించిన నేపథ్యంలో.. మరికొన్ని అంశాలూ తెరపైకి వస్తున్నాయి. మూడంచెల వ్యవస్థ అమలులో ఉన్న పంచాయతీరాజ్‌లో గ్రామపంచాయతీలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. మండల స్థాయిలోని మండల పరిషత్‌లు, జిల్లా స్థాయిలోని జిల్లా పరిషత్‌లపై మాత్రం కనీసం చర్చ కూడా జరపలేదని తెలుస్తోంది. నూతన పంచాయతీరాజ్ చట్టానికి సంబంధించి ముసాయిదా కూడా సిద్ధమైన నేపథ్యంలో మడల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ), జిల్లా పరిషత్ (జడ్పీ) చైర్మన్‌లను ఏ పద్ధతిలో ఎన్నుకుంటారన్న చర్చ మొదలైంది. ప్రస్తుతం అమలులో ఉన్న పరోక్ష పద్ధతినే కొనసాగిస్తారా? లేక ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత విధానం ప్రకారం మండల స్థాయిలో గెలిచిన ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుల్లో ఒకరిని జడ్పీ చైర్మన్‌గా ఎన్నుకుంటున్నారు. అయితే జిల్లాల పునర్విభజనతో అన్ని జిల్లాల్లోనూ జడ్పీటీసీల సంఖ్య తగ్గనుండడం జడ్పీచైర్మన్‌ల ఎన్నికపై ప్రభావం చూపనుంది. రాష్ట్రంలోని 10 పూర్వపు జిల్లాలు.. పునర్విభజన తరువాత 31 జిల్లాలుగా ఏర్పాటైన విషయం తెలిసిందే. వీటిలో 30 గ్రామీణ జిల్లాలున్నాయి. మరో ఏడాదిన్నర కాలంలో మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు జరగాల్సి ఉంది.

జడ్పీ చైర్మన్ పదవి సునాయాసమే!

జిల్లాల పునర్విభజనతో పలు జిల్లాలకు అతి తక్కువగా జడ్పీటీసీ స్థానాలు రానుండడంతో జడ్పీ చైర్మన్ పదవిని దక్కించుకోవడం సునాయాసమే అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు కొత్తగా ఏర్పాటైన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ప్రస్తుతం ఐదు జడ్పీటీసీ స్థానాలు మాత్రమే ఉన్నాయి. ఈ జిల్లాలో కొత్తగా మరో మండలాన్ని ఏర్పాటు చేయడంతో ఆ సంఖ్య జడ్పీటీసీల సంఖ్య 6కు చేరనుంది. ఒకవేళ ఈ జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఏదైనా కేటగిరీకి రిజర్వ్ చేసి, జడ్పీటీసీ స్థానాల్లో ఆ కేటగిరీకి రిజర్వు చేసిన స్థానం ఒక్కటి మాత్రమే ఉంటే.. అక్కడ జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన వ్యక్తి నేరుగా జడ్పీ చైర్మన్ అయినట్లే. జడ్పీటీసీ స్థానాలు స్వల్పంగా ఉండడంతో ఒక్కో కేటగిరీకి రిజర్వ్ అయ్యే స్థానాలు తక్కువయ్యే అవకాశం ఉండడమే ఇందుకు కారణం. ఒకవేళ జడ్పీ చైర్మన్ జనరల్ అయినా.. చైర్మన్ పదవిని ఆశిస్తున్న వ్యక్తి తనకుతోడు మరో ముగ్గురిని తనవైపు చేర్చుకోగలిగితే చాలు. ఇందులో ఒకరికి ఎలాగూ జడ్పీ వైస్ చైర్మన్ పదవి దక్కుతుంది. ఇలా చాలా జిల్లాల్లో జడ్పీటీసీల సంఖ్య 15 నుంచి 20 మాత్రమే కానుంది. ఆయా జిల్లాల్లో జడ్పీటీసీ సభ్యులకు రిజర్వేషన్ లేదా పరిస్థితులు అనుకూలిస్తే చైర్మన్, లేదంటే వైస్ చైర్మన్ పదవి దక్కించుకునే అవకాశం దక్కనుంది. జడ్పీ సభ్యుల సంఖ్య పరిమితంగా ఉన్న ఈ నేపథ్యంలో జిల్లా, మండల పరిషత్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు జరపాలన్న వాదన వినిపిస్తోంది. పరిమితమైన సభ్యుల్లో ఒకరిని చైర్మన్, మరికొరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవడం కంటే.. చైర్మన్ పదవికి నేరుగా ప్రత్యక్ష ఎన్నిక జరపాలని పలువురు సూచిస్తున్నారు. 1987లో జరిగిన స్థానిక ఎన్నికల్లో జిల్లా, మండల పరిషత్ అధ్యక్షులను నేరుగా ఎన్నుకున్నారు. 1995 నుంచి ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో రొటేషన్ రిజర్వేషన్‌తో పరోక్ష ఎన్నిక నిర్వహిస్తున్నారు. అయితే, ఎన్నికలు సమీపించే లోగా ప్రభుత్వం దీనిపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని కొందరు పేర్కొంటున్నారు. ఇక మండల పరిషత్‌లు ప్రస్తుతం 438 ఉన్నాయి. కొత్త మండలాల కారణంగా ఈ సంఖ్య 463కు చేరుతోంది.

అండర్-19 ప్రపంచ కప్
నేడు ఇంగ్లండ్ x నమీబియా తెల్లవారుజామున 3గం.నుంచి
రేపు భారత్ x పపువా న్యూ గినియా తెల్లవారుజామున 6.30 నుంచి
స్టార్ స్పోర్ట్స్-1 టీవీ

ప్రొ రెజ్లింగ్ లీగ్
నేడు ఢిల్లీ x యూపీ
రేపు హరియాణా x పంజాబ్ (సా. 6 నుంచి)
SONY ESPN

సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరా'బాద్‌షా'

• హంటర్స్‌దే పీబీఎల్ • ఫైనల్లో బ్లాసర్స్‌పై విజయం
• జట్టును గెలిపించిన సాత్విక్ సాయిరాజ్

సాత్విక్ సాయిరాజ్.. గోపీచంద్ శిక్షణలో రాటుదేలుతున్న డబుల్స్ రాకెట్. కొంతకాలంగా అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శనతో పేరు తెచ్చుకుంటున్న ఈ హైదరాబాద్ డబుల్లెట్ పేరు ఇప్పుడు మార్మోగిపోవడం ఖాయం. పీబీఎల్ అంతిమ సమరంలో అంతలా చెలరేగిపోయాడు ఈ తెలుగు షట్లర్. బెంగళూరు బ్లాస్టర్స్‌తో నువ్వానేనా అన్నట్టు సాగిన ఫైనల్లో.. సాత్విక్ అద్వితీయ ఆటతో హైదరాబాద్‌ను గెలిపించాడు. అప్పటిదాకా ఇరుజట్లు 3-3తో సమంగా నిలిచిన దశలో మిక్స్‌డ్ మ్యాచ్ బరిలోకి దిగిన 17 ఏళ్ల సాత్విక్ తన ఆటతో అందరినీ విస్మయపరిచాడు. అంతెత్తున ఎగురుతూ భారీ స్మాష్‌లు కొడుతూ.. అద్భుత సర్వీస్‌లతో ఆకట్టుకొని హంటర్స్‌ను విజేతగా నిలిపాడు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) మూడో సీజన్‌లో హైదరాబాద్ హంటర్స్ విజేతగా నిలిచింది. గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో హంటర్స్ 4-3తో బెంగళూరు బ్లాస్టర్స్‌ను ఓడించింది. నిర్ణాయక మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-జిబేదియా జోడీ 15-8, 15-12తో బ్లాస్టర్ జంట కిమ్ సా రంగ్-సిక్కిరెడ్డిని ఓడించి జట్టుకు టైటిల్ అందించింది. అంతకుముందు జట్టు 2-3తో వెనుకబడిన దశలోమహిళల సింగిల్స్‌లో కెప్టెన్ కరోలినా మారిన్ 15-8, 15-14తో క్రిస్టీ గిల్మోర్‌పై నెగ్గి జట్టును రేసులో నిలిపింది. తొలుత మొదటిదైన పురుషుల డబుల్స్‌లో హైదరాబాద్ జంట మార్కిస్ కిడో- యియాన్ సెయాంగ్ 9-15, 10-15తో మథియాస్ బోయె-కిమ్ సా రంగ్ ద్వయం చేతిలో ఓడింది. అయితే, ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల తొలి సింగిల్స్‌లో లీ హ్యున్ 15-7, 15-13తో శుభాంకర్(బ్లాస్టర్స్)ను ఓడించి జట్టును 2-1తో ఆధిక్యంలో నిలిపాడు. కానీ, బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల రెండో సింగిల్స్‌లో వరల్డ్ చాంపియన్ విక్టర్ అక్సెల్సన్ 15-8, 15-10తో సాయి ప్రణీత్‌ను చిత్తుచేయడంతో, బెంగళూరు 3-2తో మళ్లీ ఆధిక్యం సాధించింది. చివరి రెండు మ్యాచ్లల్లో మారిన్, సాత్విక్ విజయాలతో ట్రోఫీ నెగ్గిన హంటర్స్ రూ. 3 కోట్ల ప్రైజ్‌మనీ అందుకుంది. మారిన్ ఉత్తమ ప్లేయర్‌గా నిలిచింది.

ఆరంభం అదిరింది

ఆస్ట్రేలియాపై భారత్ గ్రాండ్ విక్టరీ • అండర్-19 ప్రపంచకప్

మౌంట్ మాంగనూయ్: తొలుత బ్యాట్స్‌మెన్ అదరగొట్టారు. ఆ తర్వాత బౌలర్లు రెచ్చిపోయారు..ఫలితంగా అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ అద్భుత ఆరంభం అందుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్ (డే/నైట్)లో పృథ్వీ షా నేతృత్వంలోని యువ జట్టు 100 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. ఓపెనర్లు పృథ్వీ షా (100 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 94), మన్జోత్ కల్రా (99 బంతుల్లో 12 ఫోర్లు, సిక్సర్‌తో 86)లకు తోడు శుభమన్ గిల్ (63), అభిషేక్ శర్మ (23) ధాటికి నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్లకు 328 పరుగులు చేసింది. పృథ్వీ, కల్రా తొలి వికెట్‌కు రికార్డుస్థాయిలో 180 పరుగులు జోడించారు. దీంతో 2004 అండర్-19 వరల్డ్‌కప్‌లో శిఖర్ ధవన్, రాబిన్ ఊతప్ప 179 పరుగులతో నెలకొల్పిన రికార్డు తెరమరుగైంది. ఆసీస్ బౌలర్ ఎడ్వర్డ్స్ 4 వికెట్లు తీశాడు. భారీ లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 42.5 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. ఎడ్వర్డ్స్ (73), మెర్లో (38), హోల్ట్ (39) మినహా అంతా విఫలమయ్యారు. పేసర్లు శివమ్ మావి (3/45), నాగర్ కోటి (3/29) ప్రత్యర్థికి చెక్ చెప్పారు.

32 బంతుల్లో 100

టీ20ల్లో రిషభ్ ఫాస్టెస్ట్ సెంచరీ • రోహిత్ రికార్డు బద్దలు

న్యూఢిల్లీ: ఢిల్లీ కీపర్, బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్లను తుత్తునియలు చేసి టీ20ల్లో రెండో వేగవంతమైన సెంచరీతో రికార్డు నెలకొల్పాడు. రిషభ్ (38 బంతుల్లో 8 ఫోర్లు, 12 సిక్సర్లతో 116 నాటౌట్) ధాటికి ఆదివారం ఇక్కడ హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన ముస్తాక్ అలీ టీ20 టోర్నీ మ్యాచ్‌లో ఢిల్లీ 10 వికెట్లతో ఘన విజయం సాధించింది. 145 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ కేవలం 11.4 ఓవర్లలో 148/0తో ఛేదించింది. 32 బంతుల్లో శతకంతో కదం తొక్కిన 20 ఏళ్ల పంత్.. టీ20ల్లో వేగంగా సెంచరీ చేసిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. దీంతో గత నెలలో ఇండోర్ వేదికగా శ్రీలంకపై 35 బంతుల్లోనే సెంచరీ కొట్టిన రోహిత్‌రికార్డు బద్దలైంది. టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ క్రిస్ గేల్ (30 బంతులు) పేరిట ఉంది. ఈ రికార్డును అతడు 2013 ఐపీఎల్‌లో పుణె వారియర్స్‌పై నెలకొల్పాడు. ఫస్ట్‌క్లాస్‌ల్లో భారత్ తరపున వేగవంతమైన సెంచరీ (48 బంతుల్లో) రికార్డు కూడా పంత్‌దే కావడం విశేషం. తొలుత హిమాచల్.. నిర్ణీత 20 ఓవర్లలో 144/8 స్కోరు చేసింది. ఛేదనలో పంత్ ఇన్నింగ్స్ ముందు గౌతమ్ గంభీర్ (30 నాటౌట్) ప్రేక్షకుడిగా మిగిలి పోవాల్సి వచ్చింది.


రిషభ్ పంత్ (38 బంతుల్లో 8 ఫోర్లు, 12 సిక్సర్లతో 116 నాటౌట్)

నాయకుడు నిలిచాడు!

• సత్తా చాటిన కోహ్లీ, విజయ్ • భారత్ 183/5 • రాహుల్, పుజారా, రోహిత్ విఫలం • దక్షిణాఫ్రికా 335

పిచ్ నుంచి బౌలర్లకు సహకారం లేదు..! అయినా.. ప్రత్యర్థిని త్వరగానే ఆలౌట్ చేసిన బౌలర్లు తమ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తించారు..! కానీ, ఫ్లాట్ వికెట్‌పై భారత్‌కు మళ్లీ నిరాశే..! ధవన్ కంటే నైపుణ్యం ఉందని తీసుకున్న లోకేశ్ రాహుల్.. నమ్మదగ్గ ఆటగాడు పుజారా వరుస బంతుల్లో వెనుదిరగడంతో 28/2తో నిలిచిన భారత్ మరోసారి కుప్పకూలేలా కనిపించింది..! కానీ, నాయకుడు విరాట్ కోహ్లీ ప్రత్యర్థి బౌలర్లకు ఎదురొడ్డి నిలిచాడు..! విజయ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దిన అతను.. మిగతా బ్యాట్స్‌మెన్ తడబడ్డా, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా గొప్పగా పోరాడి జట్టును ఆదుకున్నాడు..! అయినా, భారత్ ఇంకా 152 పరుగుల దూరంలో ఉండడంతో.. ప్రస్తుతానికి సఫారీలదే కాస్త పైచేయి..! క్రీజులో ఉన్న విరాట్, హార్దిక్‌తో పాటు అశ్విన్ మూడో రోజు ఎంతసేపు పోరాడుతారన్నదానిపైనే భారత భవితవ్యం ఆధారపడి ఉంటుంది..!


కోహ్లీ (85 బ్యాటింగ్)

1 టెస్టుల్లో గోల్డెన్ డకౌట్ కావడం పుజారాకిదే తొలి సారి.

100 షమి టెస్టుల్లో వంద వికెట్ల క్లబ్‌లో చేరాడు. తద్వారా ఈ ఘనత సాధించిన భారత ఏడో ఫాస్ట్ బౌలర్‌గా నిలిచాడు.

సెంచూరియన్: భారత్-దక్షిణాఫ్రికా రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. ఆధిపత్యం చేతులు మారుతున్న సమరంలో కెప్టెన్ విరాట్ కోహ్లీ (130 బంతుల్లో 8 ఫోర్లతో 85 బ్యాటింగ్) అద్భుత పోరాటపటిమతో భారత్ ప్రత్యర్థికి గట్టిగా జవాబిస్తోంది. కోహ్లీతో పాటు మురళీ విజయ్ (126 బంతుల్లో 6 ఫోర్లతో 46) సత్తా చాటడంతో రెండోరోజైన ఆదివారం చివరకు టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లకు 183 పరుగులు చేసి పోరాడుతోంది. పుజారా (0) తొలి బంతికే రనౌటవగా.. ధవన్ స్థానంలో జట్టులోకొచ్చిన లోకేశ్ రాహుల్ (10), రోహిత్ (10) నిరాశపరిచారు. పార్థివ్ పటేల్ (19) కూడా విఫలమయ్యాడు. కానీ, విజయ్‌తో మూడో వికెట్‌కు 79 పరుగులు జోడించిన విరాట్ జట్టును ఆదుకున్నాడు. ప్రస్తుతం విరాట్‌తో పాటు హార్దిక్ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 269/6కు మరో 66 పరుగులు జోడించిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ డుప్లెసిస్ (63) అర్ధ సెంచరీతో రాణించాడు. అశ్విన్ నాలుగు, ఇషాంత్ మూడు వికెట్లతో రాణించారు.

విరాట్, విజయ్ పోరాటం..: తొలి సెషన్‌లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్‌తో బౌలింగ్ ఆరంభించి ఆశ్చర్యపరచగా.. అగ్ర పేసర్ మోర్నె మోర్కెల్, షార్ట్‌పిచ్ బంతులు.. పదునైన బౌన్సర్లతో ఓపెనర్లకు సవాల్ విసిరాడు. ఈక్రమంలో ఇన్నింగ్స్ పదో ఓవర్లో మోర్కెల్‌కే రిటర్న్ క్యాచ్ ఇచ్చి రాహుల్ అవుటయ్యాడు. ఆ తర్వాతి బంతికే భారత్‌కు దిమ్మతిరిగే షాకిచ్చాడు అరంగేట్రం బౌలర్ ఎన్‌గిడి. వన్‌డౌన్‌లో వచ్చిన పుజారా.. మోర్కెల్ బంతిని మిడాన్ వైపు ఆడి గుడ్డిగా పరుగు తీయగా.. అతణ్ణి వారించే ప్రయత్నం చేయని విజయ్ వెళ్లాలా వద్దా అనుకొని పరుగందుకున్నాడు. కానీ, అప్పటికే బంతిని అందుకున్న ఎన్‌గిడి డైరెక్ట్ త్రోతో వికెట్లను పడగొట్టాడు. ఆపై, ఫిలాండర్ బౌలింగ్‌లో విజయ్ కూడా ఇబ్బంది పడ్డా తర్వాత కుదురుకున్నాడు. మరో ఎండ్‌లో కోహ్లీ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. వచ్చీరాగానే మోర్కెల్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన అతను.. అదే జోరును కొనసాగించాడు. రబాడతో పాటు స్పిన్నర్ కేశవ్‌ను కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. కాసేపటికే విజయ్ కూడా బౌండ్రీలు కొట్టడంతో 16వ ఓవర్లో జట్టుస్కోరు 50 పరుగులు దాటింది. ఇద్దరూ 101 బంతుల్లోనే 50 రన్స్ జోడించారు. ఇక, 80/2తో టీ విరామానికి వెళ్లొచ్చిన తర్వాత కోహ్లీ, విజయ్ అదే ధాటిని కొనసాగించారు. ఈ క్రమంలో విరాట్ 68 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. విజయ్ కూడా ఆ మార్కుకు చేరువకావడంతో రెండోరోజు భారత్ పైచేయి సాధించేలా కనిపించింది. కానీ, తర్వాతి ఓవర్లోనే విజయ్‌ను కేశవ్ అవుట్ చేసి ఆ జోడీని విడదీశాడు. ఇక, కీలక దశలో క్రీజులోకొచ్చిన రోహిత్ మరోసారి విఫలమయ్యాడు. 2ఫోర్లు కొట్టి కుదురుకున్నట్టే కనిపించిన అతను పేలవ ఫుట్‌వర్క్‌తో రబాడ బౌలింగ్‌లో వికెట్లముందు దొరికిపోయాడు. ఇక, సాహా బదులుగా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగిన వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ పార్థివ్ శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. మరోఎండ్‌లో నిలకడగా ఆడుతున్న కోహ్లీతో ఐదో వికెట్‌కు 32 రన్స్ జోడించిన అతను.. ఉన్నంతసేపు మంచి ఫుట్‌వర్క్‌తో పాటు నాణ్యమైన షాట్లతో మెరుగ్గానే బ్యాటింగ్ చేశాడు. కానీ, ఎన్‌గిడి ఆఫ్‌స్టంప్‌నకు దూరంగా వేసిన అద్భుత బంతికి అతను కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ దశలో ఆల్‌రౌండర్ పాండ్యాతో కలిసి జాగ్రత్తగా బ్యాటింగ్ చేసిన విరాట్ మరో వికెట్ పడకుండా రోజును ముగించాడు.

సఫారీల కట్టడి..: తొలుత 269/6తో రెండోరోజు ఆట కొనసాగించిన సౌతాఫ్రికా భారీస్కోరు చేయకుండా మన బౌలర్లు సమర్థవంతంగా అడ్డుకున్నారు. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ డుప్లెసిస్, కేశవ్ (18) ఏడో వికెట్‌కు 31 పరుగులు జోడించి సానుకూలంగా ఆటను ఆరంభించారు. 99వ ఓవర్లో షమి.. కీపర్ క్యాచ్ ద్వారా కేశవ్‌ను అవుట్ చేసి బ్రేక్ ఇచ్చాడు. ఇది షమికి వందో టెస్టు వికెట్ కావడం విశేషం. కానీ, అశ్విన్ వేసిన 104వ ఓవర్లో రబాడ (11) ఇచ్చిన రెండు క్యాచ్‌లను భారత్ నేలపాలు చేసి మూల్యం చెల్లించుకుంది. తొలుత స్లిప్‌లో ఏమరపాటుగా ఉన్న కోహ్లీ క్యాచ్ వదిలేయగా.. తర్వాతి బంతికే రబాడ షార్ట్ థర్డ్‌మ్యాన్ దిశగా బంతిని గాల్లోకి లేపాడు. హార్దిక్ పొజిషన్‌లోనే ఉన్నా షమి పరుగెత్తుకొచ్చి ఢీకొనడంతో జారవిడిచాడు. దీన్ని రబాడ ఉపయోగించుకున్నాడు. మరో ఎండ్‌లో ధాటిగా ఆడుతున్న కెప్టెన్‌కు సహకరించాడు. 106వ ఓవర్లో సఫారీ స్కోరు 300 దాటగా.. డుప్లెసిస్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఎట్టకేలకు ఇషాంత్ బౌలింగ్‌లో రబాడ వెనుదిరిగాడు. రెండు ఓవర్ల తర్వాత డుప్లెసిస్‌ను ఇషాంత్ బౌల్డ్ చేయగా, కాసేపటికే మోర్నె మోర్కెల్ (6)ను అశ్విన్ పెవిలియన్ చేర్చడంతో లంచ్‌కు ముందు సఫారీ ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31, మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) అశ్విన్ 94, ఆమ్లా (రనౌట్/హార్దిక్) 82, డివిల్లీర్స్ (బి) ఇషాంత్ 20, డుప్లెసిస్ (బి) ఇషాంత్ 63, డికాక్ (సి) కోహ్లీ (బి) అశ్విన్ 0, ఫిలాండర్ (రనౌట్) 0, కేశవ్ (సి) పార్థివ్ (బి) షమి 18, రబాడ (సి) పాండ్యా (బి) ఇషాంత్ 11, మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6, ఎన్‌గిడి (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 113.5 ఓవర్లలో 335 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251, 7-282, 8-324, 9-333; **బౌలింగ్:** బుమ్రా 22-6-60-0, షమి 15-2-58-1, ఇషాంత్ 22-4-46-3, హార్దిక్ 16-4-50-0, అశ్విన్ 38.5-10-113-4.

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) కేశవ్ 46, రాహుల్ (సి అండ్ బి) మోర్కెల్ 10, పుజారా (రనౌట్/ఎన్‌గిడి) 0, కోహ్లీ (నాటౌట్) 85, రోహిత్ (ఎల్బీ) రబాడ 10, పార్థివ్ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 19, హార్దిక్ (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 61 ఓవర్లలో 183/5; వికెట్ల పతనం:** 1-28, 2-28, 3-107, 4-132, 5-164; **బౌలింగ్:** కేశవ్ 16-1-53-1, మోర్కెల్ 15-3-47-1, ఫిలాండర్ 9-3-23-0, రబాడ 12-0-33-1, ఎన్‌గిడి 9-2-26-1.

ఫేవరెట్లు ఫెడరర్, నడాల్

• నేటి నుంచే ఆస్ట్రేలియన్ ఓపెన్

తెల్లవారుజామున 5.30 నుంచి సోనీ టెన్-2 సోనీ సిక్స్‌లో



మెల్‌బోర్న్: ఈ సీజన్ తొలి గ్రాండ్ స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల విభాగంలో నిరుటి చాంపియన్ ఫెడరర్, స్పెయిన్ బుల్ నడాల్ ఫేవరెట్లుగా బరిలో దిగుతున్నారు. సోమవారం మొదలయ్యే ఈ టోర్నీలో వీరిద్దరూ వేర్వేరు పార్శ్వాల్లో ఉండడంతో గత ఏడాది మాదిరే రోజర్, రఫెల్ ఫైనల్లో ఢీకొనే అవకాశాలున్నాయి. అయితే జొకోవిచ్, డెల్ పొట్రోలనుంచి ఫెడరర్‌కు గట్టి పోటీ ఎదురు కానుంది. మహిళల విభాగంలో వరల్డ్ నెంబర్ వన్ హలెప్, వెటరన్ వీనస్ విలియమ్స్‌లను ఫేవరెట్లుగా అంచనా వేస్తున్నారు. పురుషుల సింగిల్స్‌లో భారత్ తరపున ఏకైక ఆటగాడు యూకీ భాంబ్రిలో తొలిరోజు బరిలో దిగనున్నాడు.

సెమీస్‌లో భారత్

అంధుల క్రికెట్ ప్రపంచకప్

దుబాయ్: అంధుల క్రికెట్ ప్రపంచకప్‌లో భారత్ అజేయ జోరు కొనసాగిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత నేపాల్ 37.5 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. భారత బౌలర్ ప్రకాశ్ జయరామయ్య 22 రన్స్ ఇచ్చి 2 వికెట్లు తీశాడు. అనంతరం భారత్ కేవలం రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అజయ్ గరియా (29 బంతుల్లో 54) హాఫ్ సెంచరీ చేశాడు. మహేందర్ 40, రామ్‌బీర్ 38 రన్స్ చేశారు. ఈనెల 17న బంగ్లాదేశ్‌తో భారత్ సెమీస్‌లో తలపడనుంది.

రాయ్ సూపర్ షో

• జాసన్ అద్భుత సెంచరీ
• తొలి వన్డేలో ఇంగ్లండ్ ఘన విజయం

మెల్‌బోర్న్: ఓపెనర్ జాసన్ రాయ్ (151 బంతుల్లో 16 ఫోర్లు, 5 సిక్సర్లతో 180) రికార్డు సెంచరీతో కదం తొక్కడంతో ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. రాయ్‌కు జో రూట్ (110 బంతుల్లో 5 ఫోర్లతో 91 నాటౌట్) అండగా నిలవడంతో 305 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ ఏడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. అంతకు ముందు ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 304 పరుగులు చేసింది. ఫించ్ (107) సెంచరీ చేయగా మిచెల్ మార్ష్ (50), స్టొయినిస్ (60) హాఫ్ సెంచరీలు సాధించారు. యాషెస్ సిరీస్‌ను 0-4తో కోల్పోయి ఆస్ట్రేలియా పర్యటనలో విజయంకోసం వెంపర్లాడుతున్న ఇంగ్లండ్ ఎట్టకేలకు రాయ్ అమోఘ బ్యాటింగ్‌తో గెలుపు రుచి చూసింది. ఓవర్‌కు ఆరుకుపైగా లక్ష్యంతో ఛేదనను ఆరంభించిన ఇంగ్లండ్ 60 రన్స్‌కే 2 వికెట్లు చేజార్చుకొన్న దశలో.. రాయ్, రూట్ మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 221 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. ఈనేపథ్యంలో వన్డేల్లో అత్యధిక స్కోరు సాధించిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్‌గా జాసన్ రాయ్ రికార్డు సృష్టించాడు. 2016లో పాకిస్థాన్‌పై సహచరుడు అలెక్స్ హేల్స్ 171 పరుగులతో నెలకొల్పిన రికార్డును రాయ్ అధిగమించాడు.


రాయ్ (180)

సంక్రాంతి శుభాకాంక్షలు

- ఓ విమానం ప్రమాదపుటంచుల్లోకి వెళ్లడమే కాదు.. ఆ విపత్తు నుంచి బయటపడటానికీ మంచే కారణమంటే నమ్ముతారా? టర్కీలో ఈ ఘటన చోటుచేసుకుంది. అంకారా నుంచి 168 మంది ప్రయాణికులతో బయల్దేరిన విమానం ట్రాబ్జోన్ విమానాశ్రయానికి చేరింది. నల్లసముద్రానికి ఆనుకునే ఈ ఎయిర్‌పోర్టు ఉంది. ల్యాండింగ్ సమయంలో మంచు పేరుకుపోయిన రన్‌వే నుంచి పక్కకు జారిపోయింది. సముద్రానికి, రన్‌వేకు మధ్య ఉన్న ఏటవాలు మట్టికట్టపై కూరుకుపోయింది. మంచు వల్ల బురదగా మారిన మట్టికట్ట విమానాన్ని కిందకు జారకుండా అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు దక్కించుకున్నారు.





ఇంటర్నెట్ దుష్ప్రభావాలపై బోధన!

- స్కూలు పాఠ్యాంశాల్లో చేర్చనున్న కేంద్రం?

న్యూఢిల్లీ, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్ వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో అంతేస్థాయిలో దుష్ప్రభావాలూ ఉన్నాయి. ఇంటర్నెట్‌ను పద్ధతిగా వాడుకుంటే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. అదే గతి తప్పితే కలిగే ప్రమాదాలు అన్నీఇన్నీ కావు. ఈ క్రమంలో ఇంటర్నెట్ దుష్ప్రభావాలపై పిల్లలకు పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మహిళా, శిశు అభివృద్ధి శాఖ సిఫారసు మేరకు కేంద్ర మానవ వనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇంటర్నెట్‌కు బానిసలుగా మారితే సంభవించే దుష్పరిణామాలపై బోధించాలని ఆ శాఖ సూచించింది. సోమవారం నుంచి రెండు రోజుల పాటు కేంద్ర హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ అధ్యక్షతన ఢిల్లీలో జరగనున్న సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (కేబ్) సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల విద్యా శాఖ మంత్రులు పాల్గొంటారు. సైబర్ చట్టాల సమాచారం, ఇంటర్నెట్ నైతిక విలువలు, సైబర్ భద్రతా చర్యలు, ఇంటర్నెట్‌కు బానిసలవడంతో మానసికంగా కలిగే దుష్ప్రభావాలు వంటి అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు హెచ్‌ఆర్‌డీ శాఖకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ నోట్ పంపింది. మొబైల్‌లో గేమ్స్ ఆడడాన్ని నివారించడానికి కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇంటర్నెట్ దుష్ప్రభావాల గురించి పాఠ్యాంశాల్లో చేర్చడంతో పాటు పాఠశాలల్లో పిల్లలకు మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలని, అప్పుడప్పుడూ ప్రత్యేకంగా ఈ అంశంపైనే ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించింది.

సాహసం స్మరణలో..

హైదరాబాద్ వందేళ్ల నాటి పోరాటాన్ని గుర్తుకు తెచ్చుకున్న భారత్- ఇజ్రాయెల్


తీన్‌మూర్తి స్మారక చిహ్నం దగ్గర నివాళి అర్పించి వస్తున్న భారత్-ఇజ్రాయెల్ ప్రధానులు మోదీ, నెతన్యాహు

- టర్క్‌లను ఓడించిన హైదరాబాద్ అశ్వదళం
- కత్తులు, బల్లాలతో హైఫా నగర విముక్తి
- ముట్టడిలో మైసూర్, జోధ్‌పూర్ పాత్ర
- నాటి విజయస్మారకమే తీన్‌మూర్తి
- సందర్శించిన నెతన్యాహు-మోదీ

న్యూఢిల్లీ, జనవరి 14: వందేళ్ల క్రితం నాటి హైదరాబాద్ సైనికుల సాహసాన్ని ఆదివారం మరోసారి భారత జాతి గుర్తు చేసుకుంది. ప్రస్తుత ఇజ్రాయెల్ మూడో అతిపెద్ద నగరం హైఫాను తుర్కుల కబంధ హస్తాల నుంచి విముక్తం చేసిన వీరోచిత గాథను ఇజ్రాయెల్- భారత్ మననం చేసుకున్నాయి. ఒకటో ప్రపంచ యుద్ధం సందర్భంగా 1918 సెప్టెంబరు 23న బ్రిటీష్ ఇండియా సైన్యంలో భాగమైన హైదరాబాద్, మైసూర్, జోధ్‌పూర్ అశ్వదళాలు ఈ నగరంపై విరుచుకుపడ్డాయి. కేవలం కత్తులు, బల్లాలతో నగరంలోకి దూసుకుపోయిన బలగాలు అజేయమైన టర్కీ సైన్యాన్ని చిత్తుగా ఓడించాయి. ఈ మెరుపుదాడిలో దాదాపు 44 భారతీయ సైనికులు అసువులు బాసారు. అయితే, నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి భారతీయులకు ఈ విజయం ఓ సంబ్రమం. బ్రిటీష్ ఇండియా సైన్యాధిపతి ఇంటి ఎదురుగా ఈ విజయానికి గుర్తుగా ఏకంగా స్మారక చిహ్నాన్ని నిర్మించారు. మూడు ప్రాంతాల సైనికులకు గుర్తుగా ముగ్గురు సైనికుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్మారకానికి మూడు వైపులా ముగ్గురూ బల్లాలతో నిలబడి ఉంటారు. దాన్నే తీన్‌మూర్తిగా నామకరణం చేశారు. సైన్యాధిపతి ఇంటిని తీన్‌మూర్తి భవన్‌గా, ఆ చౌరస్తాను తీన్‌మూర్తి చౌక్‌గా పిలుస్తారు. తీన్‌మూర్తి భవన్ నెహ్రూ ప్రధానిగా ఉన్నన్ని రోజులు ఆయన అధికార నివాసంగా నిలిచింది. హైఫా విజయం ఇజ్రాయెల్‌కు కూడా కీలకమే. ఈ పట్టణం బ్రిటన్ చేతిలోకి రావడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూదులు ఈ నగరానికి తరలి రావడం మొదలైంది. మెల్లగా చుట్టుపక్కల యూదు కాలనీలు ఏర్పాటు చేసుకున్నారు. చివరకు ఈ పట్టణాన్ని బేస్ చేసుకొని 1948లో ఇజ్రాయెల్ అవతరించింది. ఆరు రోజుల పర్యటనపై ఆదివారం ఢిల్లీకి వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వందేళ్ల క్రితం నాటి చరిత్రాత్మక ఘట్టాన్ని స్మరిస్తూ తీన్‌మూర్తి స్మారక స్తూపాన్ని సందర్శించారు. ఉదయం ఆయన ఢిల్లీలో అడుగు పెట్టడానికి ముందే "మిత్రుడు నెతన్యాహుకు స్వాగతం" అంటూ ప్రధాని మోదీ ఇంగ్లిషు, హిబ్రు భాషల్లో ట్వీట్ చేశారు. ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి నెతన్యాహును స్వాగతించారు. ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. భారత్‌లో ఇజ్రాయెల్ ప్రధాని పర్యటించడం ఇది రెండోసారి. 2003లో అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని షెరాన్ తొలిసారి భారత్‌కు విచ్చేశారు. ఆదివారం సాయంత్రం తీన్‌మూర్తి చౌక్ వద్ద జరిగిన కార్యక్రమంలో మోదీ-నెతన్యాహు పాల్గొన్నారు. హైఫా విముక్తి కోసం జరిగిన పోరాటంలో భారత సైనికుల త్యాగం అనన్య సామాన్యమైనదని మోదీ కొనియాడారు. హైఫా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుందంటే అది భారతీయ సైనికుల త్యాగ ఫలితమేనన్నారు. హైఫాకు విముక్తి కలిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా తీన్‌మూర్తి చౌక్ పేరును తీన్‌మూర్తి-హైఫా చౌక్‌గా మార్చారు. 44 మంది సైనికుల సంస్మరణార్థం ఇప్పటికీ 61 అశ్వికదళం ఏటా సెప్టెంబరు 23ను 'హైఫా డే'గా జరుపుకొంటోంది. ఆదివారం రాత్రి నెతన్యాహు దంపతులకు ప్రధాని మోదీ విందు ఇచ్చారు.

పాక్‌కు సెగ పుట్టించాలి: రావత్

న్యూఢిల్లీ, జనవరి 14: జమ్మూ కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పే దిశగా మిలటరీ ఆపరేషన్లు చేపట్టేందుకు రాజకీయ కార్యాచరణ అవసరమని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలు నిలిపివేసేలా పాకిస్థాన్‌పై సైనిక చర్యలను పెంచాలని సూచించారు. ఆ రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సైనిక దళాలు పరిస్థితిని నియంత్రించేందుకు కొత్త వ్యూహాలు అమలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సరిహద్దు ఆవలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు నిలిపివేసేలా పాక్‌కు సెగపుట్టించేందుకు అవకాశం ఉందని నొక్కిచెప్పారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కఠిన వైఖరి అవలంబిస్తామని స్పష్టం చేశారు. 'ఆ దిశగా రాజకీయ కార్యాచరణకు ఇతర అన్ని కార్యాచరణలూ ఒకదానికొకటి తోడైనప్పుడే కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పగలం. అందుకు పొలిటికో-మిలిటరీ వైఖరిని మనం అనుసరించాలి' అని రావత్ పేర్కొన్నారు. 'కశ్మీర్ అంశాన్ని పరిష్కరించే యంత్రాంగంలో మిలటరీ ఒక భాగం మాత్రమే. రాష్ట్రంలో హింసను సృష్టిస్తున్న ఉగ్రవాదులు, తీవ్రవాదుల పనిపట్టడం, ఉగ్రవాదం వైపు ఆకర్షితులయ్యేవారి సంఖ్య పెరగకుండా అడ్డుకోవడమే మా పని' అని పేర్కొన్నారు.





కిమ్ అణుక్షిపణి గురిపెట్టేశాడు!

- హవాయిని హడలెత్తించిన 'అలర్ట్ మెసేజ్'లు

వాషింగ్టన్, జనవరి 14: అమెరికాలో ఓ ఉద్యోగి పొరపాటు హవాయి దీవుల్లోని ప్రజలను పరుగులెత్తించింది. అణుబాంబు దాడి జరగబోతోందంటూ ఆ ఉద్యోగి తప్పుడు బటన్ నొక్కడంతో దాదాపు 15 నిమిషాల పాటు భయంతో వణికిపోయారు. 'హవాయి దీవులే లక్ష్యంగా ఉత్తరకొరియా అణుక్షిపణిని ప్రయోగించింది. జనం అంతా వెంటనే సేఫ్టీ షెల్టర్లలో తలదాచుకోవాలి. ఇది మాక్ డ్రిల్ కాదు' అని అమెరికా ప్రభుత్వం దీవుల్లోని జనాల ఫోన్లకు ఆదివారం వార్నింగ్ మెసేజ్‌లు పెట్టింది. అయితే మానవ తప్పిదంవల్ల ఆ మేసేజ్ వచ్చిందని గుర్తించిన అధికారులు 10 నిమిషాల తర్వాత వెల్లడించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏది ఏమైనా అమెరికా, ఉత్తరకొరియాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో జరిగిన ఈ ఘటన అగ్రరాజ్యం భద్రతపై పలు ప్రశ్నలు వెలుగులోకి వచ్చాయి.

వలస కార్మికులు ద్వితీయ శ్రేణి పౌరులా?

- పాస్‌పోర్టులో చిరునామా తొలగించడంపై రాహుల్ ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 14: పాస్‌పోర్టులోని చివరి పేజీలో పాస్‌పోర్టుదారు చిరునామాను ప్రచురించరాదన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. మోదీ సర్కారు వలస కార్మికులను ద్వితీయ శ్రేణి పౌరులుగా భావిస్తోందని, ఇది బీజేపీ సంకుచిత ధోరణికి నిదర్శనమని రాహుల్ ట్వీట్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇక నుంచి నివాస ధ్రువీకరణ కోసం పాస్‌పోర్టు ఉపయోగపడదు. పాస్‌పోర్టు చివరి పేజీలో ఇప్పటివరకు పాస్‌పోర్టుదారు తండ్రి లేదా సంరక్షకుడి పేరు, తల్లి పేరు, భార్య లేదా భర్త పేరు, చిరునామా ప్రచురించేవారు. ఇక నుంచి పాస్‌పోర్టులో ఆ వివరాలు కనిపించవు.

వారిని మైనారిటీలుగా గుర్తించలేం: ఎన్‌సీఎం

న్యూఢిల్లీ, జనవరి 14: వైదిక బ్రాహ్మణులు, సింధీలను మైనారిటీలుగా గుర్తించేందుకు జాతీయ మైనారిటీల కమిషన్(ఎన్‌సీఎం) నిరాకరించింది. ఈ అంశంలో ప్రపంచ బ్రాహ్మణ సంస్థ, పూర్వోత్తర్ బహుభాషీయ బ్రాహ్మిణ్ మహాసభ అభ్యర్థనను ప్రభుత్వం అంగీకరిస్తే.. రాజ్‌పుత్‌లు, వైశ్యులు వంటి ఇతర కులాల వారు కూడా ఇదే డిమాండ్ చేసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది.

రైల్వేలో క్లోక్ రూమ్స్, లాకర్ చార్జీల పెంపు

న్యూఢిల్లీ, జనవరి 14: రైల్వేలో క్లోక్ రూమ్స్, లాకర్ల చార్జీలు పెంచాలని రైల్వేబోర్డు నిర్ణయించింది. ఈ మేరకు లాకర్లు, క్లోక్ రూమ్స్ వినియోగ చార్జీలను నిర్ణయించే అధికారాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్లకు కట్టబెడుతూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతమున్న సేవలను ఆధునీకరించడంతో పాటు కంప్యూటరైజ్డ్ విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుత విధానంలో లాకర్‌ను 24 గంటలు ఉపయోగించుకుంటే రూ.20, అదనంగా మరో 24 గంటలకు రూ.30 వసూలు చేస్తున్నారు. గతంలో 24 గంటలకు చార్జీ రూ.15 ఉండేది.

ఐరాసలో భారత అధికారి ట్విట్టర్ హ్యాక్

న్యూఢిల్లీ, జనవరి 14: ఐక్యరాజ్యసమితిలో భారత్ తరపున శాశ్వత సభ్యుడిగా ఉన్న సయ్యద్ అక్బరుద్దీన్ ట్విట్టర్ ఖాతా హ్యాక్‌కు గురైంది. ఆదివారం హ్యాకర్లు ఆయన వాల్‌పై పాకిస్థాన్ జెండా, ఆ దేశ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ ఫొటోలను పోస్ట్ చేశారు. మధ్యాహ్నానికి ట్విట్టర్ ఆ ఖాతాను పునరుద్ధరించింది. 'నేను తిరిగొచ్చాను. నన్ను దిగజార్చాలనుకునే వారు హ్యాకింగ్‌కు మించి ప్రయత్నించాల్సి ఉంటుంది' అని అక్బరుద్దీన్ ట్వీట్ చేశారు.

'శత్రు' ఆస్తుల వేలం.. ఖజానాకు లక్ష కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 14: లక్ష కోట్ల రూపాయల విలువైన దాదాపు 9,400కుపైగా 'శత్రు' ఆస్తులను వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. పాకిస్థాన్, చైనా దేశాల్లో పౌరసత్వం పొందినవారికి సంబంధించిన ఇక్కడి ఆస్తుల గుర్తింపు ప్రక్రియను కేంద్ర హోంశాఖ ప్రారంభించిందని అధికారులు తెలిపారు. 1968 నాటి శత్రువుల ఆస్తుల(సవరణ-విలువ మదింపు) చట్టానికి ఇటీవల చేసిన సవరణ ద్వారా ఆ ఆస్తులపై పూర్తి హక్కులు భారత సర్కారుకు సంక్రమించిన విషయం తెలిసిందే.

రాజీ చర్చలు!

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ చలమేశ్వర్, ఎంబీ లోకూర్, కురియన్.. ముగ్గురితో బీసీఐ భేటీ అయ్యింది. జస్టిస్ రంజన్ గొగోయ్ మాత్రం ఢిల్లీలో లేకపోవడంతో ఆయన్ను కలవడం కుదరలేదు. సుప్రీంజడ్జీలు జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఎస్ఏ బాబ్డే కూడా జస్టిస్ చలమేశ్వర్‌ను చీఫ్ జస్టిస్ సూచన మేరకు కలిశారు. సంక్షోభానికి వీలైనంత త్వరగా ముగింపు పలకాలన్న ఉద్దేశంతో ఉన్న సీజేఐ సోమవారం ఫుల్‌కోర్టును సమావేశపర్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదే విజ్ఞప్తితో ఎస్‌సీబీఏ ఒక తీర్మానం చేసింది. తీర్మానం ప్రతిని సుప్రీం బార్ అధ్యక్షుడు వికాస్‌సింగ్ సీజేఐని కలిసి అందజేశారు. సోమవారం సుప్రీం ఫుల్ కోర్టు సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ప్రస్తావించిన అంశాలపై ఈ సందర్భంగా చర్చ జరిగే అవకాశం ఉంది. సుప్రీంకోర్టులో సీజేఐతోసహా ప్రస్తుతం 25 మంది జడ్జీలు ఉన్నారు. బీసీఐ ఆదివారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జీలు జస్టిస్ ఆర్‌కే అగర్వాల్, జస్టిస్ ఖాన్విల్కర్, జస్టిస్ అరుణ్ మిశ్రాను కలిసింది. వివాద పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై బీసీఐ బృందం వారితో చర్చించినట్లు సమాచారం. సీబీఐ జడ్జి బీహెచ్ లోయ మృతిపై దాఖలైన పిల్ విచారణను జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్‌కి సీజేఐ కేటాయించారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసునూ ఈయనే విచారిస్తున్నారు. సుప్రీంకోర్టులోని మిగిలిన న్యాయమూర్తులతోనూ బీసీఐ బృందం భేటీ కానుంది.

సీజేఐకి మాజీ జడ్జిల బహిరంగ లేఖ

చర్చలు నడుస్తుండగా మరోవైపు నలుగురు మాజీ న్యాయమూర్తులు సీజేఐని ఉద్దేశించి బహిరంగ లేఖ రాశారు. కీలకమైన కేసుల కేటాయింపు సక్రమంగా జరగడం లేదంటూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశానికి వీరు మద్దతు పలికారు. ఈ లేఖపై సంతకాలు చేసినవారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీబీ సావంత్, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా, మద్రాసు, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ కె.చంద్రు, జస్టిస్ హెచ్.సురేశ్ ఉన్నారు. కేసుల కేటాయింపునకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలను తక్షణమే రూపొందించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. విధివిధానాలను ఖరారు చేసే వరకు పెండింగ్ కేసులతోసహా కీలకమైన కేసులన్నింటినీ ఐదుగురు సీనియర్ జడ్జీలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి కేటాయించాలని సూచించారు.

జడ్జిలంతా సమానమే: స్వామి

సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సీనియర్లు, జూనియర్లుగా పేర్కొనడాన్ని బీజేపీ ఎంపీ సుబ్రమణియన్ స్వామి తప్పుపట్టారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా సమానమని పేర్కొన్నప్పుడు ఇక అంతరాలు ఎక్కడుంటాయని సీనియర్లను ప్రశ్నించారు. పని విభజనలో ఒక్కటేనని స్వామి వ్యాఖ్యానించారు.

నాన్న మృతిపై అనుమానాల్లేవ్: అనుజ్

'నా తండ్రి మృతిపై గతంలో అనుమానాలు ఉన్న మాట నిజమే! కానీ, ఇప్పుడెలాంటి అనుమానాలు లేవు. దయచేసి.. మా కుటుంబాన్ని వేధించకండి' అంటూ సీబీఐ జడ్జి లోయా కుమారుడు అనుజ్ ఆదివారం ముంబయిలో విలేకరుల సమావేశంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు. 'అప్పుడు నాకు 17 ఏళ్లు. నా తాతకు, బంధువులకు ఏదో అనుమానం కలిగి చెప్పిన విషయాలతో నేను ఆవేశపడ్డాను. అనుమానాలు ఉన్నాయని చెప్పాను. ఇప్పుడు కుటుంబంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు' అని వెల్లడించాడు. అనుజ్ ప్రస్తుతం లా రెండో సంవత్సరం చదువుతున్నాడు. లోయా భార్య ఆరోగ్యం బాగోలేదని, ఆమెకు చికిత్స అవసరమని కుటుంబ న్యాయవాది చెప్పారు.


తమిళనాడు సంప్రదాయ సాహసక్రీడ 'జల్లికట్టు' ఆదివారం ప్రారంభమైంది. సంక్రాంతి సందర్భంగా మదురైజిల్లా అవనియాపురం, పలమేడు, అలంగనల్లూరు ప్రాంతాల్లో ఎద్దుల కొమ్ములను పట్టుకుని అణచివేసేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో 100 మంది గాయపడగా.. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. - చెన్నై, ఆంధ్రజ్యోతి



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Balanagar (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.